న వ భా ర తి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

7 జనవరి 1960

మూల్యం : రూపాయి

న వ భా ర తి కా ర్యా ల యం
గాంధీనగరం * విజయవాడ-2

నవ భారతి ★ జనవరి 1960

విషయ సూచిక

ఏదె పరిపూర్ణాధారము	సంపాదకీయము	3
యోగదర్శనము	వేలూరి శివరామశాస్త్రి	6
కల్పవృక్షము - సిద్ధాశ్రమకథ		13
నాట్యశాస్త్రమ్	పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి	17
అస్పృశ్యత	మహాత్మగాంధీ	25
గోవింద రామాయణము	ఆత్మకూరి గోవిందాచార్యులు	27
గాలివాన	"అమరేంద్ర"	31
కృత్రిమగ్రహాలు	వసంతరావు వేంకటరావు	42
విష్ణువు ఎవరు?	గోపదేవ్	49
కవి - బడిపంతులు	శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి	53
నాన్యః పంథా	"లసూనా"	55
విశ్వకళ	కల్లూరి చంద్రమౌళి	56
ఉపనిషద్వాక్యములు	ధూళిపాళ రామచంద్రశాస్త్రి	60
సామాన్యములనుగూర్చిన జ్ఞానము	బెర్ట్రండ్ రసెల్ అనువాదం జి. యస్. యన్	61
నందమూరు శతకము	విశ్వనాథ సత్యనారాయణ	66
మాసఫలములు	'బుధ'	69

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 2 | విజయవాడ * జనవరి 1960 | సంచిక 4

మన వాదములకు ఏది పరిపూర్ణాధారము ?

మనము నీటిని, భూమిని, వాయువును, అగ్నిని, ఆకాశమును, సూర్యచంద్రులను, నక్షత్రములను చూచుచున్నాము వీనినిగురించి యోచించుచున్నాము వీని గుణతత్వములనుగురించి పరిశీలించి వివేచన చేయుచున్నాము, వీని స్వభావస్వరూపములను నిర్ధారణ చేయవలయునని ఆశించుచున్నాము. మనమీ ప్రయత్నము అనుశృతముగా చేయుచునే యున్నాము. కాని మనమీ ప్రయత్నములో యెంతవరకు కృతకృత్యులము కాగలిగితిమి? ఎప్పటికప్పుడు చేయబడిన తాత్కాలిక నిర్ణయములు సర్వసామాన్యములని యనుకొనుటకే తోడ్పడుచున్నవి. సామాన్యులు వీనినిగురించి యే నిర్ణయమునకు రాకనే ప్రపంచమున వ్యవహారము నడుపుకొనుచుండిరి. సంపన్నులైన విజ్ఞానవంతులకు సామాన్యులైన వ్యవహారవర్తనులకు విభాగము చేయకతప్పదనియే మానవప్రయత్నము రుజువు చేయుచున్నది. మానవులందరూ జీవించుచున్నారు మానవుని జీవితమును ప్రకాశవంతము, తేజోవంతము సకల సద్గుణసంపన్నము చేసుకొని ఆనందప్రదముగా మార్చుకొనవలయునని ప్రయత్నించుచున్నాము ఈ ప్రయత్నములో నెంతవరకు కార్యసిద్ధిని పొందగలిగితిమి? ఇది ప్రశ్నార్థకముగానే మనముందున్నది

ఒక్కొక్క విషయమును పరిశీలించి దాని స్వరూపస్వభావములను నిర్ణయించి, దాని గుణగణములను తర్కించి నిర్ధారణ చేయుచు ఒక్కొక్క శాస్త్రవిభాగముగా దానిని రూపొందించిన మానవుని ప్రయత్నము కనబడుచున్నది ఈప్రయత్నము అనంతకాలముగా సాగుచునే యున్నది. తనతోపాటు జీవించుచున్న వృక్షములు, పశువులు, పైరులు, పక్షులు తదితరములైన జలచరములు క్రిమికీటకాదులు వీటినిగురించిన సంబంధబాంధవ్యములు తత్ తత్ పర్యవసానఫలితములు ఒక్కొక్కశాస్త్రముగా రూపొంది మానవుని జీవితము సుఖప్రదము, ఆనందమయము చేయువలయునని వివరించుచున్నవి. మానవుని కివియన్నియు తోడ్పడి వీటికి మానవునికి ఒక విధమైన భేదమున్నదని నిరూపించుచున్నవి. వీటన్నిటినీ, మానవుని ప్రవృత్తినీ, వాని గుణదోషములను, స్వరూపస్వభావాదులను తర్కించి వివేకించి విషయవివరణ చేసినవారందరూ యీ విభేదమును పాటించిరని స్పష్టపడుచున్నది మానవుడు తనకుతానై సృష్టించుకొన్న యీ విభజనవల్ల యీ ప్రకృతిధర్మములనుండి విడివడవలయునన్న ప్రయత్నములో సఫలీకృతుడు కాలేదు. ఇదియొక అనంతమైన యత్నముగా కనిపించుచున్నది ఇది హేతువాదమునకు, తర్కవాదమునకు పట్టుబడని విషయము. ఇందులోని సాధ్యాసాధ్యములను గమనించిన యిది నిర్ధారణకు నిరూపితము కానిదని తేల్చి చెప్పవచ్చును. అయినను మానవప్రయత్నము జరుగుచునే యున్నది మానవుని యీ కార్యసిద్ధికి పలువిధములైన విశ్వాసములను కల్పించుకొని ఆశావాదులై కృషి చేయుచున్నటుల

యున్నది. ఈ కృషిఫలితము యే విధముగా పరిణమించునన్న భావము ప్రశ్నార్థకమే. ఈ ప్రశ్నకు సమాధానము పొందవలయునని కొందరు దైవమును ఆరాధించిరి. మరికొందరు దైవభావమునకు వ్యతిరేకవాదములను సమకూర్చిరి. ఈ ద్విభావములలోని వాదప్రతివాదములను సమర్థించుకొనుటకు వివిధ మతములను వివిధ సంప్రదాయములను, వివిధములైన వ్యవహారములను సమకూర్చుకొని వాదవివాదములతో తార్కికబుద్ధిని పెంపొందించిరి ఈనాడు యీ తార్కికబుద్ధి ప్రమాణము విపరీతస్థాయికి వచ్చినది. ఈ విపరీతమైన బుద్ధి వికాసమే యీ నవీన ప్రపంచములోని సమస్యలన్నిటికి కారణము.

నవీన ప్రపంచమని సనాతన ప్రపంచమని వివరించే ఒకవిధమైన కృత్రిమవాదమును పెంపొందించిరి ఇది యీనాడు మానవుని సహజసౌందర్యారాధనను వివేక విహీనముచేసి నిర్జీవరూపముగా మార్చుచున్నది ఈ నిర్జీవరూపమే యీనాటి యీ యాంత్రికజగత్తు. యీ యాంత్రిక పరిజ్ఞానము నానాటికి అధికమై మానవుని దక్షతను పెంపొందించి మానవుని సహజసాధుస్వభావమును వికృతపరిచి, మానవునికీ యంత్రమునకూ సహజస్వభావము ఒకటేనని నిర్ధారణచేసి, సహజప్రపంచమున కన్ననూ యాంత్రిక ప్రపంచమే మిన్నయని నిరూపించు ప్రయత్నము జరుగుచున్నది అంటే యీ నవీనప్రపంచము మానవ నిర్మితమైనది. సనాతన ప్రపంచము సహజమైనది. అంటే ఆదిమకాలమునాటిది ఈ రెండు ప్రపంచములు మానవనిర్మితములే అయినా యీ మానవ నిర్మితమైన నవీన సనాతనప్రపంచములకు యీ అగాధమును యెందుకు యేర్పరచిరి? మానవ నిర్మితమైన యీ అగాధమును అర్థముచేసుకొని నవీనసనాతన ప్రపంచమును సామరస్యముతో నడుపకలిగిన మానవజీవితము నవరసభరితమై కళాప్రపూర్ణమై మహదానందమై సుమపరిమళ పరివ్యాప్తిని విశ్వజనీనము చేయవచ్చును.

సనాతనప్రపంచమనగా తనకుతానై యేర్పడునది తనకుతానై జీవించునిది. తనకుతానై వికసించునది తనకుతానై వ్యాప్తిని చెందునది. నవప్రపంచమనగా తనకుతానై యేర్పడనిది తనకుతానై జీవించలేనిది. తనకుతానై వ్యాప్తి చెందలేనిది. ఈ విభిన్నమార్గములను సమన్వయపరచి నడిపించగలిగిన శక్తినే మానవ స్వభావమని యనుచున్నాము. మానవ స్వభావము వివిధవిధముల వికసించుచున్నది. ఈ వికాసవ్యాప్తి ఒక్కొక్కదశలో ఒక్కొక్క రీతిగా ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధమున వ్యక్తము చేయబడుచున్నది దీనిని అర్థము చేసుకొనలేనివారు, దీని అర్థమును నిరాకరించినవారు దీని స్వభావస్వరూపములను గమనించలేనివారు అన్నికాలములలో నున్నారు.

తనకుతానై జీవించగల ననునది నశించును తదితరులచే జీవితనిర్మాణము పొందునది నశించును ఇవి రెండును నశించునని అందరికి తెలియును ఒకటి సనాతనము అనగా ఇది యెలా యేర్పడి నడచుచున్నదో తెలియదు గనుక రెండవది మానవునిచే నిర్మించబడి మానవునిచే నడుపబడి మానవునిచే నిర్మూలించబడుచున్నది. సనాతనము నవీనము అను విభజన యీ చిక్కులకు మూలకారణము సనాతనము నవీనము పరస్పరాశ్రయములు. ఇది వ్యవహారములో వివరించతగినదికాని శాస్త్రసమ్మతము కాదు.

మనకు కాలము తెలియదు. మనము కాలగమనమును గుణించలేము. కాలమును యెంత సూక్ష్మీకరించినా మనకా కాలగమనములోని శక్తి యిదియని తెలియదు. అయినా ప్రతిఒక్కరూ యిది భూతకాలము, యిది వర్తమానకాలము, యిది భవిష్యత్ కాలము అని గణనచేయుచున్నటుల చెప్పుచునే యుందురు. మనకు భూతకాలము తెలియదు, వర్తమానకాలము తెలియదు. భవిష్యత్ కాలము తెలియదు. ఈ తెలియని విషయములపై తెలిసినవారికన్న మిన్నగా గ్రంథములపై గ్రంథములు వ్రాయుచునే యున్నారు. తర్కవితర్కములను చేయుచునే యున్నారు. వాదోపవాదములను పెంచుకొనుచునే యున్నారు ఇవి యేఒక్క సమస్యను పరిష్కరించగలిగినవని నిరూపించగలమా? మన వాదములకు పరిపూర్ణాధారములను చూపగలమా? లేదు. లేదు. కాదు. కాదు. అని సమాధానము చెప్పక తప్పదనిపించుచున్నది.

యోగదర్శనము

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

౭

యోగమునకు పునాది

యోగదర్శనము, జ్ఞాన కర్మయోగములు రెండును ముక్తికి రెండు మార్గము లని చెప్పును. క్రమక్రమముగా ౨౪ తత్త్వముల నెరిగి తుద కిరువది యయిదవ తత్త్వమగు పురుషుడు తానే యని తెలియుట జ్ఞానయోగము. తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధానము. వీని ననుసరించుట కర్మయోగము. ప్రణిధాన మనఁగా భక్తి. కావున ఇచట కర్మయోగ మనగా భక్తియోగమని చెప్పవచ్చును. చెప్పవచ్చునని యనుటయే కాదు, యోగమతమున కర్మయోగ మనినను భక్తియోగ మనినను ఒకటియే. అది యటుండె. ఈ రెండు యోగములలో మొదటిదగు జ్ఞానయోగము, 'తత్త్వముల దెలియుట ముక్తి' యని చెప్పును. తెలియుట యనగా తత్త్వముల గడగడ అప్పజెప్పి వానిని నిర్దుష్టముగా నుపన్యసించుట గాని వానిగూర్చి గ్రంథరచన చేయుటగాని కాదు ఇది పరోక్షజ్ఞానము. ఇఁక సాక్షాజ్జ్ఞానమునందే తత్త్వములు స్ఫురించును. తుట్టతుదకు నేను ప్రకృతికంటె వేరయినవాడను అని అనుభవము కలుగును. తత్త్వములను తెలియుట యనగా తత్త్వాధిగమము

చిత్తము సంస్కారములకు పుట్ట. ఇవి జ్ఞానమునకు అడ్డు ఈగోడ పడగొట్టుటకు సాధన పలుగు. మరియు తత్త్వవిచారముచే బుద్ధిశుద్ధి యెంత ముఖ్యమో శరీర హృదయములయు పరిశుద్ధి అంత ముఖ్యము దీనికి అష్టాంగయోగసాధన. ఈసాధన చేయదలచువారికి హృదయము విశాలమగుటకును తేటయగుటకును కొంత భావనా శక్తి కావలసియుండును. ఈ భావనాశక్తి చిత్తమును విశాలపరచి సత్త్వముచే నింపించును మనవిగాని పరులవిగాని క్లేశములు మన మనసును మథించును, వాని నడుమ మన ముండకతప్పదు. ఇటు లున్నను భావనాశక్తి మనల కలత చెందనీయక హృదయమును ఆర్ద్రమొనరించును. దీనివలన మనసులోని మకిలపోయి శుక్లధర్మము నెలకొనును. శుక్లధర్మమనగా ప్రసన్నత. ప్రసన్నచిత్తము తత్త్వాధిగమమునకు తగియుండును. చిత్తప్రసాదము సమత్వమును వైశాల్యమును శాంతిని చేకూర్చును. మైత్రీభావన, కరుణాభావన, ముదితాభావన, ఉపేక్ష అనునవి భావనా విశేషములు.

సుఖ మనుభవించు జీవులయెడ మైత్రీభావనయును దుఃఖ మనుభవించు జీవులయెడ కరుణాభావనయును పుణ్యాత్ములఁజూచి ముదితాభావనయును అపుణ్యాత్ములయెడ నుపేక్షయును చేయుట యభ్యసింపవలయును. వీనిలో మొదటిదాని వలన ఔదార్యము, రెండవదానివలన అన్నిటితో స్నిగ్ధత, మూడవదానివలన ప్రస

న్నత, నాల్గవదానివలన ఔదాసీన్యము, అనునవి కలుగును. ఉపేక్షాబుద్ధి ఇతరుల పాపస్పర్శను తప్పించును. పాపస్పర్శచే చిత్తమునకు క్లేశము కలుగును. ఈ తెరగున ఆయా భావనలు ప్రసన్నతను కల్యాణస్పృహను స్ఫూర్తిని ధర్మప్రవణతను చిత్తమున మేలుకొలిపి ఇతోఽధికమగు జ్ఞానసాధన కధికారమును వృద్ధిచేయును. ఇటువంటి భావనలు ముముక్షువుల చిత్తమును సంస్కరించును.

యోగము

అష్టాంగయోగము చిత్తనిరోధమున కుపకరణము. చిత్తనిరోధమే యోగము. యోగశబ్దము నానార్థములం దుపయుక్తము. కాని పాతంజలముననో యోగపదమునకు చిత్తవృత్తినిరోధ మనియే అర్థము. పరమాత్మతో చిత్తసంయోగముకూడ యోగమే. భక్తిమార్గమునందు యోగశబ్దము భగవదనుధ్యానమునందు వాడబడుచుండును. కాని పాతంజలముననో వృత్తివిలయమునందే వాడబడును.

వృత్తు లేవేని అగుగాక అవి చిత్తమువే. చిత్తముతో పురుషున కెట్టి సంబంధమును లేదు కాని అవిద్యచే ఈ సంబంధము వచ్చిపడును. సమ్యాధివలన కలుగు ప్రజ్ఞచే బొడమిన వివేకము ప్రకృతి పురుషులను వేరుపరచి పెట్టును ఇదియే యోగమున చరమార్థము వివేకమువలన అవిద్య తొలగును, ఆత్మఖ్యాతి పొడమును. వివేకఖ్యాతితో సాధన సరి. ఈశ్వరప్రణిధానముచే సత్త్వము కలుగును. అది బాధాదికమును తొలగించి వివేకము కలిగించుటకు సాయపడును. కాని అది అపరోక్షజ్ఞానమును కలిగింపనేరదు. అశుద్ధిని శోధించుటకు యోగాంగానుష్ఠానము. యమము నియమము ఆసనము ప్రాణాయామము ప్రత్యాహారము ధారణ ధ్యానము సమాధి అనునవి యోగాంగములు.

యమము

అహింస సత్యము అస్తేయము బ్రహ్మచర్యము అపరిగ్రహము ఇవి యమము మనోవాక్కాయ కర్మలచే ప్రాణిని కష్టపెట్టకుండుటయే కాక మైత్ర్యాది భావనతోడను తత్పోషణతోడను ఇది కూడియుండవలయును. భావనలో నేని మాటలోనేని ఏకొంచెము హింస యున్నను అది అహింస కాదు ఇట్టి అహింస స్వభావమై పోయినవానికడ వైరము ఉండదు వాని చిత్త మహింసచే సత్త్వోద్రిక్తమగును. అట్టివాని చిత్తసత్త్వము పరిసరములలోనికి వచ్చిన జీవచిత్తముల నన్నిటిని లోగొనగలిగిన శక్తికి ఆస్పదమగును దానికి లోబడిన ప్రాణులన్నియు దానివలె నిర్వైరము లయిపోవును ఈ చిత్తమైత్రీభావన పరచిత్తము లందును మైత్రీభావనను తెచ్చిపెట్టును.

విన్నది విన్నటులు చెప్పినది చెప్పినట్లు ప్రకటము చేయుట సత్యము. ఇట్టి సత్యము నలవరచికొనిన వాని పలుకు అవ్యర్థము పల యనిన వానిలో సత్యమును, దాన బొడమిన దృఢేచ్ఛయు సుప్రతిష్ఠితమైపోవును ఇట్టి సత్యమును

వారు ప్రాణుల కల్యాణమున కుపయోగింతురేకాని అపకారమున కుపయోగింపరు. అటులేని అది హింసలో జమ. యోగులకును అపకృతికిని చాల దవ్వు.

న్యాయముగా పొందరానిదానిని కోరుట స్తేయము. అట్టిదానిని కోరకుండుటయే అస్తేయము, ఇట్టి అస్తేయసిద్ధి కలిగినచో రత్నములన్నియు లభించును. ఏమియు కోరనివాని కెల్లయు చేకూరునను మాట యోగులయెడ నిండునిక్కము.

వీర్యధారణారూపమగు వ్రతము బ్రహ్మచర్యము. దాన అణిమాదులు సిద్ధించును. మరియు బ్రహ్మచర్యమున నెలకొనిన వాని ఉపదేశము శిష్యుని మనమున తూపువలె నాటుకొనును.

కావలయుదానికంటె నెక్కుడిసుమంతయు చేకొనకుండుట అపరిగ్రహము. కూడబెట్టువారికి విషయాసక్తి యుండును కూడబెట్టిన దానిని కాపాడుటకు శ్రమ తప్పదు. కూడినది పోయినచో దుఃఖము. అపరిగ్రహములో రహస్యము, కూడబెట్టకుండుట. భోగ్యములు తుచ్ఛములని తెలిసినచో శరీరము తుచ్ఛమని తెలియును. దాన మనసు విరమించును. దీన శరీరము వేరు మనసు వేరు అని ఎరుక కలుగును. ఇది తెలియుచో వెనుక జన్మమున నే నెటులుంటిని? ముందెటులు కాబోవుదును? ఈ శరీరమేమి? నేనేమి?' అను ఆలోచన సాజముగా కలుగును. యోగికి భోగ ప్రాచుర్యము కూడదు. అది సిద్ధికి అడ్డు. దానయోగులు ప్రాణధారణ మాత్రము చూచికొందురు గాని కూడబెట్టరు. ఈ దెస యమము మనోవాక్కాయకర్మలతోడి మహావ్రతము.

నియమము -

శౌచము సంతోషము తపము స్వాధ్యాయము, ప్రణిధానము ఇవి నియమము. కాయాదిశుద్ధి శౌచము. ఎంత తోమికొనినను కొలదికాలమునకే శరీరము మలపూర్ణమగును. ఇది తెలిసి యోగి శరీరముదెస ప్రీతి పొందకపోవు టటుండగా అప్రియమును వహించును. ఇంతియకాక అతడు పరశరీరసంసర్గము కోరడు. శౌచము వలన సత్త్వము శుద్ధమగును. దాన మనోమాలిన్యము తొలగును. దాన ఏకాగ్రత కుదురును. దాన ఇంద్రియ జయమును దాన ఆత్మదర్శన యోగ్యతయు ఏర్పడును.

తృష్ణాక్షయము సంతోషము. కోరికలవలన కోరికలకే వృద్ధి. దాన మనసునకు నిలుకడ చిక్కదు. ఇహపరసుఖము లెంతలేని, ఎన్నియేని, అవి యన్నియు తృష్ణాక్షయమువలన గలుగు సుఖములో అవంతేని కావని పెద్దలందురు.

అనాయాసముగా లభించినదానియెడనే తృప్తికలుగును గాని కోరికపెట్టుకొనినచో అది గొంతము కోరికలలోనికి దింపును. కోరికలో ధీరత్వము నష్టమగును. స్థైర్యము చెదరును. అస్థిరతకును యోగమునకును చుట్టరికము సున్న.

తపస్సనగా ప్రాణాయమాదికము. అట్టి తపస్సును తిన్నగా చేయుచో శరీరము నావరించిన మలము తొలగును ఆకలి, దప్పి, నిశ్చలముగా కూరుచుండజాలక పోవుట, నియమములేని ఊర్పునిట్టూర్పులు ఈ మొదలగునవి శరీరమలములు ఈ మలములు తొలగునెడల చిత్తశరీరముల లంకె విడివడును. దాన ఇచ్ఛాశక్తిప్రభావము, కలిమి, అణిమాదులు, ఇంద్రియసిద్ధి, దూరశ్రవణాదులు, ఇట్టి కాయసిద్ధి కలుగును. యోగమున కంగమగు ఈతపమును యోగులు పరమార్థము దెసకే వినియోగింతురు ద్వంద్వములను సహించుటయు తపస్సులోనిదే దీనివలన మనశ్శరీరములకు దృఢత్వమును. వ్రతమును కొనసాగించు శక్తియు కలుగును. మరియు ఈ తపస్య మనోవాక్కాయములను యోగానుకూలములనుగా ఒనరించును.

స్వాధ్యాయము అనగా వేదపఠనము మోక్షశాస్త్రపఠనము మరియు ప్రణవజపము. పఠనమువలన బ్రహ్మాసక్తి కలుగును. ప్రణవజపమువలన బ్రహ్మానుప్రవేశము కలుగును. మఱియు ఇట్టి స్వాధ్యాయమువలన దేవర్షి సిద్ధదర్శనమును దాన ఇష్టప్రాప్తియు కలుగును.

జపము చేయువారికి సామాన్యముగా జపించు మంత్రమునకు గల అర్థము దెస చూపుఉండదు దాన జేసియే 'తజ్జప స్తదర్థభావనమ్' (౧-౨౮) అనియు 'శబ్దార్థ జ్ఞాన వికల్పైః సవితర్కా సమాపత్తిః (౧-౪౨) 'స్మృతిపరిశుద్ధౌ స్వరూపశూన్యే వార్థమాత్రనిర్భాసా నిర్వితర్కా' (౧-౪౩) అనియు చెప్పబడెను. చేతులు శివునిమీద, చిత్తము చెప్పులమీద' అను సామెత జపితల కెక్కు డెరుక స్వాధ్యాయమునందు స్థిరత చేకూరునెడల మంత్ర మంత్రార్థభావన చాలకాలము చేయుట కనువుపడును. అటు లనువుపడుటలో గల స్థిరత్వముతో దేవతాదుల జూచుకోరిక గలిగినయెడల ఆకోరిక వమ్ముకాదు స్వాధ్యాయమునకును దేవాది దర్శనమునకును గల సంబంధము ఈ స్థైర్యము

ప్రణిధానమనగా ఈశ్వరప్రణిధానము ఈశ్వరునకు సర్వభావములను అర్పించునెడల సమాధి సిద్ధించును సర్వభావార్పణమనగా భావనచే ఈశ్వరునిలో తన్ను ముంచివేసికొనుట భక్తియోగ భాషలో ప్రపత్తి లేక శరణాగతి ఇట్టివానికి సమాధి సిద్ధించును సమాధిసిద్ధి కతన దేహాంతరమందును దేశాంతరమందును కాలాంతరమందును జరగినవియు జరుగుచున్నవియు నగు విషయములు తెల్లమగును.

యమనియమాదులు పరంపరాసంబంధముచే సమాధిని సిద్ధింపజేయును ఈశ్వర ప్రణిధానము సాక్షాత్సంబంధముచే సమాధిని కలిగించును ఇది సమాధికి అనుకూల భావనారూపము. ఆ భావన సాంద్రమై శరీరమును నిశ్చలముగను (ఆసన) ఇంద్రియములను విషయవిరతములుగను (ప్రత్యాహార) చేయును. దాన ధారణయు ధ్యానముగా పండి తుదకు సమాధిగా మారును.

ప్రణిధానమువలననే సమాధి సిద్ధించునేని యమనియమాదికమగు యోగాంగము లేలయని శంక కలుగవచ్చును. సమాధి గాఢమగు ధ్యానావస్థయే. ధారణైకతానతయే ధ్యానము. సమాధి సిద్ధించునెడల యోగాంగములన్నియు దాననుండనే యుండును కాన మిగిలిన యోగాంగములను మాని సాధకుడు తొట్టతొలుత నుండియు ప్రణిధానపరాయణులగువారికి సాజముగనే సమాధి సిద్ధించును. మరియు సంప్రజ్ఞాతా సంప్రజ్ఞాతక్రమమున కైవల్యాలాభము కలుగును.

ఇక యమనియమములలో ఏదే నొకటి నష్టమయినచో అంతయు నష్టమగును.

ఆ స న ము

చిత్తము దేనియందేని చాలసేపుఉంచుటకు శరీరస్థిరత కావలయును. సౌఖ్యము లేనిచో అది కొరవడును. కావున నిశ్చలమును సుఖావహము నగు ఉపవేశనము ఆసనము పద్మాసనము వీరాసనము భద్రాసనము స్వస్తికాసనము దండాసనము సోపాశ్రియము పర్యంకము క్రౌంచనిషదనము హస్తినిషదనము ఉష్ట్రనిషదనము సమసంస్థానము అను ఈ ఆసనములు స్థిరసుఖములు.

శరీరమునకు కదలిక కలిగించు యత్నమేమియు చేయ కూరక కూరుచున్న ఆసనసిద్ధి కలుగును శవమున కెక్కడపెట్టిన కాలుసేతులక్కడనే యుండును. అందు శవప్రయత్నమేమియు లేదు చిత్తము ననంతసమాపన్న మొనరించినను ఆసనసిద్ధి కలుగును అనంతుడనగా భూమి మోయుశేషుడు శేషాహికదలుచో భూమి తలకిందగును కావున నతనివలె నుండవలయునని భావన చేయవలయునని కొందరు వక్కాణింతురు మరికొందరు ఆకాశము లేక శూన్యమోయన చిత్తము నలవరుచుచో ఆసనము సిద్ధించునని వక్కాణింతురు. మొదట మొదట కష్టపడని యెడల ఆసనము సిద్ధింపదు. కొంచెమెక్కువసేపు కూరుచున్నయెడల పలుతావులలో పీడ కలుగుచుండును. ఈ పీడ పాచుటకు ప్రయత్నశైథిల్యము శూన్యవద్భావన ఉపదిష్టము. ఈ రెంటివలనను నిశ్చలత కుదిరినచో శరీరము కూరుచున్న నేలతో అంటుకొని పోయినటులై భూమితోపాటు అయిపోవును. ఇంకను స్థిరమగునేని శరీరమున్న చందమే తోచదు. నాయీ శరీరము శూన్యమైన తెరగుగా అనంతమగు ఆకాశమున కలిసిపోయెను, నేను ఆకాశమువంటివాడను' అను భావన అనంతసమాపత్తి

ఆసనసిద్ధుడగు యోగి చలి యెండలచేగాని ఆకలిదప్పులు మొదలగు జంటలచేగాని బాధపడడు. ఆసన స్థైర్యముచే శరీరమనంత సమాపన్నమగు నెడల బోధశూన్యత (anaes thesis) తటస్థించును. దాన ద్వంద్వములు తెలియవు.

మన మందఱమును సామాన్యముగా గాలి పీల్వవలయునని పీల్తుము. విడువవలయునని విడువము ఈ రెండు పనులును వానియంతన అవి జరగిపోవుచుండును. ఈ యూర్పు నిట్టూర్పుల ప్రవాహవేగమును అరికట్టినయెడల మనసునకు కుదిరిక అమరును ఏకాగ్రతకిది ఆవశ్యకము.

ప్రాణాయామము

ఊపిరి నిట్టూర్పులకు నిలుకడ కలిగించు నేరుపరితనమే ప్రాణాయామము. ఆసనము మేని నిలుకడను కలిగింపగా ప్రాణాయామము ప్రాణమునకు నిలుకడ (సంయమము) కలిగించును. ప్రాణగతి సమనియతమైనచో ఆ ప్రాణము శాంతిబడసి మహాప్రాణమునం దనుప్రవిష్ట మగును

ఊర్పు నిట్టూర్పుల నడుమనున్న విరామమును పెంపగల నేరుపు ఎంత పెరిగిన అంత మేలు. ఈ విరామము పెరిగినకొలది ప్రాణాపానములకు స్థితికలుగును. దానితో పాటు అంతఃకరణ వృత్తులకును విరామమేర్పడును. ప్రాణజయమువలన ప్రాకాశా వరణము తొలగిపోవును. క్రమముగా జ్ఞానము వికసించును.

హఠయోగులు తొలుత రేచకము పిదప పూరకము పిమ్మట కుంభకమును చెప్పుదురు. అందఱును సామాన్యముగా అటులే చేయుదురు వాసిష్ఠము మొదలగు వానిలో ఆంతర బాహ్యాదిభేదము లెన్నియో కలవు. ఈరాజయోగమున ఆప్రక్రియ లేదు. గాలిపీల్చి వెనువెంటనే విడువనిచో ఊర్పునిట్టూర్పులకు గతివిచ్ఛేదము కలుగును. రాజయోగము ఇది ఒక ప్రాణాయామమని చెప్పును. ఇటులే నిట్టూర్చి వెనువెంటనే గాలి పీల్వనియెడల నదియు నొక ప్రాణాయామ మగును. పూరకాంత రేచకాంతము లెట్టివయినను శ్వాసప్రశ్వాసములకు కొంత విరామము కలిగించుట ఒక ప్రాణాయామము ఇట్టి ప్రాణాయామమును విరామమును నెమ్మది నెమ్మదిగా పెంచుచు నభ్యాసము చేయవలయును. ప్రాణాయామమును కేవలము గ్రంథములలో చదివిచేయుట తగదు. యోగదర్శనమునందే రేచకాంత ప్రాణాయామము 'ప్రచ్ఛర్దన విధారణాభ్యామ్' (౧-౩౪) అను సూత్రమున గలదు ఇంకను సాధన పాదమున మరికొన్ని విధములగు ప్రాణాయామములు చెప్పబడెను. వీని నభ్యసించిన యోగులకడ తెలిసికొని సాధకులు మెలమెలగా ప్రాణాయామమునకు అలవాటు పడవలెను. గ్రంథములలో చూచి చేసి చెడినసాధకు లున్నారు ఇటులు చేయుట అనారోగ్యమును పిలిచి తెచ్చికొనుటయే.

ప్రత్యాహారము

ఇంద్రియములు తమతమ విషయములనుండి ఉపరమము చెందుట ప్రత్యాహారము. చిత్తమును నిరోధించునెడల ఇంద్రియములును చిత్తస్వరూపము ననుకరించి నటులగును. తేనెటీగల రాణి యెగిరిన యెడల మిగిలిన యీగలన్నియు ఎగిరినటులును అది కూర్చుండినచో ఇవియు కూరుచుండినటులును చిత్తము లేచుచో ఇంద్రియములును లేచును, చిత్తము నిరుద్ధమగుచో ఇంద్రియములును నిరుద్ధమగును.

శబ్దాదులయెడ వ్యసనములేకుండు టింద్రియ జయమని కొందరందురు. వ్యసనమనగా ఆసక్తి. (వి + అస్యతి ఏనమ్ ఇతివ్యసనమ్, అని వ్యుత్పత్తి.— శ్రేయస్సునుండి తొలగించునది వ్యసనము) శాస్త్రములకు విరుద్ధముకాని శబ్దాది విషయసేవన మింద్రి

యజయమని మరికొందరందురు. పారతంత్ర్యము పొందక స్వేచ్ఛాపూర్వకమయిన శబ్దాది విషయాస్వాదము ఇంద్రియజయమని ఇంకొంద రందురు. అనగా భోగపారతంత్ర్యములేని భోగమింద్రియజయమని తాత్పర్యము. రాగముగాని ద్వేషముగాని లేక సుఖదుఃఖములు పొందక శబ్దాదులనెరుగు టింద్రియజయమని ఇతరులందురు. ఇవి యన్నియు ప్రచ్ఛన్నమగు ఇంద్రియలౌల్యమే. అనాసక్తితో పాప మొనరించు నెడల అనాసక్తితోడనే నిరయప్రాప్తి నిప్పును ముట్టుకొనిన యెడల కాల్చునని తెలియువా డందు కాలు పెట్టడు, అనాసక్తముగను పెట్టడు. అసక్తముగను పెట్టడు. పరతంత్రతతోడను పెట్టడు, స్వతంత్రతతోడను పెట్టడు. పారమార్థికవిషయము నెరుగక పోవుటయే విషయములందు స్వేచ్ఛాపూర్వకమగు సక్తికి కారణము. కావున నివి యెల్ల ఇంద్రియజయము కావు మరి ఇంద్రియజయమేది యని యడుగుదురు. ఇచ్ఛామాత్రముచేతనే చిత్తనిరోధముతో పాటు ఇంద్రియ నిరోధముగూడ అయెనేని దానికి మించిన యింద్రియజయమని ఒకటి ఉండదని జైగీషవ్యు డనెను. ఈ ప్రత్యాహారమువలన అట్టి యింద్రియవశ్యత కలుగును

పురుషుడు 'క్లేశకర్మ విపాకాశయై రపరామృష్టః పురుష విశేష ఈశ్వరః' అను సూత్రముచే జెప్పబడిన పురుషవిశేషుడు కాడు. పూర్వసిద్ధుడగు హిరణ్యగర్భుడు లేక జగత్కర్తయు గాడు 'ఇంద్రియేభ్యః...' అను కరమునకు సాంఖ్యులు వ్యాకరించియు యోగులు పరీక్షించియు చెప్పిన పురుషతత్త్వము. తన్నుదాను తిన్నగా దెలియునెడల జీవుడే పురుషుడు. మాండూక్యము- 'అదీర్ఘ మహ్రస్వమి' త్యాది 'నేతి' రూపముగా చెప్పిన వా డీ పురుషుడు:

శ్రీ మద్రామాయణ కల్పవృక్షము - శిల్పదృష్టి

సి ద్ధా శ్ర మ క థ

౨

ఇది సిద్ధాశ్రమ మౌను నీ కరుణచే నీ సిద్ధకార్యంబు సే
యుదు లెమ్మన్న నధోక్షజుం డదితి యాస్యోద్గారి కాంతిచ్ఛటల్
పదునై తల్లితనంబు క్రొమ్మెఱుఁగులన్ బాలింప నాతల్లి యా
వదనంపుంబద నింతరాచి శిశువై బాలుండనై యొప్పుచున్.

ఇది వామనావతార కథ. కశ్యప ప్రజాపతి వచ్చి శ్రీ మహావిష్ణువును తన గర్భమునందుదయించుమని యడిగెను. అడుగగా_అధోక్షజుడు వెంటనే శిశువై బాలుడై, ప్రకాశించుచు-శిశువై, బాలుడై, అంతలోనే శిశువైనాడు, అంతలోనే బాలుడైనాడని యర్థము. ఎట్లు శిశువైనాడు? అతిదియొక్క- ముఖమునుండి వినిర్గమించుచున్న కాంతి సమూహములు పదునెక్కి-తల్లి తనములోనున్న మెఱుగులను పాలింపగా- ఆమె మొగమునందలి పదనురాచి- శిశువయ్యెను అనగా అదితి భగవంతునివంక పురిటి బాలింతరాలివలె చూచెను. అప్పుడే పుట్టిన బిడ్డవంక తల్లియైన స్త్రీ ఎట్లు చూచునో అట్లు చూచెను ఆ చూపునందలి తీవ్రమైన మాతృప్రేమ చేత పరమేశ్వరుడు వెంటనే శిశువయ్యెను ఆమె యట్లు చూచుటచేత పరమేశ్వరుడు శిశువుగా భాసించెననికాదు, నిజముగానే శిశువయ్యెను ఒక స్త్రీ ఒక పురుషునివంక నంత వాత్సల్యముతో చూచినంతనే వాడు శిశువగునా యన్నది ప్రశ్న. అతడు పరమేశ్వరుడు, ఆమె అదితి. అందుచేత నగుదురు వారైనంతమాత్రము చేత నగుదురా? అగుదురు. ఏలయనగా- వారు తైజసాకృతులు. అంతకుమించి భావాకృతులు సర్వసృష్టియు భావాశ్రయము వారి భావమే, తేజస్సే-మానవులకు సంకల్పము. క్రియారూపముగా పరిణమించుటకు కాలము పట్టును దేవతలకుకూడా పట్టవచ్చును. భావమయుడైన పరమేశ్వరునకు భావోదయమే తత్క్రియా, పరిణామముకూడా నగును. ఈ యర్థమంతయు నిందులో నుండుటయే కాక అదితియొక్క- మాతృవాత్సల్యాతిశయము సముదయించుట తడవుగా పరమేశ్వరుడు శిశువయ్యెనని వ్రాయుట కవితాచమత్కా-రముగా భాసించుచున్నది ఇందులోని చమత్కా-రముపైని చెప్పబడిన యర్థమే పాఠకులు-మరియు నేటి పాఠకులు ఇట్టి భావములో కవితా చమత్కా-రమున్నదను కొందురు. ఆ యనుకొనుటకు హేతువు వారి మనస్సులలో నేదియో లీలగా నాడుచుండుటయే. ఇదమిద్ధమని తెలిసికొనలేని కొన్ని భావములు రమణీయములై, భావుకులయందు నిది కవిత్వమురా యనిపించుచుండును. దాని వెనుకనున్న భావమును వారు సరిగా నూహింపలేరు గనుక- ఊహింపలేక పోయినను వారి యాత్మకేదియో తెలిసినట్లుండుట యాత్మలక్షణము గనుక- అట్లు తెలిసికొనుటకు పరమ సూక్ష్మమైన తత్త్వము తెలిసికొనవలయును. తత్త్వమును చెప్పుటయే కవిత్వము దాని స్వరూపము సరిగా నవగతముకాక, రమణీయముగా నాత్మయందు భాసించునప్పుడు కవిత్వమను కొందురు. ఏది కవిత్వమని యనిపించునో దానివెనుక నొక తత్త్వమున్నది ఆ తత్త్వము సామాన్యమానవుల బుద్ధికి గోచరింపదు. జీవుడు మాత్రము తనకు నెమరునకురాని తన జీవ లక్షణమునకు తెలిసియుండినటువంటి యా తత్త్వమును లోన- దూరముగా కనిపించీ కనిపించనట్లు కనిపించగా నది కవిత్వమనుకొనును ఈ పద్యములో నీ రమణీయమైన భావమున్నది. వెనుకనున్న తత్త్వమది ఈ భావమును అదితియు, విష్ణువు- వారికి సంబంధించి వ్రాయబడగా తత్త్వము తత్త్వమైయుండి పైకి కవిత్వముగా భాసించుచున్నది. ఇట్లే లోకసామాన్యులైన తల్లి

బిడ్డల విషయములో వ్రాసినచో తత్త్వమును చెప్పుటయే యగును గాని ఆ లోకసామాన్యులైన వారి విషయములో యథార్థముకాదు. లోకసామాన్యమైన వారి విషయములో నొకడు చెప్పును. పాఠకులు దానిని కవిత్వమనుకొందురు. అనుకొనుటకు కారణము దాని వెనుకనున్న యీ భావము, దానిని జీవుడు స్పృశించి కవిత్వమని సంతోషించును ఆ లోకసామాన్యులైన తల్లి బిడ్డల విషయములో ఇది సంగతము కాదని భావించడు. తన హృదయము ఇదమిద్ధమని నిర్ణయించుకోలేని యీ యనిస్పష్టముగా నున్న భావము, తనయాత్మకు మాత్రమే తెలిసిన యీ భావము, తన మనస్సునకందని యీ భావము, కవిత్వముగా నెన్నుకొని సంతోషించును. భావుకత్వములో నూటికి తొంబదిపాళ్లు ఇట్లుండును.

సురలుం గాశ్యపుఁడిట్లు చూచెదరు శ్రీకుండంతలో వామన
స్ఫురణంబొప్పఁ గిలారునవ్వులును రజ్జుల్ వింత విజ్జోడు సం
బరముల్ జందెము నొంటిప్రోవు గొడుగుల్ బాఁకోళ్ళు నాశ్వత్థ సుం
దర దండంబు శిఖాకమండలు ముఖాంతత్రయ్యధీతిచ్ఛటల్.

దేవతలును, కశ్యప ప్రజాపతియు చూచుచుండగనే యీ వాలుండు వామనుడైనాడు కిలారునవ్వులు, మొదలైనవి స్వయముగా నుద్భూతములైనవి అంతయును మాయయే. అంతయును భావాశ్రితమే అంతయును సంకల్పమాత్ర సముద్భూతమైనదే కిలారునవ్వులు, వింత విజ్జోడుసంబరములు, జందెపు ఒంటిప్రోవు, గొడుగు, పాకోళ్లు- ఇవి యన్నియు తెలుగు మాటలే. తెలుగు దేశములోని బ్రాహ్మణవటువు యొక్క స్వరూపసాక్షాత్కారము. ఆశ్వత్థ సుందరదండము, శిఖ, కమండలువు, త్రయీధ్వానము, ఇవి సంస్కృతశబ్దములు. బ్రహ్మచారి లక్షణము సగము సంస్కృతముగా సగము తెలుగుగా చెప్పబడినది వేదధర్మమును, లోకాచారమును, కలిసి వటువేష మేర్పడునని దీని తాత్పర్యము వటువేషమేమి? ఏ వేషమైనను వేదముల ననుసరించి ధర్మశాస్త్రములు చెప్పిన విషయములు కొన్ని, లోకాచారము కొంత- కలిసియై యగును పెండ్లికొడుకైనను నిట్లే

పటుయానంబుల నొప్పి యయ్యదితినంబా! తాను వైరోచ నుం
డట లోకాద్భుత యజ్ఞదీక్షితుఁడటే యందేగెదన్ బుత్రలం
పటతన్ స్రుక్కకు కంట నీరిడకుమమ్మా! యంచు నా వంచనా
వటు వేగెన్ బలిసద్మమచ్చట స్వముస్వాహోజ్వల ద్వహ్నిగా

అతడు తల్లియెదుట పటుయానంబుల నొప్పెను సమర్థమైన నడకలతో నడచుచుండెను. పిల్లవాడు బలహీనుడు కాడు. పటుశబ్దములోని రమ్యత ఇది ఎందుకనగా- తాను బలిచక్రవర్తి వద్దకుపోదును పంపించమని తల్లి నడుగబోవుచున్నాడు తల్లి యంగీకరించవలయును బలహీనుడైనచో, అసమర్థతాలక్షణమున్నచో, తల్లి యొప్పుకొనదు అందుచేత పటుయానములు ప్రదర్శించినాడు. 'వైరోచనుడట, లోకాద్భుత యజ్ఞదీక్షితుడట, నేనచ్చటికి వెళ్ళెదను- పుత్రలంపటతచేత నీవు స్రుక్కవద్దు, కంటనీరు పెట్టవద్దు, అని యా వంచనావటువు వెళ్ళెను తల్లి యంగీకరించినదో లేదో మనకు తెలియదు. తల్లితో చెప్పుటయేగాని, యామె యంగీకరించుట యనునది లేదు ఏలననగా- ఇది యిదివఱకే బహుస్థలములకు వెళ్ళివచ్చెడి కొడుకు 'అమ్మా వెళ్ళివత్తునని' చెప్పిపోవును. తల్లి నోటితో యంగీకరించనక్కఱలేదు లోకములో పురుషుడు పలుచోట్లకు వెళ్ళి వచ్చుచుండును ఫలానాచోటికి వెళ్ళివత్తునని చెప్పును. సరే వెళ్ళివచ్చునని

ఇంటిలోనివా రనుకొందురు. వామనుడాస్థితిలో నుండెనని యర్థము. అప్పుడే పుట్టినవాడైనను వాని లక్షణము పలుచోట్లకు వెళ్ళివచ్చెడివానివలె నున్నది. ఎట్లున్నది? అప్పుడే శిశువై, అప్పుడే బాలుడై, అప్పుడే వటువైనవాని లక్షణ మింకెట్లుండును?

ఇదియొక విచిత్రమైన కల్పన. లోకమునందు ఎనిమిది తొమ్మిదేండ్లమీద జరుగు స్థితిని రెండు పద్యములలో రెండు మూడు నిముషములలో జరిగిన దానినిగా చెప్పుట! ఇందులోని యౌచిత్యము, సర్వమును, భావాశ్రమై. నిత్యమైన భగవద్విషయమగుట. భగవంతుని విషయములో నిట్లు వ్రాసినచో యౌచిత్యము. మానవుల విషయములో వ్రాసినచో యనౌచిత్యము.

ఒగి వటువెంత యందముగ నుండె నటందువటన్న లక్ష్మణుం
డగు వటువెంత యందముగనైనను నుండునటన్న రాముఁడున్
నగవు మొగంబుతోడఁ బయినన్ గథ చెప్పుడటన్న వామనుం
డెగురుచుఁబోయి మూడడుగు లిమ్మన నిచ్చెను దైత్యరాజునున్.

కథ యైపోయినది. విశ్వామిత్రుడు లక్ష్మణుని: 'బ్రహ్మచారి ఎంత అందంగా ఉన్నాడంటావు?' అని యడిగెను. లక్ష్మణుడు 'ఎంత అందంగానైనా ఉంటాడు' అనినాడు. అడిగినది లక్ష్మణుని, రాముని గాదు. ఆ రాముడే పూర్వమా వటువు! విశ్వామిత్రుడు రాము నెందు కడుగును? అడిగినచో- 'అప్పుడు నీ వెట్లున్నావయ్యా?' అని యడిగినట్లు. అది తెలివితక్కువ వాడడుగవలయును. విశ్వామిత్రుడడుగడు. పైగా విశ్వామిత్రుడు, ఈ రాముని, ఆ వామనుని మనసా ధ్యానించుచున్నవాడు. అడిగినది లక్ష్మణుని. ఆ ధ్యానవిషయములో తానెట్టివాడో లక్ష్మణుడును నట్టివాడే. ఇద్దరూ సధర్ములు. అందుచేత లక్ష్మణునే యడిగెను. రాముడు నవ్వు మొగముతో తరువాతి కథ చెప్పుమన్నాడు. ఈ నవ్వుమొగముతో నన్న మాటలో రాముని మాయామానుష విగ్రహత్వమున్నది. తానే పరమేశ్వరుడనని రామునకు తెలియును- తెలియదు! రాముడు నవ్వుటలో విశ్వామిత్రుని చమత్కారమునకు సంతోషించినట్లు కనిపించును. విశ్వామిత్రుడును, లక్ష్మణుడును పిచ్చివాండ్రనుకొనినట్లు భాసించినను భాసించవచ్చును! రామచంద్రుడు నిజముగా నప్పుడు నవ్వెనో లేదో తెలియదు. రామచంద్రుని మొగమెప్పుడునూ నవ్వుచునే యుండును. అది పరమేశ్వర లక్షణము. భగవద్గీతలోని 'ప్రహసన్నివ భారత' అన్న మాటలోని తత్సమయమునందు వాఖ్యానింపతగిన యర్థముకాక, కేవల పరమేశ్వరత్వ లక్షణ నిరూపకమైన యర్థము. రాముడు నవ్వుచునే యుండును. ఆ నవ్వుట పరమేశ్వరభావము.

ఇందులో 'వామనుం డెగురుచుపోయె' అని యున్నది. అనగా యోగమార్గమున బలి యజ్ఞవాటికకు వెళ్ళెనని యర్థము. మరియును ఎంత పండితుడైనను, ఎంత సమర్థుడైనను ఎనిమిదేండ్ల పిల్లవాడుగదా! శరీరలక్షణమైన బాల్యావస్థా క్రియాద్యోతకమైన మాటఇది. పరిణత ప్రజ్ఞయు, శరీరనిబద్ధమైన బాల్యావస్థలక్షణములును యీ కల్పవృక్షమునందు- ఇక్కడనే కాదు- శివధనుర్భంగాది సమయములందు శ్రీరామచంద్రునియందు కూడ పలుచోట్ల నిరూపింపబడినది. ఇది లోకములోని చమత్కారము. ఏడెనిమిదేండ్ల పిల్లవాండ్రుందురు. పూర్వజన్మ సంస్కార విశేషమున వారికా వయసునాటికే ఎంతో చదువు వచ్చియుండును. తండ్రి పిలిచి బంధువులవద్ద స్నేహితులవద్ద, పెద్దమనుష్యుల వద్ద, వాని విద్యాప్రదర్శనము చేయించును. విన్న వారాశ్చర్యపోదురు. ఆ పిల్లవాడక్కడనుంచి వదలివెళ్ళినంతనే- గోలీకాయలాడుకొనును. ఇందులోని రహస్యమిది.

పుట్టుచునే బలింగనఁగ బోయినబిడ్డ మఱట్టు పోయిరాఁ
డట్టె మఱేమియయ్యెనని యాబుపి యాబుపినింగి కొప్పులన్
దట్టె నటంచుఁ జెప్పనరుదారఁగ వించును జూచుచుండు నా
బొట్టియ కోసమై యదితి పొంచివగర్చుచు నాఁటి నేఁటికిన్

యీ పద్యములో నొక విలక్షమైన భావమున్నది. ఆ భావముయొక్క ఇదమిద్ధత్వము చెప్పరానిది. కాని అనంతమైన కాలముతో నీ యవతారకథలు జరుగుమనే యుండును అందు కోసమే యవతరించిన పరమేశ్వరుడా కార్యమైన తరువాత మరల రావలసిన యవసరమేలేదు ఆ కారణముకోసమవతరించెను కారణాంతమున నా యవతారమూర్తియే లేదు అక్కడ నిల్లులేదు, నింటికి తిరిగివచ్చుట లేదు అదితి యాయనకోసము చూచెనో లేదో! శతవిధాల చూడనేలేదు కాని ఇట్లు చెప్పుటలో లోకమునందు కొడుకు దూరదేశములకు పోయి తిరిగి రానిచో- నిత్యమైన మాతృ ప్రతీక్షాభావము చెప్పబడినది.

లోకమునందలి యొకానొక దుఃఖరేఖావిషయము అదితి యందారోపింపబడి కథకు యథార్థమన్న భ్రాంతి నాపాదించుచున్నది పాఠకుని మనస్సును రసజగత్తునందు ప్రవేశింపజేయు మార్గములలో నిదియొకటి.

శ్రీ భరతముని ప్రణీత

నాట్యశాస్త్రమ్

ఆంధ్రభారతి

డాక్టర్, శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం. ఏ., ఎం. లిట్, పిహెచ్. డి.

చతుర్థోఽధ్యాయః—తాండవలక్షణమ్

19. పరివృత్తక రేచితము

శిరసస్తూపరి స్థాప్యౌ స్వస్తికౌ విచ్యుతౌ కరౌ
తతః సవ్యం కరం చాపి గాత్ర మానమ్య రేచయేత్. ౨౦౯

పున రుత్థాపయే త్తత్ర గాత్ర మున్నమ్య రేచితమ్
లతాఖ్యౌచ కరౌ కృత్వా వృశ్చికం సంప్రయోజయేత్. ౨౧౦

రేచితం కరిహస్తంచ భుజంగత్రాసితం తథా
ఆక్షిప్తకం ప్రయుంజీత స్వస్తికం పాదమేవచ. ౨౧౧

పరాఙ్ముఖ విధి ర్భూయ ఏవమేవ భవే దిహ
కరిహస్తం కటిచ్ఛిన్నం పరివృత్తకరేచితే. ౨౧౨

నితంబము, స్వస్తికరేచితము అనుకరణముల నాడి, విక్షిప్తాక్షిప్తక కరణముతో శరీరమును వంచి, తర్వాత లతావృశ్చిక కరణముతో శరీరమును పైకిఎత్తి, ఉన్మత్తకరణమును ప్రయోగించవలెను. కరిహస్తమును రేచితముగావించి, భుజంగత్రాసిత ఆక్షిప్తకములను యోజించవలెను తర్వాత పాదస్వస్తికనుపట్టి బద్ధాచారీతో నితంబకరణమును ప్రయోగించవలెను ఇంతవరకు చెప్పి కరణములను నలుదిక్కుల యందు ప్రయోగించి, కరిహస్త కటిచ్ఛిన్న కరణములను చివరకు ప్రేక్షకులకు అభిముఖముగా ప్రయోగించిన పరివృత్తకరేచితమను అంగహారము సిద్ధమగును.

20. వైశాఖ రేచితము

రేచితౌ సహగాత్రేణ హ్యాపవిద్ధౌకరౌ యదా
పున స్తేనైవ దేశేన గాత్రమున్నమ్య రేచయేత్. ౨౧౩

కుర్యా న్నూపురపాదంచ భుజంగత్రాసితం తథా
రేచితం మండలంచైవ బాహుశీర్షే నికుంచయేత్. ౨౧౪

ఊరూద్వృత్తం తథాక్షిప్త మురోమండలమేవచ
కరిహస్తం కటిచ్ఛిన్నం కుర్యా ద్వైశాఖరేచితే. ౨౧౫

వైశాఖరేచిత కరణమును మొదట అంగద్వయముతో ప్రయోగించి శరీరమును ఎత్తి రేచితము చేయవలెను. తర్వాత నూపుర, భుజంగ త్రాసిత, ఉన్మత్త, మండలస్వస్తిక, నికుట్టక, ఉరూద్వృత్త, ఆక్షిప్త ఉరోమండల, కరిహస్త, కటిచ్ఛిన్నములను కరణములను వరుసగా ప్రయోగించిన వైశాఖరేచితమను అంగహారము రాగలదు.

21. పరావృత్తము

ఆద్యంతు జనితం కృత్వా పాద మేకం ప్రసారయేత్
తథై వాలాతకం కుర్యాత్ త్రికంతుపరివర్తయేత్. ౨౧౬
అంచితం వామహస్తంచ గండదేశే నికుట్టయేత్
కటిచ్ఛిన్నం తథాచైవ పరావృత్తే ప్రయోజయేత్. ౨౧౭

దక్షిణాంగముతో జనితకరణమును ప్రయోగించి, శకటాస్యకరణముతో పాదమును ప్రసారించవలెను పిమ్మట అలాతకము, భ్రమరకము అను కరణములను యోజించవలెను. కరిహస్తమను కరణము నాడుచు అంచిత వామహస్తమును గండస్థలమున నికుట్టితము చేయవలెను. చివరకు కటిచ్ఛిన్నమును ప్రయోగించగా పరావృత్తమను అంగహారము వచ్చును.

22. అలాతకము

స్వస్తికం కరణం కృత్వా వ్యంసితౌచ కరౌపునః
అలాతకం ప్రయుంజీత ఊర్ధ్వజాను నికుంచితమ్. ౨౧౮
అర్థసూచీచ విక్షిప్త ముద్వృత్తాక్షిప్తకే తథా
కరిహస్తం కటిచ్ఛిన్న మంగహారే హ్యలాతకే ౨౧౯

మండలస్వస్తిక, వ్యంసితమండల స్వస్తిక, వ్యంసితము లను నాల్గుకరణములను ముందుగా ప్రయోగించి, తర్వాత అలాతక, ఊర్ధ్వజాను, నికుంచిత' అర్థసూచీ, విక్షిప్త, ఉద్వృత్త, ఆక్షిప్త, కరిహస్త, కటిచ్ఛిన్నములను కరణములను వరసగా ప్రయోగించిన అలాతకమను అంగహారము సిద్ధించును.

23. పార్శ్వచ్ఛేదము

నికుట్య వక్షసి కరా ఊర్ధ్వజాను ప్రయోజయేత్
ఆక్షిప్తస్వస్తికం కృత్వా త్రికంతు పరివర్తయేత్. ౨౨౦
ఉరోమండలకౌ హస్తౌ నితంబం కరిహస్తకమ్
కటిచ్ఛిన్నం తథాచైవ పార్శ్వచ్ఛేదే విధీయతే ౨౨౧

వృశ్చికకుట్టిత, ఊర్ధ్వజాను, ఆక్షిప్తక, స్వస్తికము, లను కరణములను ప్రయోగించి త్రికపరివర్తన గావింపవలెను. పిమ్మట ఉరోమండల, నితంబ, కరిహస్త, కటిచ్ఛిన్నము లనుకరణములను వరుసగా ప్రయోగించగా పార్శ్వచ్ఛేదమను అంగహారము వచ్చును.

24. విద్యుద్భ్రాంతము

సూచీ వామపదం దద్యా ద్విద్యుద్భ్రాంతంచ దక్షిణమ్
దక్షిణేన పునః సూచీ విద్యుద్భ్రాంతంచ వామతః. ౨౨౨
పరిచ్ఛిన్నం తథాచైవ హ్యతిక్రాంతం చ వామకమ్
లతాఖ్యం స కటిచ్ఛిన్నం విద్యుద్భ్రాంతశ్చ సస్మృతః ౨౨౩

వామాంగముతో అర్థసూచీ, దక్షిణాంగముతో విద్యుద్భ్రాంతము, దక్షిణాంగముతో అర్థసూచీ, వామాంగనుతో విద్యుద్భ్రాంతము అను కరణములను క్రమ

ముగా ప్రయోగించవలెను. పిమ్మట ఛిన్నకరణము నాడి, అతిక్రాంత కరణముతో లతావృశ్చికమును ప్రయోగించి, కటిచ్ఛిన్నమును యోజించగా విద్యుద్భ్రాంతమను అంగహారమగును.

25. ఉద్వృత్తకము

కృత్వా నూపురపాదంతు సవ్య వామౌ ప్రలంబితౌ
కరౌ పార్శ్వే తత స్తాభ్యాం విక్షిప్తం సంప్రయోజయేత్. ౨౨౪
తాభ్యాం సూచీ తథాచైవ త్రికంతు పరివర్తయేత్
లతాఖ్యం సకటిచ్ఛిన్నం కుర్యా దుద్వృత్తకే సదా. ౨౨౫

నూపుర, భుజంగాంచితక, గృధ్రావలీనకములను కరణములను రెండుచేతుల తోను ప్రయోగించవలెను తర్వాత విక్షిప్తమును యోజించి, సూచీకరణమును చూపవలెను బద్ధాచారీతో త్రికపరివర్తనమున నితంబకరణము నాడి, లతావృశ్చిక మును, కటిచ్ఛిన్నమును యోజించగా ఉద్వృత్తకమను అంగహారము రాగలదు.

26. ఆలీఢము

ఆలీఢవ్యంసితౌ హస్తౌ బాహుశీర్షే నికుట్టయేత్
నూపుర శ్చరణో వామ స్తథాలాతశ్చ దక్షిణః. ౨౨౬
తేనైవాక్షిప్తకం కుర్యా దురోమండలకౌ కరౌ
కరిహస్తం కటిచ్ఛిన్న మాలీఢే సంప్రయోజయేత్. ౨౨౭

ఆలీఢస్థానకమున వ్యంసితకరణము నాడి, నికుట్టకరణమును యోజించవలెను. పిమ్మట వామాంగముతో నూపురమును, దక్షిణాంగముతో అలాతకమును చూప వలెను. దక్షిణాంగముతో నాపై ఆక్షిప్తకమును జూపి, ఉరోమండలము, కరి హస్తము, కటిచ్ఛిన్నములను కరణములను యోజించగా ఆలీఢమను అంగహారము సిద్ధించును.

27. రేచితము

హస్తంతు రేచితం కృత్వా పార్శ్వమానమ్య రేచయేత్
పునస్తేనైవ యోగేన గాత్ర మానమ్య రేచయేత్. ౨౨౮
రేచితం కరణం కార్య మురోమండలమేవచ
కటిచ్ఛిన్నంతు కర్తవ్య మఙ్గహారే చ రేచితే ౨౨౯

హస్తరేచనమును తెలుపు కరణములన్నియు ప్రథమ శ్లోకమున సూచింప బడుచున్నవి. ఈ కరణములను స్వబుద్ధితో యోజించుచు శ్లిష్టముగా చేయవలెను. వీటికి అంగాంగిభావమును కూర్పవలెనని భావము. కావుననే విచిత్రభేద సంకీర్ణమైనదీ అంగహారము

స్వస్తికరేచిత, అర్ధరేచితక, వక్షఃస్వస్తిక, ఉన్మత్తక, ఆక్షిప్తరేచిత, అర్ధ మత్తల్లి, రేచిత నికుట్టిత, భుజంగత్రస్తరేచిత, నూపుర, వైశాఖరేచిత, భుజంగాంచి తక, దండకరేచిత, వృశ్చికరేచిత, వ్యంసిత, వివృత్త, వినివృత్త, వివర్తితక, గరుడ

ప్లుతక, మయూరలలిత, సర్పితక, స్ఖలిత, ప్రసర్పితక, తలసంఘట్టిత, వృషభక్రీడితక, లోలితములను ఇరువదియైదు కరణములలో రేచిత హస్తప్రయోగము కలదు. వీటిని వైచిత్ర్యముతో నాలుగు దిక్కులయందు ప్రయోగించవలెను. ఈ కరణములను ప్రయోగించి పార్శ్వమును వంచి రేచితము చేయవలెను. శరీరమునుగూడ వంచి రేచితము చేయవలెనని చెప్పుటచే చక్రమండల కరణ వ్యవహితముగా నీ కరణ పరంపరను ప్రయోగించవలెనని భావము. చివరకు ఉరోమండలము, కటిచ్ఛిన్నము అను కరణములను ప్రయోగించగా రేచితాంగహారము రాగలదు.

28. ఆచ్ఛురితము

నూపురం చరణం కృత్వా త్రికంతు పరివర్తయేత్
వ్యంసితేనతు హస్తేన త్రికమేవ వివర్తయేత్. ౨౩౦

వామం చాలాతకం కృత్వా సూచీ మత్రైవ యోజయేత్
కరిహస్తం కటిచ్ఛిన్నం కుర్యా దాచ్ఛురితే సదా. ౨౩౧

నూపుర, భ్రమరకము లను, కరణములనాడి వ్యంసిత, నితంబ, అలాతక, సూచీ, కరిహస్త, కటిచ్ఛిన్నములను వరుసగా యోజనచేయగా ఆచ్ఛురితమను అంగహారము సిద్ధించును.

29. ఆక్షిప్త రేచితము

రేచితౌస్వస్తికౌ పాదౌ రేచితౌస్వస్తికౌ కరౌ
కృత్వా విశ్లేషమేవంతు తేనైవ విధినా పునః. ౨౩౨

పున రుత్క్షేపణం చైవ రేచితై రేవ కారయేత్
ఉద్వృత్తాక్షిప్తకే చైవ హ్యురోమండలమేవచ ౨౩౩

నితంబం కరిహస్తంచ కటిచ్ఛిన్నం తథైవచ
ఆక్షిప్తరేచితో హ్యేష కరణానాం విధిః స్మృతః ౨౩౪

ఏయేకరణమున చేతులుగాని, పాదములుగాని రేచితస్వస్తికములు గావలెనని చెప్పబడినదో ఆ కరణములన్నియు నిట ప్రయోగింపబడవలెను. స్వస్తికరేచిత, పృష్ఠస్వస్తిక, దిక్స్వస్తిక, కటీసమ, ఘూర్ణిత, భ్రమరక, వృశ్చికరేచిత, పార్శ్వనికుట్టక, ఉరోమండలక, సన్నత, సింహాకర్షిత, నాగాపసర్పితము లను కరణములను నిట ప్రయోగింపవలెనని భావము. వక్షఃస్వస్తి కాదులయందు హస్తరేచన లేదు గనుక వాటినిట గ్రహింపరాదు.

ఈ కరణముల ననుసరించి హస్తపాదస్వస్తికములను, రేచితములను వైచిత్ర్యముతో నాడి, స్థిరమగు హస్తపాదములకు ఉత్క్షేపణమును జూపవలెను. ఈ ప్రక్రియ నెచ్చట ఏరీతిగా చేయవలెనో ఆ విషయము నా కరణమే సూచించును. ఇది యెట్లనగా- ఊర్ధ్వజానువును చూపి దానిపై లతాహస్తము నుంచవలెనని దండపక్షమున గలదు. ఇట్లే లలాటతిలకమున, తలవిలాసితమున, నిసంభితమున, విద్యుద్భ్రాంతమున, గజక్రీడితమున, నితంబమున, విష్ణుక్రాంతమున కాననగును.

ఈ ప్రక్రియను ప్రయోగించిన తర్వాత ఊరూద్వృత్త, ఆక్షిప్త, ఉరోమండల, నితంబ, కరిహస్త, కటిచ్ఛిన్నము లను కరణములను వరుసగా యోజించిన ఆక్షిప్త రేచితమను అంగహారము సిద్ధము కాగలదు.

30. సంభ్రాంతము

విక్షిప్తంకరణం కృత్వా హస్తపాదం ముఖానుగమ్
వామసూచీ సహాకృతం విక్షిప్తే ద్వామకం కరమ్. ౨౩౫

వక్షఃస్థానే భవే త్సవ్యో వలితం త్రికమేవచ
నూపు రాక్షిప్తకేచైవ హ్యర్ధస్వస్తికమేవచ. ౨౩౬

నితంబం కరిహస్తంస్యా దురోమండలకం తథా
కటిచ్ఛిన్నం చ కర్తవ్యం సంభ్రాంతే నృత్తయోక్తృభిః. ౨౩౭

విక్షిప్తము, అంచితము, గండసూచీ, గంగావతరణము, అను కరణములను ప్రయోగించి తర్వాత వామాంగముతో అర్ధసూచీ, దండపాదములను యోజించవలెను. పిమ్మట చతుర, భ్రమర, నూపుర, ఆక్షిప్త, అర్ధస్వస్తికము లను కరణములను వరుసగా ప్రయోగించవలెను. ఆపై నితంబ, కరిహస్త, ఉరోమండల, కటిచ్ఛిన్నము లను కరణములను యోజించగా సంభ్రాంతమను అంగహారము సిద్ధించును.

31. అపసర్పితము

అపక్రాంతక్రమం కృత్వా వ్యంసితం హస్తమేవచ
కుర్యా దుద్వేష్టితం చైవ హ్యర్ధసూచీ తథైవచ. ౨౩౮

విక్షిప్తం స కటిచ్ఛిన్న ముద్వృత్తా క్షిప్తకే తథా
కరిహస్తం కటిచ్ఛిన్నం కర్తవ్య మపసర్పితే. ౨౩౯

అపక్రాంతకరణము నాడి, వ్యంసితకరణములోని హస్తవ్యాపారమును మాత్రమే గ్రహించి, కరిహస్త, అర్ధసూచీ, విక్షిప్త, కటిచ్ఛిన్న, ఊరూద్వృత్త ఆక్షిప్తక, కరిహస్త, కటిచ్ఛిన్నములను కరణములను క్రమముగా ప్రయోగించినచో అపసర్పితమను అంగహారము సిద్ధమగును.

32. అర్ధ నికుట్టకము

కృత్వా నూపురపాదంచ ద్రుత మాక్షిప్యచ క్రమమ్
పాదస్య చానుగౌ పాదౌ త్రికంతు పరివర్తయేత్. ౨౪౦

నికుట్య కరపాదం చా ప్యురోమండలకం పునః
కరిహస్తం కటిచ్ఛిన్నం కార్య మర్ధనికుట్టకే. ౨౪౧

నూపురము, వివృత్తము అను కరణముల నాడి, భ్రమరకమును చూపి, కరపాద నికుట్టితమును చూపవలెను, నికుట్టితార్ధ నికుట్టకాది కరణములనిట యోజించవలెనని భావము తర్వాత ఉరోమండలకము, కరిహస్తము, కటిచ్ఛిన్నము అను కరణములను ప్రయోగించగా అర్ధనికుట్టకమను అంగహారము వచ్చును.

ద్వాత్రింశ దేతే సంప్రోక్తా హ్యంగహారా ద్విజోత్తమాః
చతురో రేచకాంశ్చాపి గదతో మే నిబోధత. ౨౪౨

ఈ రీతిగా ముప్పదిరెండు అంగహారములు వివరించబడినవి. ఇక రేచకములు చెప్పబడుచున్నవి.

పాదరేచక ఏకః స్యా ద్ద్వితీయః కటిరేచకః
కరరేచక స్తృతీయస్తు చతుర్థః కంఠరేచకః ౨౪౩

పాదరేచక, కటిరేచక, కరరేచక, కంఠరేచకము లని రేచకములు నాల్గువిధములు. పాదమునకు నమనోన్నమనముల జూపుచు, బొటనవ్రేలిపై నడచినచో పాదరేచకము రాగలదు హస్తములను వేగముతో కంపింపజేసిన హస్తరేచకమగును. సర్వతో భ్రమణముద్వారా గ్రీవారేచనము వచ్చును

ఈ రేచకములను వైశాఖ స్థానకముతో ప్రయోగింపవలెను. సుకుమార గీత వాద్య ప్రధానమగు ప్రయోగమున వీటికి స్థానమున్నది. కరణములతో రేచకములు యోజింపబడిననే అంగహారములు సమగ్రములు కాగలవు.

రేచకై రంగహారైశ్చ నృత్యంతం వీక్ష్య శంకరమ్
సుకుమారప్రయోగేణ నృత్యంతీం చైవ పార్వతీమ్. ౨౪౪
మృదంగ భేరీపటహైర్భాండ డిండిమ గోముఖైః
పణవైర్దర్దురై శ్చైవ సర్వాతోద్యైః ప్రవాదితైః. ౨౪౫
దక్షయజ్ఞేవిని హతే సంధ్యాకాలే మహేశ్వరః
నానాంగహారైః ప్రానృత్యల్లయ తాలవశానుగైః. ౨౪౬
పిండీ బంధాంస్తతో దృష్ట్వా నంది భద్రముఖాగణాః
చక్రుస్తేనామ పిండీనాం బంధమాసాం సలక్షణమ్ ౨౪౭

కరణాంగహార రేచకములనుండి నిష్పన్నమగునవి పిండీబంధములు, ఆకృతి విశేషము లేక మూర్తివిశేషమును పిండీబంధమందురు. దక్షయజ్ఞము ధ్వంసమైన తర్వాత ప్రహర్ష పరవశులైన ప్రమథగణములు మృదంగ, భేరీ, పటహ, భాండ, డిండిమ, గోముఖ, పణవ, దర్దురాది వాద్యముల నాలాపించిరి. అప్పుడానందపరవశుడై రేచకాంగ హారములతో శివుడు సంధ్యా కాలమున నృత్యముచేయుచుండెను. పార్వతి సుకుమార నాట్యప్రయోగమున గలదు. లయతాళముల ననుసరించి వివిధాంగహారములతో శివుడు నృత్యము చేయు వేళ వివిధరూప విన్యాసములతో ఆకృతి భేదములు ఉద్భవించినవి. నంది, భద్రముఖుడు మొదలగు వారీ పిండీబంధములను చూచి వాటికి పేర్లుపెట్టి, వాటి లక్షణములను నిర్వచించిరి

ఈశ్వరస్యేశ్వరీ పిండీ నందినశ్చాపి పట్టసీ
చండికా యాభవేత్పిండీ తథావై సింహవాహినీ. ౨౪౮
తార్క్ష్య పిండీభవే ద్విష్ణోః పద్మపిండీస్వయంభువః
శక్రస్యైరావతీ పిండీ ఝషపిండీతుమాన్మథీ. ౨౪౯
శిఖిపిండీ కుమారస్య రూపపిండీ భవేచ్ఛ్రియః
ధారాపిండీ చ జాహ్నవ్యాః పాశపిండీ యమస్యచ ౨౫౦
వారుణీచ నదీపిండీ యాక్షీ స్యా ద్ధనదస్యతు
హలపిండీ బలస్యాపి సర్పపిండీతు భోగినామ్. ౨౫౧
గాణేశ్వరీ మహాపిండీ దక్షయజ్ఞ విమర్దినీ
త్రిశూలాకృతి సంస్థానా రౌద్రీ స్యా దంధకద్విషః. ౨౫౨

ఆధారాంగప్రయోగ సాధకతమ భేదముచే పిండీబంధములు వివిధ విధములుగా నున్నవి. భూమి, నాలుగుదిక్కులు, ఆకాశద్వయము అను నేడింటి ననుసరించి ఏడు ఆధారభేదములు రాగలవు రెండు చేతులు, రెండుపాదములు, రెండుకన్నులు, శిరస్సు అను నేడింటిద్వారా అంగభేదము లేడు రాగలవు. ఆధారభేదములను అంగభేదములచే గుణించగా నలుబదితొమ్మిది వచ్చుచున్నవి. నాట్యప్రయోక్త ఒకడుగాని అనేకమంది గాని ఉండవచ్చును, ప్రయోగము సమప్రయోగముగాని, విషమప్రయోగముగాని కావచ్చును కాగా నాలుగుభేదము లిట రాగలవు. ఈ నాల్గు విధముల పిండీబంధములను కరణములతో గాని, అంగహారములతో గాని సంపాదించవచ్చును. గనుక ఎనిమిది రకముల బంధములు వచ్చుచున్నవి. ఈఎనిమిదింటిని నలుబదితొమ్మిదిచే గుణించగా మూడువందల తొంబదిరెండు పిండీబంధములు రాగలవు.

పిండీబంధములను కేవలము కరణములతోనే ప్రయోగించుచు ఆయా దేవతను, ఆయా ప్రకృతిని సూచించినచే హర్షప్రదములు కాగలవు. కావున ప్రధాన దేవతోద్దేశముగా పిండీబంధముల నీ ఐదుశ్లోకములలో భరతుడు చెప్పుచున్నాడు.

పిండీబంధములు పారమేశ్వర విషయకములు. వీటిచే ప్రధానముగా శివుడే పరితోషము చెందగలడు గనుక ఈశ్వరుని పిండీబంధమును మొదట పేర్కొనినాడు. అవ్యక్తము, ఈశ్వరశబ్దవాచ్యము, నిర్విశేషము నగు శివుని రూపమున కనుగుణమై శివలింగాకృతియైన పిండీబంధమును ఈశ్వరే యందురు ఆధారాంగాది సంఘాతముచే బంధింపబడి బుద్ధిగ్రాహ్యమగు పిండీబంధము ఆకృతివిశేషమున ప్రధానవిషయమును వ్యక్తపరచుచు తద్వారా దేవతామూర్తిని సూచించునది ఆకృతి విశేషమునకు సాంకేతికమగు సన్నివేశమును చూపుటయే పిండీబంధమనిపించుకొనును. ఈసన్నివేశము కరణాంగహారాదులద్వారా సంపాదితమగును.

పరమేశ్వరానంతరము ప్రధానభూత పిండీబంధలక్షణమును విధించిన నందీశ్వరుని పిండీ పట్టసమనిపించుకొనును. పరమేశ్వరుని పిండీబంధము, నందికేశ్వరుని పిండీబంధముకూడ త్రిశూలాకృతియగు ఆయుధ విశేషమేయని తెలియవలెను. తదనంతరము పరమేశ్వరియగు చండికాదేవి పిండీబంధము సింహవాహనము విష్ణువునకు గరుడుడు, బ్రహ్మకు పద్మము, ఇంద్రునకు ఐరావతము, మన్మథునకు చేప, స్కంధునకు నెమలి, లక్ష్మికి రూపము, గంగకు ధార, యమునకు పాశము, నదికి వారుణీ, కుబేరునకు యాక్షీ, బలరామునకు నాగలి, సర్పములకు సర్పములు, అనునవి పిండీబంధములు. ఆయా ఆకారములుగల రూపములే పిండీబంధములు యాక్షీ అనగా కుబేరుని ముద్గరాకారమగు ఆయుధము.

దక్షయజ్ఞమున ధ్వంసముచేసిన త్రిశూలము గాణేశ్వరీ అను మహా పిండీబంధము. త్రిశూలాకృతితో విన్యసితమైనది రౌద్రీయను పిండీబంధము

ఏవ మన్యాస్వపి తథా దేవతాసు యథాక్రమమ్
ధ్వజభూతాః ప్రయోక్తవ్యాః పిండీ బంధాః సుచిహ్నితాః. ౨౫౪

ఇదేరీతిగా ఇతర దేవతలకుకూడ పిండీబంధములను చెప్పుకొనవలెను. ధ్వజము, ఆహుతి, ఆయుధ, వాహన విశేషరూపములుగా, సుచిహ్నితములుగా పిండీబంధములను జూపవలెను. ఏదో ఒక కర్మాదిసూచకమగు రూపముతో నుపలక్షితములైనవి యని దెలుపుటకు సుచిహ్నితములని భరతుడు ప్రయోగించినాడు.

ఎచట ఏదేవత అధిష్ఠానముగా చెప్పబడినదో అచ్చట ఆదేవతను చివరకు నృత్తముతో సంతోషపరుపవలెను ఆ దేవతయొక్క ఆయుధ వాహన కర్మ భావాద్యనుకారియగు అంగప్రయోగమును ఆ నృత్తమున విధించవలెను "తిలకేచ కరః స్థాప్యః" అను అరువదినాల్గవ కరణము నభినయించుటచే శంకరుడు సంతుష్టుడగును. "నికుట్టితౌ యదా హస్తౌ" అను తొమ్మిదవ కరణముతో త్రిశూలాకృతి గల కాయసంపత్తి రాగలదు గరుడప్లుతక కరణముతో గరుడుని ఆకారగతిసూచన జరుగగలదు. గంగావతరణకరణముతో ధారాపిండీ, నాగాపసర్పిత కరణముతో సర్పపిండీ సిద్ధించగలవు. స్థిరహస్తమను అంగహారముతో త్రిశూలశివలింగాది పిండీబంధము నిష్పన్నమగును. రేచితాంగహారముతోను, ఆక్షిప్తరేచితాంగ హారముతోను, సమస్తములైన ఆధారాద్యనంత భేదములుగల పిండీబంధములు నిష్పన్నములు కాగలవు.

రేచకా అంగహారాశ్చ పిండీబంధా స్తథైవచ
సృష్ట్వా భగవతా దత్తా స్తండవే మునయే తదా. ౨౫౪
తేనాపి హి తతః సమ్య గ్గాన భాండ సమన్వితః
నృత్తప్రయోగః సృష్టోయః స తాండవ ఇతి స్మృతః. ౨౫౫

రేచకములను, అంగహారములను. పిండీబంధములను సృష్టించి శంకరుడు తాండవనృత్తమునకై నందికి భరతునకొసగెను. శిఖిపిండి మొదలగు వాటిని నిష్పాదించు మయూరలలితాది కరణములు పిండీబంధశబ్దముచే సూచింపబడుచున్నవి. కేవలము కరణమును ప్రయోగించినను దేవతకు సంతోషము కలుగగలదు. తద్వారా కరణము అదృష్టఫలమున కుపకారియగును. కావుననే విష్ణుక్రాంత చక్రమండలములు వైష్ణవ క్రీడాసూచకము లగుచున్నవి

స్థానక, చారీ, నృత్తహస్త, భ్రూ, తార, కర్మలను శోభావిశేషణముతో సృష్టించి భగవానుడగు శంకరుడు నృత్తనిర్మాణమును గావించినాడు ఈ ఉపకరణ జాలమును భరతున కొసగినాడనుటలో నృత్తము శోభాప్రాధాన్యము గలదని సూచింపబడుచున్నది. ఇట్టి నృత్తమును గ్రహించుటకు ఊహాపోహాది కుశలుడు కావలెను గనుక భరతమునిని భగవాను డనుగ్రహించెను.

కరణాంగహార పిండీబంధములతో కూడిన నృత్తాత్మక ప్రయోగము సమ్యగ్వైచిత్ర్యముతో, సమంచిత తాల లయాత్మకముగా,గీతములతోను, పుష్కరాది వాద్యాదులతోను కూడినదై సృష్టించబడి తాండవమని పిలువబడుచున్నది. నృత్త ప్రధానమై గీతవాద్యములతో సమన్వితమైనదీ ప్రయోగము.

అస్పృశ్యత

మహాత్మగాంధీ

నాకు పునర్జన్మకావాలని లేదు. కాని పునర్జన్మ ఎత్తవలసే వస్తే, అస్పృశ్యుల దుఃఖములలోను బాధలలోను పాల్గొని, వారిపై చూపబడే దౌర్జన్యాన్ని అనుభవించి, అట్టి దుర్భర పరిస్థితులనుండి నన్నూ వారినీ విముక్తులను చేసికొనటం కోసం, నేను అస్పృశ్యుఁడుగానే జన్మించవలసివుంటుంది. కనుక నేను మళ్ళీ పుట్టవలసివస్తే, బ్రాహ్మణుడుగాగాని క్షత్రియుడుగాగాని శూద్రుడుగాగాని కాక అతి శూద్రుడుగా పుట్టవలెనని భగవంతుణ్ణి ప్రార్థించాను.

ప్రజలపట్ల నాకుగల ప్రేమయే ఈ అస్పృశ్యతా సమస్యను నా జీవితంలోకి తెచ్చింది "నీవు వీణ్ణి తాకగూడదు, వీడు అస్పృశ్యుడు" అని మా అమ్మ చెప్పింది. "ఎందుకు తాకరాదు?" అని ఆమెను తిరిగి ప్రశ్నించాను. ఆనాడే మొదలు నా తిరుగుబాటు

నేను నాభార్యకు అంకితం కావటానికి చాలా పూర్వమే అస్పృశ్యతా నివారణ కార్యక్రమానికి అంకితమైనాను నేను అస్పృశ్యుల కోసం కృషి చేయటమా, లేక నా భార్యతో కలిసిఉండటమా- ఈ రెంటిలో ఒకటి తేల్చుకోవలసిన సందర్భాలు నా జీవితంలో రెండుసార్లు వచ్చాయి నేను అస్పృశ్యులకోసం కృషి చేయటమే వరంగా ఎన్నుకొనేవాణ్ణి. కాని నా భార్య అభినందనీయ- అలాంటి క్లిష్ట పరిస్థితి తప్పిపోయింది నా ఆశ్రమంలో- అదే నా కుటుంబం- చాలమంది అస్పృశ్యులున్నారు. వారిలో నా కొమార్తెలాగా ఉండే ఒక చక్కని కొంటెపిల్లకూడా వుంది

పంచమ భారతాన్ని నిరంతరదాస్యంలో వుంచి, బహిరంగంగా వారికి జాతీయ సంస్కృతీ ఫలాన్ని నిరాకరించదలచినట్లయితే స్వరాజ్యమనే మాటకు అర్థమే లేదు. ఈ అత్యంత పవిత్రీకరణోద్యమంలో మనం దైవ సహాయాన్ని అర్థిస్తున్నాము. కాని అతని పుత్రులలో అత్యంతయోగ్యులైన వారికి మానవ స్వామ్యాలనే నిరాకరిస్తున్నాము. మనము అమానుషులమైయుండి, ఇతరుల అమానుషత్వం నుండి మనకు విముక్తి ప్రసాదించవలసిందిగా దైవముఖాన మనం చెప్పుకోజాలము.

అస్పృశ్యత జీవించేకంటె, హిందూమతం నశించిపోవటమే నాకెక్కువ యిష్టం.

అస్పృశ్యత నెదుర్కొని పోరాడటంలోనూ, ఆ పోరాటానికి నన్ను నేను అంకితం చేసుకొనటంలోనూ, మానవజాతి సంపూర్ణ పునరుజ్జీవనం సాధించటం కంటే ఏమాత్రం తక్కువకోర్కె నాకు లేదు కాకిచిప్పలో కన్పించే వెండిలాగా, అది కేవలం కల కావచ్చు, ఆ కల సజీవంగా వున్నంతవరకూ, నా దృష్టిలోమాత్రం అది కలకాదు. రోమా రోలా చెప్పినట్లు, "విజయం ఆశయసిద్ధిలో కాక, దానికోసం చేసే నిరంతరకృషిలో వున్నది."

కులము - వర్ణము

ఇప్పుడు చెప్పబడేరకం కులంలో నాకు నమ్మకంలేదని పదేపదే చెప్పివున్నాను. అది అనుత్తమమేకాక, అభ్యుదయానికి అవరోధం కూడా. మానవులమధ్య అసమానతలు ఉండి తీరాలని కూడా నాకు నమ్మకంలేదు. మనమందరం పూర్తిగా సమానులమే కాని ఈ సమానత్వం ఆత్మలకు చెందినదేగాని శరీరాలకు కాదు. కనుక అది ఒక మానసికస్థితి. ఈ భౌతిక ప్రపంచంలో ఎక్కువ అసమానతలు ఉండటంవల్ల, మనం సమానత్వాన్ని గురించి ఆలోచించాలి, దాన్ని నెలకొల్పాలి. బైటికి కానవచ్చే ఈ బాహ్యవైషమ్యం మధ్య, మనం సామ్యం సాధించాలి. వేరొకనికంటె తాను అధికుడననుకొనటం అంటే, అది దేవునిపట్ల, మానవునిపట్ల పాపంచేసినట్లే అవుతుంది స్థితిగతుల్లో హెచ్చులొచ్చులు ఎంతవరకు సూచిస్తుందో అంతవరకూ కులం అనేది చెడ్డదే

కాని వంశ పారంపర్యములైన వృత్తులపై నాధారపడిన వర్ణధర్మంమీద నాకు విశ్వాసం వుంది. నాలుగువిధములైన విశ్వమానవ వ్యాపారాలకు చిహ్నాలుగా వర్ణాలు నాలుగువిధాలు: విజ్ఞానప్రబోధం, అనాధరక్షణ, కృషివాణిజ్యాలు, శారీరక పరిశ్రమ. ఈ వృత్తిధర్మాలు మానవజాతికంతటికీ సామాన్యమైనవి కాని హిందూమతం వీనిని మన జీవితధర్మాలుగా గుర్తించింది, సాంఘిక సంబంధాలనూ వ్యక్తి ప్రవర్తననూ నిర్ధరించటంలో వీనిని వినియోగించుకొన్నది. భూమ్యాకర్షణ శక్తిఅని ఒకటి ఉన్నదని మనకు తెలిసినా తెలియకపోయినా, అది మనమీద పనిచేస్తుంది కాని దాన్ని తెలిసికొన్న శాస్త్రజ్ఞులు, ఆశక్తినుండి ప్రపంచాన్ని విభ్రమపరచగల ఫలితాలు సాధించారు అదే విధంగా చాతుర్వర్ణ్యాన్ని కనిపెట్టి అమలులో పెట్టిన హిందూమతంకూడా ప్రపంచాన్ని దిగ్భ్రమ గొల్పింది హిందూమతం నిర్వీర్యమై పోయిన యనంతరం ఈ వర్ణధర్మం దుర్వినియోగపరచబడి, పరస్పర వివాహ భోజనాదికాన్ని నిరోధించే అనవసరములైన హానికరములైన విధినిషేధాలతో అసంఖ్యాములైన కులాలు తలెత్తాయి. వర్ణధర్మానికి ఈ నిషేధాలతో నిమిత్తమేలేదు, వివిధ వర్ణాలవారు అన్యోన్యం పెండ్లిండ్లు చేసికోవచ్చు, పంక్తి భోజనాలు చేయవచ్చు పవిత్రతనూ ఆరోగ్యాన్నీ కాపాడేదృష్టిలో ఈ నిషేధాలు అవసరం కావచ్చు. కాని ఒక శూద్రస్త్రీని పెండ్లాడిన బ్రాహ్మణుడుగానీ, బ్రాహ్మణస్త్రీని పెండ్లాడిన శూద్రుడుగానీ ఈ వర్ణధర్మానికి చేస్తున్న అపచారమేమీ లేదు.

మహమ్మదీయులు, క్రైస్తవులు మొదలైన అన్యమతానుయాయులలో నైతం వ్యాపించేటంతగా మనదేశంలో ఈ కులతత్వం నాటుకుపోయింది ప్రపంచంలో తక్కిన దేశాలలో ఇంచుమించుగా ఇంత చేటు వర్గవైషమ్యం ఉన్నమాట వాస్తవమే. దీన్నిబట్టి మానవజాతికి ఈ దుర్గుణం సర్వసాధారణంగానే ఉన్నదని అర్ధమవుతుంది. మతాన్ని వాస్తవదృష్టిలో అర్థం చేసుకొన్నప్పుడు మాత్రమే ఈదుర్గుణం అంతరిస్తుంది. ఇలాంటి నిషేధాలకుగానీ వైషమ్యాలకుగానీ ఏ మతగ్రంథాలలోనైనా అధికారం ఉన్నట్లు నాకు తోచలేదు.

మతముయొక్క దృష్టిలో మానవులందరూ సమానులే విజ్ఞానము తెలివితేటలు సంపద- ఇవి కలవాడు ఇవి లేనివారికంటె గొప్పవాడి ననుకోటానికి వీలులేదు ఎవ్వడైనా వాస్తవమైన మతశిక్షణ కలిగి దాని పావిత్ర్యశక్తిని పొందియున్నట్లయితే, వాడు తనకుగల విజ్ఞానాది అవకాశాలను అవి తక్కువగాగల తక్కినవారికి కలుగజేయటం తన కర్తవ్యంగా భావిస్తాడు. అందుచేత, మన పతితస్థితిలో మనమందరం ఇష్టపూర్తిగా అతిశూద్రులం కావటమే వాస్తవ మతధర్మం.

మనం మనఆస్తికి సొంతదారులమని కాక, ధర్మకర్తలమని భావించాలి. మనం చేసిన సేవకు ప్రతిఫలంగా మాత్రమే కొంత అనుభవించి, తక్కినది సంఘసేవకై ఖర్చుపెట్టాలి. ఈ పద్ధతిలో దరిద్రులుగాని, ధనికులుగాని ఉండరు. అన్నిమతాలూ సమాన గౌరవప్రతిపత్తులు కలిగివుంటాయి ఈపద్ధతి ననుసరించినట్లయితే మతాన్నిబట్టీ, కులాన్నిబట్టీ, ఆర్థికాసమానతలనుబట్టీ వచ్చే తగవులన్నీ ,అంతరిస్తాయి, ప్రపంచశాంతి సుస్థిరమవుతుంది.

గోవింద రామాయణము

విశ్వామిత్ర శరణాగతి

శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు

నీవ గ్రహింపఁ బూను నెడ నే నిడనుండిన రెండు మంత్రముల్
భూవలయంబునందు నినుఁ బోలెడి సుందరుఁ డెవ్వడుండు నీ
భావ పరంపరా మధురవాదమునన్ సముఁ డెవ్వడుండు వే
చావక నిన్నెదిర్చి మనఁ జాలిన వాఁ డెవండు భూమిపై.

జ్ఞానమయాత్మ లియ్యవి, విశారద లియ్యవి మూడు కాలముల్
లోనగు కాలగర్భవతులుంగద యియ్యవి దేవమాతలౌ
వీని ధరింపఁగాఁ దగిన విజ్ఞుఁడ వీవు మరొక్కఁ డెవ్వఁడేన్
బూనఁగలేఁడు నీ కృపను బొందినవాఁడె ధరింప నోపెడిన్.

తాత సృజించెవీనిఁగడు తాపసినై గ్రహియించినాను నీ
కేతగుఁ గాని నాకుఁ బనియేమి త్వదాశ్రయ మొందియుండ నా
చేతము మంత్రశక్తుల వశీకృతమై భరమాయెనింక సం
ప్రీతి మదర్పణమ్ము గొనుమీ యిపుడీవె సుధర్మపాలకా.

అనముని రాముడంచుగొని యాచమనంబొనరించి విద్యలన్
గని గురుపూజలన్సలిపె గాధిసుతుండు పరాత్మచిత్తుఁడై
పనివడి రెండు మంత్రములఁబాసె శరీర సుఖచ్యుతంబుగా
మునియయి యోగమూనియును బొందియు విద్యయు సిద్ధినొందమిన్.

అల బలాతిబలల్ గొని లలితమూర్తి రాఘవుఁడు సహస్రార్క రశ్మిగలిగి
భూరివిక్రమదీప్తి విభూతివెలుఁగు నతులుఁడై భానుడస్తాద్రి నధిగమింప.

దర్భలను బాన్పుగాఁ బూని దాశరథులు
బాలు రేయయ్యు నృపపుత్ర వరులునయ్యు
కౌశికవచో విలాససుఖమ్ము వలన
సుఖతరమ్మగు నిద్రలోఁ జొక్కినారు.

తెల్లవారసాఁగెఁ దెలివొందె దిక్కులు మెల్లమెల్లన మునిమేలుకాంచి
రామలక్ష్మణులను రాజీవనేత్రుల నిదుర లేపఁబూని నిలిచెనట్లు.

ఏది సరయూ నదీతీరమిచట? లేరు
రామలక్ష్మణులేమైరి? రాజసుతులు ?
సర్వమును శూన్యమిట దర్భశయనుఁడేడి?
యనుచు లోలోనఁ దలపోసి యల్లె నిలిచి.

నిలిచె యొక్కక్షణము నిర్వికారుండయి
యల్లె కనులుమూసి యట్టె తెఱచె
యెదుటనున్న జ్యోతి యెఱుకలేనట్లుగా
జూడ యోర్వలేని చొప్పుదోఁప.

తనువు పులకరింపఁ దలను పంకించుచు
గమల నేత్రయనుచుఁ గనులుమూసి
శేషశాయి యనుచుఁ జేతులు జోడించి
కౌగిలింపఁబూని కనులు దెఱచి

రామ! కౌసల్యసుప్రజారామ! లెమ్మ
పూర్వసంధ్య సుమా యిది, పురుషసింహా!
దైవికాహ్నిక కర్మకర్తవ్య మిప్పు
డనియె రామలక్ష్మణులను గనుచునంత.

గురుని గభీరవాక్యముల గుర్తెఱుఁ గంగల రాచబిడ్డ లి
ద్దరపుడు స్నానహోమ జపతత్పరులై రవిఁగాంచి మ్రొక్కుచున్
పరమజపంబునున్ సలిపి భక్తిమెయిన్ బ్రణమిల్లినారు స
ద్గురునకు ముప్పురుం గలిసి త్రోవను బట్టిరి పూర్వరీతిగన్.

గంగా సరయూ సంగమ రంగముఁ గనినారు వారు రాజతనూజుల్
పొంగుచునటఁ గల యాశ్రమ సంగతులన్ వినిరి మౌని సర్వముఁ దెల్పన్.

ముక్కంటి తపమున్న పుణ్యస్థలమ్ము
త్రొక్కియుంటిమి రామ యిక్కడే సుమ్ము.
అంగహీనుఁడు కాముఁడౌట నిచ్చోట
నంగదేశము పేర నలరు నీభూమి
ఇనుఁడ పరాద్రిపైకేఁగ నుంకించు
కనుమదే యీరేయి గడపు నౌనిచట
అనుకౌశికుని గూడి యాదాశరథులు

వినయమ్ముతో నిత్యవిధు లూనిరంత
సంధ్యకర్మలనెల్ల సలిపినారు
సాంధ్యరాగము దోఁచు సమయమ్మునందు.

గౌరి నితాంత జపకారక నామరూపున్
దూరీ కృతార్త జన దుష్కృతభక్తకామున్
నారాయణున్ ఘనగుణద్యుతిదీప్తిమంతున్
వీరున్సురారిచయభీకరు బాలరామున్.

మౌనీంద్ర సంయుతుని మానవనాథపుత్రున్
జ్ఞానాఢ్యులన్ మునులు స్థాణుని శిష్యులెల్లన్
గానంగనోచుటకు గంగదరిన్ బ్రహ్మర్షులై
వానిన్ గనన్గనుల వచ్చిరి వారలంతయున్.

మ్రొక్కుచు నర్ఘ్యపాద్యముల పూజలొనర్చుచుఁ గౌశికోత్తమున్
మక్కువ రామలక్ష్మణుల మన్ననసేసిరి మౌనులెల్ల పెం
పెక్కిన కూర్మివారికిడి రెంతయు సత్కృతి వీరుమువ్వురున్
జక్కని జాహ్నవీ విపులసైకత సీమలఁగూడి రెల్లరున్.

నీలవర్ణమువాని చేలజాతులవాని
కన్నార్ప కరసిరి కతన మేమొ?
విమలదేహమువాని వీర దృక్కులవానిఁ
గనులారఁ గాంతురు మును లదేమొ?
వెడదవక్షమువానిఁ బుడమినేలెడువాని
గనులారఁ గాంతురు మును లదేమొ?
ధర్మమూనినవానిఁ గర్మనేర్చెడివానిఁ
గనులారఁ గాంతురు మును లదేమొ?

తేరి చూచిద రేల తదేకదృష్టి?
దగ్గఱకుఁబోవ జూతురు తాఁక నెంతు
రేల? కౌఁగలింపఁగ వరియింతు రేల
జనకుపంపున మునివెంటఁ జనెడిబాలు.

పలుకరించుచు మాటాడఁ గులుకుచుంద్రు
ధర్మమయగాథ లఞ్జెప్పి తనివిగాంత్రు

లోకవిజ్ఞాన గాథావిలోలుఁ జేసి
లాలనము చేయుదురు రాముఁ బాలు,మునులు.

మునితతులందఱు మోదముతోడన్
జనవుగఁ జెప్పఁగ శాస్త్రహితంబుల్
వినివిని వానిని వేడుకదోఁచన్
తనివిని గాంచెను దమ్ముఁడు దానున్.

అభిరాములా వారికా కౌశికుండు
నభిరామ కథలచే నానందమొసఁగె
అతిథి పూజలచేసి రాశ్రమమందు.
నతిభక్తి మై స్థాణు నాశ్రమమునులు
రామలక్ష్మణులతో రాత్రి యంతయును
కాము నాశ్రమమందె గడపెఁ గౌశికుఁడు.

అది ప్రభాతమ్ము సాంధ్యకృత్యములఁ దీర్చి
గంగదాటఁగ రామలక్ష్మణులతోడఁ
కౌశికుఁడు జేరెఁ దీరమ్ము గమలవిభుఁడు
సుప్రకాశమ్మునన్ వెల్గుఁజూపఁ గడఁగె.

స్థాణు నాశ్రమమునులు నిశ్చలులు ఋషులు
పెక్కువేలేండ్ల తపసు పెంపెక్కియున్న
నామహాత్ములు సువ్రతులైనవారు
నావ సమకూర్చినారు జాహ్నవిని దాఁట.

ఎక్కుము నావ కౌశికయిదే యభిరాముల రాజపుత్రులన్
బ్రక్కన జేర్చికొమ్ము గడు భద్రముగా నిఁక గంగదాఁటు మీ
రెక్కడఁగాని మార్గముననే గతివచ్చు నరిష్టమేనియున్
గ్రక్కున దాఁటఁగాఁగలవు కాలవిలంబము లేక యుండెడిన్.

అని మునులా శిష్యులనిడ
వినయంబున వారిమ్రొక్కి విహితపథంబున్
గని దక్షిణ తటమును నా
వను జేర్పఁగఁ గౌశికుండు బయనంబయ్యెన్.

గాలివాన

[శ్రవ్యనాటిక]

("షేక్స్పియర్ మహాకవి కృతమైన "Tempest" నాటకాన్ని అనుసరించి)

శ్రీ అమరేంద్ర

పాత్రలు.

ప్రాస్పెరో
మిరాండా : ప్రాస్పెరోపుత్రిక
ఫెర్డినాండ్ · నేపుల్స్ రాజకుమారుడు
పలన్సో : నేపుల్స్‌రాజు
ఏంటోనియో : ప్రాస్పెరో సోదరుడు
సెబాస్టియన్ : నేపుల్సురాజు తమ్ముడు
గొంజాలో : సేవకుడు
కురూపి
సమీరుడు

(హోరుగాలి, ఉరుములు, సముద్రతరంగాల భీకరగర్జనల తరవాత)

మిరాండా - ఇక చాలు నాన్నా...నేను భరించలేను...

ప్రాస్పెరో - ఎందుకమ్మా అంతభయం? అల్లా బెదిరిపోతున్నావేం? ఇదంతా నా మంత్రశక్తివల్ల సృష్టించాను. నా కోరిక తీరగానే ఉపసంహరిస్తాను

మిరాం·— వద్దునాన్నా, పరవళ్లు త్రొక్కే సముద్రతరంగాల ఘోషను శాంతింప జెయ్యకపోతే, నేను సహించ లేను కాటుకమబ్బులు నిప్పులు కురిపిస్తయ్యే మోనని భయంగావుంది ఆకాశం ఎత్తున పొంగే కడలి కెరటాలు మింటరగిలే మంటలన్నీ చల్లార్పివేస్తున్నట్లున్నాయి ఓడలో అల్లాడిపోయే యాత్రికులబాధలు నా హృదయాన్ని కలచివేస్తున్నాయి. ఎందరో, గొప్పవాళ్ళని మోస్తూ సాగి పోయే ఓడ తునాతునకలై పోయింది నిర్భాగ్యులు నడిసముద్రంలో నీళ్లపాలై పోయారు. నాకే మంత్రశక్తులు వుంటేనా? ఓడని పొట్టన పెట్టుకోక మునుపే కడలి కెరటాలన్నీ ఇంకిపోయి మటు మాయమైపోయేట్లు చేసేదాన్ని కాదా? యీ ఘోరవినాశనం నేను కళ్ళారాచూసి భరించలేను నాన్నా...

ప్రాస్పె,— నీ జాలిగుండెలని కరిగిపోనివ్వ కమ్మా. నిబ్బరం తెచ్చుకో, ఎవరికీ ప్రమాదం లేకుండా నేను చూస్తాగా...

మిరాం - నేడెంత దుర్దినం...

ప్రాస్పె - విచారపడకమ్మా. ఇదంతా నీ కోసమే, నా చిన్నారి తల్లివైన నీకోసమే నమ్మా... పిచ్చితల్లీ... నువ్వెరివో నీకు తెలియదు. నే నెవరినో ఎరుగవు... ఈ కొండగుహాలో కాలం వెళ్ళదీస్తున్న నీ తండ్రి ఒకప్పుడు ఎంత గొప్పవాడో నీకు తెలియదు

మిరాం·- తెలియదునాన్నా...ఇప్పటి స్థితిని దాటి ఊహించగల శక్తి నాకులేదు.

ప్రాస్పె - సమయం వచ్చింది. నువ్వెవరివో, నీకు తెలియజెప్పవలసిన బాధ్యత నాకున్నది నా మంత్రశక్తికి కాస్సేపు విశ్రాంతినిచ్చి మానవమాత్రునిగా నీకీ విషయం చెబుతాను కళ్ళు తుడుచుకో తల్లీ, కలవరపడకు, భయంకరమైన ఈ ప్రళయదృశ్యం నీ హృదయాన్ని కదిలించి కరుణతో నింపి కంట తడిపెట్టించింది. కాని ఇదంతా నా మహిమవల్లనే సృష్టించానమ్మా, మునిగిన ఓడలో ప్రయాణంచేసే యాత్రికులెవ్వరికీ లేశమైనా ప్రమాదం లేకుండానే నా శక్తి వల్ల ఇదంతా నిర్వహించాను భయం లేదు అంతా భద్రంగా వుంటారు. కూచో... చాలా సంగతులు నీకు వినిపించాలి ...

పన్నెండేళ్ళ కిందట, నేను మిలాన్ దేశానికి సార్వభౌముణ్ణి ...

మిరాం - అయితే. నా తండ్రి ఎవరూ? నువ్వు కాదా

ప్రాస్పె - నేనేనమ్మా, నువ్వు రాజకుమారివి. అదృష్టం బాగుంటే సింహాసనాన్ని అధిష్ఠించి దేశాన్ని పాలించేదానివి, మీ అమ్మ ఎన్నో కలలు కనేది. స్వర్గంలో వుండి మనస్థితిని చూసి బాధపడుతూ వుంటుంది అంతటి సుగుణరాశిని నేను ఎక్కడా చూడలేదు.

మిరాం- నిజమేనా నాన్నా? దురదృష్ట దేవత మనల్ని యీ ద్వీపానికి తరిమి వేసిందా? అదృష్టం బాగుండబట్టే ఇక్కడికి చేరుకోగలిగామేమో.?

ప్రాస్పె - అక్రమాలకి గురికావడం వల్లనే ఇక్కడికి రావలసివచ్చింది తల్లీ. అది మన దౌర్భాగ్యం కాని సురక్షితంగా ఈ ద్వీపానికి చేరుకోటం మనఅదృష్టం

మిరాం- నా మూలాన ఎన్ని బాధలు పడ్డావో నాన్నా తలుచుకుంటే గుండె భగ్గుమంటున్నది.. తరవాత ఏంజరిగింది?

ప్రాస్పె - నా తమ్ముడు- నీ పినతండ్రి- ఒక తల్లి కడుపున పుట్టినవాడే, ఎంత ద్రోహం చేశాడో చూడు నీ తరవాత వాడినే ప్రాణంతో సమానంగా ప్రేమించేవాణ్ణి రాజ్యపాలన మంతా వాడికి వదిలేశాను అప్పుడు పరిసర రాజ్యాలన్నిటిలో నాయకమణిగా వుండేది మనదేశం, నేను సంగీత సాహిత్యాలలో మునిగితేలుతూ పరిపాలనాధికారాన్ని ప్రభుత్వ నిర్వహణాభారాన్ని నా తమ్ముడికి పూర్తిగా అప్పగించాను ఆ ధుర్మార్గుడు ఎంత ద్రోహం చేశాడనుకున్నావూ.?

మిరాం - ఏం చేశాడు నాన్నా?.

ప్రాస్పె ఏం చెయ్యాలో, అంతా చేశాడు. సమస్తాధికారాలూ హస్తగతం చేసుకుని తన ఇష్టంవచ్చిన వాళ్ళకి అధికారాలు పంచిపెట్టి తన మాటకి ఎదురుతిరుగుతారని తోచినవాళ్లని పదవుల్లోంచి తొలగించి అందరినీ తన అదుపులోకి తెచ్చుకొన్నాడు తను పాడినపాటకి తాళం వేసేవాళ్ళకి పెద్ద హోదాలు కట్టబెట్టాడు ఇంట్లో తిని ఇంటి వాసాలు లెక్కపెట్టాడు. నమ్మిన నా కాళ్ళ కిందనే గోతులు తవ్వి నాకే ఎసరు పెట్టాడు

మిరాం - ఎంత ద్రోహం.

ప్రాస్పె - అధికార తృష్ణతో స్వాతంత్ర్యాన్ని కూడా విక్రయించి కుట్రలుపన్ని శత్రు రాజ్యాలతో కలిసాడు పవిత్ర మాతృభూమికి ఎంతటి దుర్దశ.

మిరాం - స్వార్థంకోసం స్వాతంత్ర్యాన్ని బలిచేశాడా దుర్మార్గుడు

ప్రాస్పె - నేపుల్స్‌రాజు నాకు ప్రబలశత్రువు ...నన్ను దేశంనుంచి తరిమివేసి నా తమ్ముణ్ని సింహాసనం ఎక్కించేటందుకు మాట ఇచ్చాడు... సేనలని కూర్చుకొని రాజధానిని ముట్టడించాడు అతని ఆజ్ఞలని అనుసరించి కొందరు సేవకులు అర్థరాత్రిసమయంలో నన్నూ దీనంగా విలపిస్తున్న నిన్నూ సౌధంలోంచి గెంటివేశారు. పడవలో ఎక్కించి సముద్రంలో వదిలేశారు

మిరాం - ఆ కష్టసమయంలో ఎంత భారమైపోయానో నాన్నా...నావల్ల నీకెంత ఇబ్బంది కలిగిందో

ప్రాస్పె - కాదమ్మా...అప్పుడు నివ్వే నా హృదయంలో ఆశాకిరణానివి నువ్వు నా జీవనజ్యోతివి సముద్రగర్భాన్ని నా నా వేదనాశృవులతో నింపుతున్న సమయంలో స్వర్గంనుంచి దిగివచ్చిన దేవదూతలాగా మధుర మందహాసంతో నా డెందాన్ని అలరించావు. సడలని సంకల్పబలాన్ని, చెదరని స్థిరవిశ్వాసాన్ని నాలో నెలకొలిపిన దివ్యశక్తివి నువ్వేతల్లీ...ఏం

జరిగినా దేశం జంకకుండా ప్రళయశక్తుల కోలాహలాన్ని ఎదుర్కొని నిలబడటానికి నువ్వే కారణమమ్మా

మిరాం - అయితే ఇక్కడికి ఎలా చేరుకోగలిగామో చెప్పునాన్నా.

ప్రాస్పె - అదంతా దైవలీల మనల్ని నాశనం చెయ్యటానికి నియోగింపబడిన వృద్ధ సేవకుడు ఇతరులకి తెలియకుండా పడవలో ఆహారమూ తాగేనీరూ గుడ్డలూ ఇంకా అవసరమైన వస్తువులెన్నో అమర్చాడు అతని దయవల్లనే మనం బ్రతికి బైటపడ్డాం. నారాజ్యంకంటే నేను ఎక్కువగా ప్రేమించిన మంత్రశాస్త్ర గ్రంథాలు కూడా పడవలో చాటుగా దాచిపెట్టి పుణ్యం కట్టుకున్నాడు ఆ ధర్మాత్ముడు.

మిరాం - నాన్నా...ఆ వృద్ధుణ్ణి కలుసుకునే అదృష్టం ఎప్పటికైనా కలుగుతుందా?

ప్రాస్పె - నాకథ చివరికి వచ్చేసింది ఈ మాంత్రిక దుస్తులు ధరించాలి ఎల్లాగో దైవకృపవల్ల ఈద్వీపానికి చేరుకున్నాను ఇక్కడ నేనే తల్లీ, తండ్రీ, గురువునీ... అన్ని విషయాలూ బోధించి లక్ష్మీకటాక్షం లేకపోయినా సరస్వతీ ప్రసన్నతకు లోపం లేకుండా నీకు సకలవిద్యలూ చెప్పేను.

మిరాం:- నీ ఋణమెలా తీర్చుకోను నాన్నా దేవుడు మానాన్నని నూరేళ్లు చల్లగా చూడాలి సరే కాని,ఇంకా నా మనస్సుని బాధిస్తూనే వుంది ఈ ప్రళయాన్ని ఎందుకుసృష్టించావో నిజంచెప్పు నాన్నా

ప్రాస్పె - నా అదృష్టం కలిసివచ్చి నా శత్రువులంతా ఒకేపడవలో మన ద్వీపానికి వచ్చారమ్మా. ఇది నా జీవితంలో అమూల్యావకాశమని నా కాలజ్ఞానంవల్ల గుర్తించాను. ఈ సుముహూర్తాన్ని సద్వినియోగం చేసుకుంటే నా భాగ్యం పండి ఉచ్చదశని అందుకోగలుగుతాను. జారవిడిస్తే అధోగతిపాలై పోయి అలమటిస్తాను. ఇదే మంచిసమయం తగిన తరుణం నీకు ఆవలింతలు వస్తున్నాయి కదూ' నిద్ర బరువుతో కళ్ళు మూరుకుపోతున్నాయి

నిద్రపోవే కన్నతల్లీ, నిద్రపోవే కల్పవల్లీ.

(మంత్రముగ్ధురాలై మిరాండా కన్ను మూస్తుంది)

సమీర — స్వామి వారికి జయము.

ప్రాస్పె - వెళ్లిన పని పూర్తి అయిందా సమీరా? ఏం జరిగిందో చెప్పు?

సమీర - చిత్తం స్వామీ. అక్షరాలా తమ ఆజ్ఞ నెరవేర్చివచ్చాను. తమరు అనతి ఇస్తే జ్వాలామాలికలలోనైనా నిర్భయంగా దూరబడగలను మబ్బుల అలల మీదనైనా తేలిపోగలను, నేనూ నా అనుచరులూ మీ శాసనాన్ని శిరసావహించటానికి ఎప్పుడూ సిద్ధంగానే వుంటాము

ప్రాస్పె - నేను చెప్పినట్లుగానే చేశావా?

సమీర - తూచా తప్పకుండా ఓడలో ఇక్కడా అక్కడా మంటల మాదిరిగా గంతులువేసి వాళ్లందరినీ గజగజలాడించాను. దిక్కులు దద్దరిల్లేటట్లు పిడుగులు విసిరేశాను, కళ్లు చెదిరిపోయేట్లు చెవులు చిల్లులుపడేట్లుచేశాను ఆ భీభత్సధ్వనులు విన్న సముద్రుడు కల్లోలితు డయ్యాడు

ప్రాస్పె - సెభాస్ యీ కల్లోలంవల్ల వాళ్ల మతి చలించలేదా?

సమీర - అంతా ప్రాణాలమీద ఆశలు వదులుకుని పిచ్చివాళ్లలాగా అయిపోయారు. మంటలుమండే ఓడలోంచి సరంగులు తప్ప తక్కిన వాళ్ళంతా దూకేశారు. భయభ్రాంతుడైపోయిన రాజకుమారుడు ముందు దూకేశాడు.

ప్రాస్పె - యీ సంఘటన తీరానికి దగ్గర లోనే జరిగింది కదా ?

సమీర·- బారెడు దూరంలోనే నండీ.

ప్రాస్పె - అంతా సురక్షితంగా వున్నారా?

సమీర - వాళ్ల దుస్తుల మడతలు కూడా నలగలేదు. ఎవరికీ ఎటువంటి అపాయం జరగలేదు మీ ఆదేశం ప్రకారం వాళ్లని గుంపులు గుంపులుగా తీసుకునిపోయి ఈ ద్వీపంలో తలోకమూలా దిగబెట్టి వచ్చాను నేను స్వయంగా రాజకుమారుణ్ణి తోడ్కొనిపోయి ఒకమూల కూర్చోబెట్టి వచ్చాను. నేను వచ్చేసరికి తలమీద చేతులుపెట్టుకుని దీనంగా కూచున్నాడు

ప్రాస్పె - తక్కినవాళ్లు ఏమయ్యారు? ఆ ఓడ ఎక్కడుంది ?

సమీర - ఓడని భద్రంగా రేవు చేర్చాను. సరంగులందరూ, పడిన శ్రమవల్లా నా మంత్రం వల్లా ఒళ్లుమరిచి నిద్రపోతున్నారు.

ప్రాస్పె - నువ్వు చెయ్యవలసిన పని ఇంకా పూర్తికాలేదు.

సమీ - అన్నీ పూర్తిచేస్తాను. మీరు మాత్రం ఇచ్చినమాట మరిచిపోకూడదు. చెప్పిన పనులన్నీ విసుక్కోకుండా గొణక్కుండా కల్లలాడకుండా చేస్తున్నాను నా సేవని మెచ్చుకుని నాకు స్వేచ్ఛ ప్రసాదిస్తానని వాగ్దానం చేశారు మరిచిపోయారా?

ప్రాస్పె - ఇంకా సమయంరాలేదు. నిన్ను ఎటువంటి కష్టాలలోంచి కాపాడానో మరిచిపోయావా ఆ ముసలి మాంత్రికురాలు నిన్ను ఎన్ని తిప్పలుపెట్టిందో గుర్తులేదా? నడుము వొంగిపోయిన ఆ ముసలిది నిన్ను తన ఆజ్ఞలు నెరవేర్చలేదనే కోపంతో రెండుగా చీల్చిన చెట్టుప్రానులో దిగేసి బంధించింది. పన్నెండేళ్ళు దిక్కులేకుండా అల్లాడిపోతూ అట్లాగే అఘోరిస్తూ పడివున్నావు ఆ మాంత్రికురాలూ, దానికొడుకు కురూపీ తప్ప యీ ద్వీపంలో ఇంకో ప్రాణిలేదు. నీహాహాకారాలకి క్రూరమృగాలగుండెలు కూడా జలదరించేవి అప్పుడు నామంత్ర శక్తివల్ల నిన్ను విడిపించాను అంతా మరిచిపోయావా? స్వేచ్ఛకోసం అంత తొందర దేనికి? అంతటి మహోపకారం చేసినందుకు నాకు చూపవలసిన కృతజ్ఞత ఇదేనా? మళ్ళీ గొణిగితే ఈ చెట్టుని రెండుగాచీల్చి అందులో బందీని చేస్తాను, జాగ్రత్త

సమీర - క్షమించండి స్వామీ... మీ ఆజ్ఞలు పాలించడానికి నేనుసంసిద్ధంగాఉన్నాను. ఈ తప్పు కాయిండి.

ప్రాస్పె·- సమయం వచ్చినప్పుడు నాఅంతట నేనే నీకు విముక్తి ఇస్తాను.

సమీర - ఆజ్ఞాపించండీ... ఈ సేవకుడు చిరునవ్వుతో, ఎంత దుర్ఘటమైన పనైనా అవలీలగా చేస్తాడు

ప్రాస్పె - అయితే, ఎవరికీ, కనబడకుండా సాగరికరూపం ధరించు, త్వరగా వెళ్లు. ఒరేయ్ కురూపీ... మాట్లాడవేరా?

కురూపి - (దూరంగా) కట్టెలు చాలా తెచ్చానయ్యా...

ప్రాస్పె - తిండికి తిమ్మరాజు పనికి పోతరాజు, త్వరగారా... ముఖ్యమైన పని వుంది. రావేరా పిశాచీ

కురూపి - నీ నోరుపడిపోనూ నీ వొళ్ళంతా పుళ్ళు అయిపోనూ, నీ కళ్ళు కాయలు కాసిపోనూ, నీ కడుపు కాలిపోనూ నీ ఇల్లు వల్లకాడై పోనూ.

ప్రాస్పె - నువ్వు పెట్టేశాపాలకి తగిన శిక్ష అనుభవిస్తావు కాసుకో. నిన్ను ముసిరే తేనెటీగలచేత కుట్టిస్తాను తేనెపట్టుని పిండినట్లు రక్తం ఓడేదాకా నిన్ను పిండిస్తాను. ఏమిటా తలపొగరు. ఎందుకల్లా బుజాలెగరేస్తూ విర్రవీగుతున్నావు? చెప్పిన పనిని సరిగ్గా వినిపించుకుని చెయ్యకపోతే వొళ్ళంతా తేళ్లు కుట్టేట్లు చేస్తాను. ఎముకలు విరగగొట్టేస్తాను.

కురూపి - వొద్దుబాబూ వొద్దు. (తనలో) వీడికి ఎదురుతిరిగి లాభంలేదు. వీడి మంత్రాలధాటికి మా దేవుడ కూడా తట్టుకోలేడు. తలలో జేజమ్మకూడా దిగి రావాల్సిందే.

ప్రాస్పె - అయితే.పద కట్టెలు కొట్టుకురా పో అడుగో సమీరుడు. సాగరిక వేషంలో యువరాజును సమీపిస్తున్నాడు

(సాగరిక నృత్యంచేస్తూ పాటపాడుతూ ప్రవేశిస్తుంది)

సమీరుడు సాగరికావేషంలో పాడే నృత్య గానము

చాలించు నీ ప్రళయ తాండము జలధీ
పాలించు దయతోడ మమ్మింక ఉదధీ
పాంగుల అలలు పండువెన్నెల కలలు
పసిడి వన్నెల ఇసుక తిన్నెలా మిలమిలలు
తీరాన ఆడేది పాదాల కింకిణులు
గొంతెత్తి పాడేది కంఠాల కలకలలు .
చాలించు..

రాజకుమారుడు - ఎవరిదీ పాట? నేలలోంచి ఎగసివచ్చిందా, గాలిలో తేలివచ్చిందా? ఇది మానవసంగీతం కాదు. గంధర్వ గానం. నా తండ్రికోసం శోకించే నా హృదయాన్ని యీగానం ముగ్ధుణ్ని చేసింది మంత్రించినట్లుగా ఈ పరవడి తొక్కే కెరటాలన్నీ ఒక్కసారిగా పడగలు ముడుచుకున్న విషసర్పాలైపోయి నాయి ఈ పాట నా కళ్లముందు బంగరుబాటలా మెరిసి నన్నెక్కడికో, నడిపిస్తోంది కాస్సేపు వినబడి మౌనంలో మాయమై మళ్లీ మధురంగా నా హృదయానికి పాశంవేసి ఏటుందుకి లాగుతోంది.

(నృత్యగానం)

నాన్న పడని నన్ను అడుగుతావేలా
అరయవా జేలా..
అయిదు నిలువులలోతు నణగి పడియున్నాడు
మరలి రాలేనంటు మొరపెట్టుకున్నాడు
కనులలో తళుకులే ముత్యాలుగా మారె
అధరాల కెంపులే పగడాలలో చేరె
మా జోలపాటలకు సోలిపోతున్నాడు
మారిపోయాడు మరి రాలేడు రాబోడు

రా కు - మా నాన్ననిగురించి కాదుకదా? అప్పనవును. ఇదేదో ఇంద్రజాలంలాగా వుంది. అప్సరలో, యక్షులో, గంధర్వులో, కాని మానవులుకారు. ఏమా మధురగానం

ప్రాస్పె - నీ కనురెప్పలెత్తి ఒకసారి చూడు తల్లీ, యీవింత ఏమిటో చెప్పుకోగలవా'

మిరాం ఏమిటిది? రాక్షసుడా? మాంత్రికుడా? అమ్మో అల్లా చూస్తాడేమిటి? ఆకారం చాలా బాగుంది నాన్నా. నీ మంత్రాలతో సృష్టించిన మూర్తే అయినా చాలా చక్కగా వుంది ఎవరు నాన్నా?

ప్రాస్పె - కాదమ్మా, మనలాటి వాడే, మామూలు మనిషే మునిగిపోయిన ఓడలోవున్న యాత్రికులలో ఇతడొకడు. తక్కిన వాళ్లకోసం వెతుక్కుంటున్నాడు. విచారం అతని రమణీయరూపాన్ని మసక మబ్బులాగా మరుగుపరుస్తున్నది. లేకపోతే చాలా అందగాడని అనవచ్చు.

మిరాం - ఇటువంటి అందం మానవుల్లో వుండదు. ఇతను దివ్యమూర్తిగా కనిపిస్తున్నాడు నాన్నా.

ప్రాస్పె - (తనలో) కథబాగానే నడుస్తోంది. అనుకున్న ప్రకారమే అంతా జరుగుతోంది సమీరా! నీకు స్వాతంత్ర్యం ప్రసాదిస్తాను త్వరలో

రా. కుమా - దేవీ, ఈ ద్వీపాన్ని పాలించే దివ్యశక్తివి నువ్వే. యీ మధురసంగీతం నీ ఆరాధనకోసమే నిరంతరం ప్రతిధ్వనిస్తున్నది ఈ సామ్రాజ్యంలో నేను ఎల్లా ప్రవర్తించాలో దయవుంచి శెలవివ్వాలి దేవీ. విభ్రాంతవిచిత్ర రూపిణీ! ఏలోకం నుంచి అవతరించావు నీ అతిలోకసౌంద

ర్యానికి అధినాథుడైన అదృష్టవంతు డెవరు? చెప్పవా?

మిరాం - నేను మానవ కుమారిని

రా కుమా - ఆశ్చర్యం, నా భాషలోనే నాకు బదులు చెపుతున్నావా? నేను నేపుల్స్ దేశపు యువరాజును. ప్రమాదంలో చిక్కుపడ్డాను

ప్రాస్పె - అబద్ధం అయితే మీనాన్న ఎక్కడ?

రా. కుమా - కనిపించలేదు, వెతుకుతూ తిరుగుతున్నాను కన్నీరు మున్నీరుగా శోకిస్తూ అంతటా గాలిస్తున్నాను కడలి తరగలు పొట్టను పెట్టుకున్నవేమోనని భయంగావుంది ఈ కళ్ళకి మరి కనబడ డేమోనని దిగులుగా వుంది

మిరాం - పాపం...ఎంత దురదృష్టం

రా కుమా - ఓడలో వాళ్ళంతా నీటిపాలై పోయారు...అకాలమరణం

ప్రాస్పె - నువ్వు గొప్ప అపచారం చేశా వురా, ఇల్లారా

మిరాం - (తనలో)—నాన్న ఇంత పరుషంగా మాట్లాడతాడెందుకు? ఎందుకో నా మనస్సు వెన్నలా కరిగిపోతోంది...ఇతని మీద నాన్నకి జాలికలిగి దయతో ఆదరిం చితే ఎంత బాగుంటుంది. ఇతనికోసం నా హృదయం ఎందుకో తల్లడిల్లి పోతోంది.

రా. కుమా - నీ హృదయాన్ని ఏ దుర్మా ర్గుహూ దొంగిలించకపోతే నిను నా రాజ్యానికి రాణినిచేస్తాను. నా ప్రేమ సామ్రాజ్యానికి పట్టమహిషివి నువ్వే.

ప్రాస్పె - ఏమిట్రా గొణుగుతున్నావ్? ఇల్లారా. నేను చెప్పినపని చెయ్యి నువ్వు రాజకుమారుణ్ణని మమ్మల్ని మోసగించ టానికి వచ్చావు మా దేశపు గుట్టుమట్టు కనుక్కోటానికి వచ్చిన గూఢచారివి నువ్వు దొంగవేషాలు నా దగ్గిర సాగవు, కట్టిపెట్టు నీ మోసాలు.

రా. కుమా - నిజం, ముమ్మాటికీ నిజం. నేను నేపుల్స్ దేశపు రాజకుమారుణ్ణి

మిరాం - నిజమే నాన్నా. ఇంత అందమైన రూపంలో మోసగించి నివసించడానికి వీల్లేదు ఇతని మాటలు అనుమానించటం అన్యాయం

ప్రాస్పె - నువ్వూరుకోవమ్మా...నీకు తెలి యదు. వీడుద్రోహి. పదరా...నీ పెడ రెక్కలు విరిచికట్టి నీ కాళ్ళకి బండ కొయ్య వెయ్యాలి తిండికీ నీళ్ళకీ మొహం వాచిపోవాలి పదరా చూస్తావేం.

రా కుమా - నీ బెదిరింపులకి నేను లొంగు తాననుకున్నావా? రా, బలాబలాలు తేల్చుకొందాం కానుకో, (కత్తిదూస్తాడు కాని చెయ్యిలేవదు)

ప్రాస్పె - ద్రోహీ! నీకత్తి నాకు గడ్డిపరకతో సమానం. నువ్వు దుర్మార్గుడివి కత్తిని ఒరలోకి పంపించు పూచికపుల్లతో నిన్ను చిత్తు చెయ్యగలను జాగ్రత్త.

మిరాం - నాన్నా! అనుగ్రహించవా? దయ చూపవా? ఈ నిరపరాధిమీద నీ కెందు కింత కాఠిన్యం

ప్రాస్పె - కాళ్ళమీద ఎడకు, లే...దూరంగా పో నువ్వు

మిరాం - కరుణించు నాన్నా. నాదీ పూచీ అతనివల్ల ఏ ప్రమాదమూ రాదు

ప్రాస్పె - నీకు తెలియదు. వీడి ఎముకల్లో బలమంతా మాయమై బొమ్మలాగా నిల బడి పోయాడు. కదలలేడు

రా. కుమా - అవును. అంతా కలలాగా వుంది. మానాన్నమరణం, బంధుమిత్రుల ప్రాణనష్టం, నా దౌర్బల్యం ఈ మనిషి దౌర్జన్యం ఇవేవీ నన్ను బాధించటం లేదు రోజుకొకసారి అయినా ఈలావణ్య రాశిని దర్శించి సంభాషించే భాగ్యం కలిగితే నా కింకేమీ అక్కర్లేదు. యావ జ్జీవ కారాగారశిక్షనైనా చిరునవ్వుతో స్వీకరిస్తాను. చెరసాలకూడా నా చెలి

సాన్నిధ్యంలో సువిశాల చంద్రశాలగా మారిపోతుంది. సమస్త ప్రపంచమూ నాకు ఆ నాలుగుగోడల మధ్యనే...

ప్రాస్పె - (తనలో) మంత్రం బాగాపారింది. సమీరా! నీకు ధన్యవాదాలు. ఇంకేం చెయ్యాలో చెప్తాను... విను... ఊం ద్రోహీ... పద నే చెప్పిన పని చెయ్యాలి పద...

సమీర - చిత్తం స్వామీ

మిరాం - రాజకుమారా! దిగులు పడకు, ధైర్యం తెచ్చుకో మా నాన్న మనసు నవనీతం. మాటమాత్రమే వజ్రాయుధం.

ప్రాస్పె - సమీరా, నా ఆజ్ఞ నెరవేర్చవస్తే నీకు సంపూర్ణస్వేచ్ఛ గిరిశిఖరాల మీది బంధుర సమీరంలాగా విశృంఖల విహారం చేయవచ్చు.

సమీర - చిత్తం స్వామీ.

ప్రాస్పె -ఏయ్ అబ్బాయ్...నా వెంట నడు. అమ్మాయ్, నువ్వు వీడిపక్షాన మాట్లాడితే నేను సహించను

రెండవ శ్రవ్యము

ఏలన్సో:- శుభమూ అని పెళ్ళికివెళ్లి తిరిగి వస్తుంటే దారిలో ఇంత ఘోరప్రమాదం జరిగింది నా అనంతరం సింహాసనం అధిష్టించి పది కాలాలపాటు దేశాన్ని ధర్మంగా పరిపాలించి ప్రజల అభిమానాన్ని చూరగొంటాడని ఎన్నో కలలు కన్నాను. ఆశలన్నీ వాడిమీదే పెట్టుకుని కాలం గడుపుతున్నాను భగవంతుడా! నా బంగారుతండ్రిని పొట్టను పెట్టుకుని నా స్వప్నసౌధాలన్నీ నేలకూల్చి నా గుండెల్లో ఆరనిచిచ్చు రగిలించావా?

సేవక - దుఃఖించవద్దుప్రభూ ... యువరాజుగారు క్షేమంగా ఎక్కడో వున్నారని నాకు కొండంత ఆశ కలుగుతోంది.

ఏలన్సో - అంతఅదృష్టం నాకులేదు...వాడు నాకు దక్కేయోగం లేదు.

సెబాస్టి:- నిజం అన్నయ్యా వాడుప్రాణాలతో మనకి దక్కటం అసంభవం కాని ఆపదకంతటికీ నువ్వే మూలకారణం. దూరాభారం యీ సంబంధం వద్దంటే విన్నావా? ఏ ముహూర్తాన జరిగిందో కాని మన యువరాజు నిండుప్రాణాలు బలిదీసుకొన్నది. మనం చావుతప్పి కన్ను లొట్టపోయి ఈ దిక్కుమాలిన లంకలో వచ్చిపడ్డాం ఇదంతా స్వయంకృతాపరాధమైనప్పుడు, ఏడ్చినా ప్రయోజనం ఏముంటుంది...?

గొంజా - కట్టెవిరిచి పొయ్యిలో పెట్టినట్టు మాట్లాడి నెత్తురుజిమ్మే గాయంమీద కారం చల్లుతావేమయ్యా ... కష్టాల్లో వున్నవాళ్లని చల్లటిమాటలతో ఓదార్చాలి.

ఏలన్సో - మాటలవల్ల నా గుండెల్లో మంట చల్లారుతుందా?

(సాగరిక ఆప్యాయమైన మధుర రాగాలాపన చేరువవుతుంది)

గొంజా - అమ్మయ్యా, ఎంత కమ్మటిరాగం జోలపాటలాగావుంది కళ్లు మూసుకుపోతున్నాయి

ఏలన్సో - మత్తుమందు చల్లినట్లు అంతా నిద్రపోతున్నారు. నాకూ నిద్రముంచుకు వస్తోంది.

సెబాస్టి -కష్టాల్లో వున్నవాళ్ళకి నిద్ర అమూల్యమైన వరప్రసాదం. కాస్సేపు నిద్రాదేవతఒళ్లో తలదాచుకుంటేచాలు, మనసులోని కలతలు మాయమైపోతాయి.

ఏంటోనియో - నిర్భయంగా నిద్రపొండి. నేనూ మీ తమ్ముడూ మేల్కొని మీకు ఏఅపాయమూ రాకుండా కావలికాస్తాం.

ఏలన్సో - నాకేం భయం? నిద్రపోతాను

సెబాస్టి:- ఇంత మత్తునిద్రలో మునిగిపోయారేం అందరూ? మనకిమాత్రం నిద్రరావటంలేదు కళ్లు గుచ్చుకున్నా కునుకు పట్టటంలేదు

ఏంటోనియో - అదీ మన మంచికే...దగ్గరికిరా ఇప్పుడు మనమొక ముఖ్యమైన పని పూర్తిచెయ్యాలి. దైవం ప్రోద్బలం చెయ్యటంవల్లనే అందరూ నిద్రలో వొళ్లెరక్కుండా పడివున్నా మనకి కళ్లు మూత పడటంలేదు.

సెబాస్టి - ఎందుకని నిద్రరావటంలేదు ?

ఏంటోనియో - ఇన్నాళ్లూ నువ్వు నిద్రపోతున్నావు చాలదా? ఇక కళ్లు తెరవాలి.

సెబాస్టి - అంటే ఏమిటి నీ వుద్దేశ్యం.

ఏంటోనియో - ఇన్నాళ్ళూ నీఅదృష్టం నిద్రపోతోంది మేలుకోవలసిన వేళ వచ్చింది నీ ముఖంలో రాజకళ ఉట్టిపడుతోంది నీ తలమీద రత్నకిరీటం ధగధగ మెరుస్తూ వుంది అదుగో!

సెబాస్టి - కలత నిద్రలో నీకేమైనా కల వచ్చిందా? కలవరిస్తున్నావా ?

ఏంటోనియో - కాదు కాదు రాజమకుటం నీ శిరస్సుని అలంకరించాలని ఎదురుచూస్తున్నది ఇదే మంచి సమయం మించిపోతే తిరిగి దాని అపూర్వావకాశం, చేతులారా జారవిడిచి ఎక్కడ వున్నావే గొంగళీ అంటే వేసినచోటనే అని పడివుంటావా? సాహసించు విజయం సాధించు.

సెబాస్టి - నీ మాటలు నాకు అర్థం కావటం లేదు.

ఏంటోనియో - యువరాజు మరణించాడు.. నువ్వే రేపటి రాజువి

సెబాస్టి - నిజంగానా?

ఏంటోనియో - రేపటిదాకా కాచుక్కూచోటం దేనికి? ఇప్పుడే నీకు రాజరికం దొరికే దగ్గరిదారి చూపిస్తాను జాగుచెయ్యకు.

సెబాస్టి - ఏం చెయ్యమంటావు మిత్రమా?

ఏంటోనియో - నేను ఏంచేశానో అదే చెయ్యవయ్యా మిత్రరత్నమా — నా అన్నని సాగనంపి నేను సింహాసనం ఆక్రమించాను గాఢనిద్రలోవున్న నీఅన్ననీ తుదముట్టించినువ్వు నేపుల్స్‌దేశానికి రాజువై పోవటానికి ఇదే మంచి అదను దాటిపోతే నీగతి అధోగతి కాక తప్పదు.

సెబాస్టి - మరి ఈ ముసలాడిమాట ఏమిటి? తగుదునమ్మా అని మనకి ధర్మపన్నాలు చెప్పటానికి తయారవుతాడేమో

ఏంటోనియో - నీఅన్న నీవంతు, యీ ముసలాడు నావంతు, ఇద్దరికత్తులూ ఒక్కసారిగా వీళ్ళ కంఠాలని కత్తిరించాలి

సెబాస్టి - ఓ అల్లాగే...నేను సిద్ధమే గురూ.

సమీర - (అదృశ్యంగా)-మత్తునిద్ర మానండి కళ్ళు తెరచి చూడండి. ద్రోహుల ఆటలుకట్టాలి. ప్రాణాలిప్పుడు దక్కాలి.

ఏంటోనియో - త్వరగా కానివ్వాలి.

సెబాస్టి - అన్నయ్య కదులుతున్నాడు లేచి కూచుంటున్నాడు (కొంతసేపు సైరన్)

ఏలన్సో - ఏమిటిది ? మేలుకునేవున్నారా ఏం జరిగింది? కత్తులు దూశారెందుకు ఏమిటీ క్రూరభంగిమలు? ఎవర్ని చంపుదామని...?

గొంజా - ఏం జరిగిందర్రా...?

సెబాస్టి - ఎద్దులు రంకెలువేసినట్లు సింహాలు గర్జనలు చేసినట్లు, భీకరంగా భూమికంపించినట్లు ఒకటే బ్రహ్మాండమైన ఘోష బయలుదేరింది. జాగర్తకోసం కత్తి దూశాను

ఏలన్సో - నాకేమీ వినబడలేదే ?

గొంజా - నా చెవులలో ఏదో తుమ్మెద రొద చేసినట్లు వినిపించి కళ్లు తెరిచాను. ముందు జాగ్రత్త ఎందుకైనా మంచిది ఇంకెక్కడికైనా పోయి తలదాచుకుందాం పదండి ... ఇక్కడ ఏం ఆపద మూడుతుందో.

ఏలన్సో - పోదాం పదండి.

సమీర - (దూరంగా) - నా యజమానిదయవల్ల ప్రాణాలు దక్కాయి. ఈపాటికి

పరలోకానికి ప్రయాణం కట్టేవాళ్లు
మీ అదృష్టం బాగుంది

మూడవ శ్రవ్యము

ప్రాస్పెరో -(స్వగతం)ఎంత విచిత్రశక్తి యీ ప్రేమ హృదయంలో ప్రణయం పరిమళిస్తుంటే ఇనపసంకెళ్ళు సైతం పూలమాలలుగా మారిపోతాయి. ఈ రాజకుమారుడు ప్రేమకోసం ఎంత నికృష్టమైన దాస్యానికి ఒడబడ్డాడో ... బానిసలాగా కట్టెలు కొట్టి మోపులు కడుతున్నాడు.

మిరాం,- చేతులు కందిపోయినాయి. చెమటలు కారుతున్నాయి.కాస్సేపు విశ్రాంతి తీసుకోండి మీబదులు నేను పనిజేస్తాను నాన్న నిద్రపోయేవేళ అయింది.

రా కుమా.- ప్రియసఖీ నీ సానుభూతి వుంటేచాలు కొండని పిండిచేస్తాను. నా దేశంలో యువరాజుని, నీ పాదదేశంలో నేను బానిసను.

మిరాం - నాకోసం ఇంత కష్టపడటం నేను సహించలేను. నన్నుకూడా మీ శ్రమలో భాగం పంచుకోనివ్వండి.

రా. కుమా - నా రాణివి అయిన తరవాత పంచుకుందువుగాని తొందరెందుకు?

మిరాం:- రాణినైనా దాసినైనా నేను జన్మజన్మాలకీ మీ బాన్నే కష్టసుఖాలలో వీడని తోడునీడనై వెంటవస్తాను.

ప్రాస్పెరో - రాజకుమారా నిన్నేనయ్యా బెదరకు...నిన్ను కఠినపరీక్ష చేశాను... నీప్రేమ గాఢమైనదో కాదో తెలుసుకోడానికి నిన్ను ఇన్ని కష్టాలకి గురిచేసాను సులభంగా సాధించిన విజయం చులకనైపోతుంది కష్టసాధ్యమైన ఫలసిద్ధి హృదయంలో కలకాలం నిలబడిపోతుంది.నేను చేసిన కఠోర పరీక్షలో నువ్వు ఉత్తీర్ణుడివైనావు. నన్ను మన్నించి నా పంచప్రాణాలూ పెట్టుకుని పెంచిన ఈచిన్నారి తల్లిని స్వీకరించు నేను సమర్పించగల ఉత్తమ బహూకృతి ఇదే

మిరాం.- నేను చెప్పలేదా మానాన్న మనసు మంచిదని

రా కుమా - నేను ధన్యుణ్ణి

ప్రాస్పెరో - కాని తొందరపడకండి కల్యాణసమయం ఇంకా రాలేదు నిగ్రహంతో కళ్లెం బిగించి నేను చెప్పేదాకా వేచి వుండండి. ఇంకాకొన్ని పనులు పూర్తి చెయ్యాలి.

రా,కుమా - మీ ఆజ్ఞ శిరసావహిస్తాను.

ప్రాస్పెరో - అయితే నేను పిలిచేదాకా నా గుహలో కూచోండి. వెళ్ళండి.

సమీర.- స్వామీ! వాళ్ళ దుఃఖం చూస్తే నా కడుపు చెరువైపోతూంది. అందరికంటే ఆ వృద్ధుడు మరీ దుర్భరశోకంలో కన్నీళ్ల వాన కురిపిస్తున్నాడు.

ప్రాస్పెరో - మానవుడినైన నాకు మరింత బాధ కలుగుతుంది వాళ్లనిచూస్తే. వాళ్లు నాకు శత్రువులైనా వాళ్ళని పెట్టిన బాధలు చాలింక. ఉదార హృదయంతో తప్పిదాన్ని క్షమించటంలోనే గొప్పతనం వుంది. వాళ్ళ గుండెల్లో పరితాపాగ్ని రగుల్కొల్పటమే నా ఉద్దేశం. ఇక నాకు వాళ్లమీద ద్వేషంలేదు ఈర్ష్య లేదు, వాళ్ళనిక్కడికి తీసుకురా సమీరా ...నా మంత్రం ఉపసంహరిస్తాను.

(మధుర స్వరాలాపన)

ప్రాస్పెరో.- సలసలకాగిన శిరోవేదన సమసిపోతుంది. మత్తుతెరలు మాయమైపోయి చైతన్యప్రవంతి మీలో ఉప్పొంగుతుంది వివేచనాశక్తి తిరిగివస్తుంది, సమీరా నా దుస్తులు తీసుకురా.

సమీర - చిత్తం ఇవిగో ధరించండి

గొంజా.- అబ్బా! యీదెయ్యాల లంకలోంచి త్వరగా బైటపడితే, బాగుండుపోను.

అన్నీ వింతలే, బాధలే, కష్టాలే ఎక్కడ చూచినా.

ప్రాస్పెరో:- నేనెవర్నో గుర్తుపట్టలేదా....? అక్రమానికి గురిఅయిన మిలాన్‌దేశపు సార్వభౌముణ్ని. అందరికీ సుస్వాగతం... సుస్వాగతం.

పలనో్సః- నువ్వేనా? నిజంగానా? ఇంద్రజాలం కాదుకదా? నీచెయ్యి వెచ్చగానే వుందే—చేసిన తప్పుకి చెంపలువేసుకుని క్షమాభిక్ష వేడుకొంటున్నాను. నీ దేశం మీద నాకు ఏర్పడిన అధికారాలన్నీ యీ క్షణమే వదులుకుంటున్నా. నువ్విక్కడికెల్లా వచ్చావు—?

ప్రాస్పెరో:- ప్రాణమిత్రుడా! నీకు కృతజ్ఞతాపూర్వక ప్రణామాలు సమర్పించటం నా ప్రథమ కర్తవ్యం. నీ వయస్సూ నీ యశస్సూ ప్రశంసార్హమైనవయ్యా.

గోంజా:- రాజా, యీ సేవకుణ్ని మరిచిపోలేదా? నేను చేసిన సేవ ఏపాటిదిస్వామీ?

ప్రాస్పె:- ఈ తోడుదొంగలిద్దరూ ద్రోహబుద్ధిలో సమవుజ్జీలు. కుక్కతోకలాటి స్వభావం.

సెబాస్టి:- ద్రోహమా—నేనా? నేనేమీ ఎరగను...వీడే పురిఎక్కించాడు.

ప్రాస్పెరో:-బుజాలుతడుముకోకండి. నిద్రలో నేపుల్సురాజుని హతమార్చాలని చూశారు నిజమేనా? తప్పుకుసూ! నోరారా పిలవటానికి నాకు మనసొప్పటం లేదు—నీ దుష్కార్యాలన్నీ క్షమిస్తాను. నారాజ్యం నాకు తిరిగి ఇవ్వాలి తప్పదు.

పలనో్సః- నువ్విక్కడికి ఎప్పుడు వచ్చావు? ఎట్లా వచ్చావు? ఈ దిక్కుమాలిన ద్వీపం నా కన్నతండ్రిని కాజేసింది. నన్ను బికారిని చేసింది.

ప్రాస్పెరో:-నా చిన్నారితల్లి నాకు కాకుండా పోయింది. ఇద్దరికీ సమానమైన ఆపద సంభవించింది. కష్టాలలోనే సహనం వహించాలి.

పలనో్సః- నీ కూతురా? ఏమయింది? నేను సముద్రం పాలైపోయి నా కొడుకూ నీ కూతురూ నేపుల్సుదేశానికి రాజూ రాణీ అయితే ఎంత బాగుండేది. పాపిని, నేను బతికున్నాను. వాడు నాకుకాకుండా పోయాడు.

ప్రాస్పెరో:- అంత అదృష్టం వుండొద్దూ—అనుకున్న ప్రకారం అన్నీ జరుగుతయ్యా...?

(గుహద్వారాన కట్టిన తెర తొలగించగా రాజకుమారుడూ మిరాండా చదరంగం ఆడుతూ వుంటారు.)

మిరాం:- నన్ను ఎంత మోసం చేశారు—?

రా కుమా:- ప్రపంచంలోని ధనమంతా లంచమిచ్చినా నిన్ను మోసంచేస్తానా నేను.

మిరాం:- మీకోసం ఎన్ని రాజ్యాలైనా త్యాగం చేస్తాను.

సెబాస్టి:- వింతల్లో వింత—అత్యద్భుతం.

రా కుమా:- సముద్రుడికి ఎంత జాలిగుండె. నాన్నా నాన్నా నన్ను దీవించు.

మిరాం:- ఆశ్చర్యం — ఎంతమంచి వింత జీవులు! ఎంత రమణీయం యీ మానవ లోకం! ఓ విచిత్రవిశ్వమా. ఎన్ని రకాల వ్యక్తులున్నారో నీలో.

ప్రాస్పెరో:- ఈలోకం నవలోకం. ఇదే మానవలోకం తల్లీ—ఇదే మనలోకం.

పలనో్సః- ఎవరీసుందరి? మనల్ని విడదీసి మళ్లీ ఒకచోటికి చేర్చిన భాగ్యదేవత ఈమేనా?

రా కుమా:- దేవతకాదు, మానవయువతి, మిలాన్‌దేశపు రాకుమారి, మీ అనుమతి పొందలేనందుకు మన్నించాలి? ఈమెని వరించి వలచి వివాహం చేసుకుంటానని మాట యిచ్చాను. ఈయన నా మామ.

పలనో్సః- అయితే నేను నీ మామనమ్మా... నా దుష్కార్యాలన్నీ మన్నించు.

ప్రాస్పెరో:- ఈ శుభసమయంలో గతకాలపు వెతలన్నీ మరిచిపోదాం.

గొంజా - దేవతలారా ఈ నవదంపతులమీద పుష్పవర్షం కురిపించండి.

ప్రాస్పెరో - తొందరపడకు .ఇంకా ఒక్క పని మిగిలిపోయింది...సమీరా పరీక్ష దుర్మార్గులు ముగ్గురూ? వాళ్ళని కూడా క్షమిస్తేనేకాని నామనస్సుకి శాంతిలేదు.

(పుష్పవర్షం)

గొంజా.- నిజంగా దేవతలే దిగివచ్చారా? కనులపండువుగా వుంది.

ప్రాస్పెరో - ఇదంతా నా మంత్రమహిమ. మీ అందరి సమక్షంలోనూ నేను నా అభిమాన మంత్రవిద్యని పరిత్యజిస్తున్నాను. నా మంత్రదండాన్ని విరిచి సముద్రంలో గిరాటువేస్తున్నాను నా మంత్రశక్తికి వీడ్కోలు చెబుతున్నాను మనదర్పాలు మన వైభవాలు క్షణభంగురాలు. వధూవరులను దీవించి గాలిలో కలిసిపోయిన ఈనర్తకులలాగా సమస్తవిశ్వమూ నామరూపాలు లేకుండా మటుమాయమై పోవలసిందే. మిన్నంటే గోపురాలు, వైభవోపేతమైన మహాసౌధాలు, పవిత్ర దివ్యమందిరాలు కలలాగా కరిగిపోవలసిందే మన జన్మలే విచిత్రస్వప్నాలు. మరణ మహాసుషుప్తిలో కలిసిపోయే క్షణిక స్వప్నం మన జీవనం

గొంజా - వినవలసిన మాటలు చెప్పావు మహారాజా . వీటికోసమే ఇంతకాలం బతికి వున్నానేమో...దుర్మార్గులు బుద్ధి తెచ్చుకావాలి.

ఏంటోనియో - అన్నయ్యా, ఈమహాపాపిని మన్నించవా? నేను ఇంతవరకూ చేసిన ఘోరమైన అపరాధాలని దైవం మన్నించదు.

ప్రాస్పెరో - దైవం దయామయుడు. క్షమాస్వరూపి. కాళ్లు వొదులు, లే. మంచిగా కాలం గడుపు. గడిచిన సంగతులు తిరగ వెయ్యకు, సమీరా! ఇక నీకు సంపూర్ణ స్వాతంత్ర్యం ప్రసాదిస్తున్నాను నువ్వు లేకపోతే నాకు చెయ్యి విరిగినట్లే, అయినా ఆడినమాటతప్పను

సమీర - మహాప్రసాదం.

నన్నెవ్వరాపలేరీవేళ మన్నుమిన్నుల నడుమ
తూగేనుడోల

నీలిమబ్బుల పడవలోపల తేలిపోదు దిగంత
లాలకు

పూలగుండెలతేనె లానుచు సోలిపోదు
వసంతవేళల

కడలి తరగలపడగ లెక్కుచు గంతులేస్తూ
తరలిపోతా

చింతలన్నీ కరిగిపోయెను సంతసము వెన్నె
లలు విరసేను

కృత్రిమ గ్రహాలు

శ్రీ వసంతరావు వేంకటరావు

కొన్నివందల కోట్ల సంవత్సరాల క్రిందట గ్రహాలతోసహా సూర్యుడు జన్మించేడని వైజ్ఞానిక ప్రపంచంలో భావిస్తున్నారు. నిరంతరం దేదీప్యమానంగా దుర్నిరీక్ష్యంగా మహోజ్జ్వలంగా మండుతూ ప్రకాశిస్తూన్న సూర్యగోళం చుట్టూ నిత్యప్రదక్షిణాలు చేస్తూన్నగ్రహాలు తొమ్మిదిఉన్నాయి వాటిలో మనభూమి మూడవది మనకంటె సూర్యునికి దగ్గరగానున్నవి బుధశుక్రులు, దూరంగానున్నవి కుజ, గురు, శని, యురేనస్, నెప్ట్యూన్, ప్లూటోలు. పుట్టినప్పటినుండి గ్రహాలు వాటివాటి కక్ష్యలలో పరిభ్రమిస్తున్నాయి కొన్ని గ్రహాలకు ఉపగ్రహా లున్నాయి. మన భూమిచుట్టూ తిరుగుతూన్న చంద్రుడొక్కడే భూమి నాశ్రయించిన ఉపగ్రహం.

సూర్యునికి 3 1/2 కోట్లనుండి 366 1/2 కోట్లమైళ్ళవరకుగల దూరంలో గ్రహాలుతిరుగుతున్నాయి. భూమినుండి సూర్యుని దూరం 9 కోట్ల 30 లక్షల మైళ్ళు, చంద్రుని సరాసరి దూరం 2,38,900 మైళ్ళు. భూమికి ఇరువైపుల నున్న గ్రహాలు శుక్రుడు, కుజుడు భూమినుండి శుక్రునిదూరం 2 కోట్ల 60 లక్షల మైళ్ళు, కుజుని దూరం 4 కోట్ల 85 లక్షల మైళ్ళు. కాగా మనకత్యంత సమీపాన్నగల ఖగోళం చంద్రుడు.

గ్రహాలన్నీ సూర్యుని చుట్టూ ఎందుకు తిరుగుతున్నాయని చాలామంది యోచించేరు. విజ్ఞానవేత్త న్యూటన్ (Newton) 17 వ శతాబ్దంలో దానికి సమాధానం కనుగొన్నాడు. దానికి కారణం గురుత్వాకర్షణ బలం (Gravitational force) అన్నాడు. ఆబలం సర్వజనీనమైంది ద్రవ్యమే గురుత్వాకర్షణానికి కారణం. ఏ రెండు ద్రవ్యరాశులైనా పరస్పరం ఆకర్షించుకొంటాయి వాటి పరిమాణంలో ఎక్కువ వ్యత్యాసమున్నప్పుడు పెద్ద(బరువైన) వస్తువుచుట్టూ చిన్నది తిరగవచ్చు. సూర్యుని చుట్టూ భూమి తిరుగుతూంది, భూమికంటె సూర్యునిభారం 320,000 రెట్లు భూమిచుట్టూ చంద్రుడు తిరుగుతున్నాడు; చంద్రుని కంటె భూమి భారం 81 1/2 రెట్లు సూర్యునిచుట్టూ తిరుగుతూన్న భూమియొక్క వేగం సెకెనుకి 18 1/2 మైళ్లు, భూమిచుట్టూ తిరుగుతూన్న చంద్రునివేగం సెకెనుకి 2/3 మైళ్లు మాత్రమే.

కోట్లకొలది టన్నుల బరువున్నభూమి తనపైనున్న ప్రతివస్తువుని ఆకర్షిస్తుంది ఆకర్షణం పరస్పరమైనప్పటికీ,తత్ఫలితంగా అనవలంబన వస్తువు క్రిందపడుతుంది. భూమియొక్క అపారమైన బరువే దానికి కారణం. ఆకర్షణబలం కనిపించదు, కాని, ఏమాత్రం అజాగ్రత్తగా నున్నా దానిఫలితం కనిపిస్తుంది, అ బలం నిత్యం లాగుతూండబట్టి ఏమాత్రం ఒరిగినా క్రిందపడతాము అందుచేతనే చేయిజారిన వస్తువు క్రిందపడుతుంది. ఎంత మీదికి ఎగిరినా భూబలాన్ని తప్పించుకొని, భూమిని విడిచిపెట్టి పారిపోలేము. అయితే, భూమియొక్క బరువూ, దానిఉరవ మొదలైన రాశులను వినియోగించి భూమియొక్క ఆకర్షణ బలాన్ని లెక్క కట్టగా, సెకెనుకి 7 మైళ్ళ వేగంతో బయలుదేరిన వస్తువుకి భూబల క్షేత్రాన్ని దాటిపోయే అవకాశముందని తెలిసింది అది గంటకు 25,000 మైళ్ళ వేగాన్ని మించిన వేగం

మానవుడు ప్రకృతిని పరిశీలించి అనేక రహస్యాలు తెలిసికోడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ ప్రయత్నం ఎప్పుడో ఆరంభమైంది బహువిధాల ప్రకృతిని శోధిస్తూ, అనేక శాస్త్రశాఖలను వృద్ధి చేసికొంటూ, క్రమక్రమంగా ప్రకృతియొక్క స్వరూపస్వభావాలను బోధపరచుకొంటున్నాడు ఈ రహస్యాన్వేషణలో గణితశాస్త్రం ముఖ్యమైనది. దాని సహాయంతో కట్టిన లెక్కలలో భూమియొక్క గురుత్వాకర్షణ విషయమై రెండు ముఖ్య ఫలితాలు లభించేయి. భూమినుండి బయలుదేరిన వస్తువు సెకెనుకి 5 మైళ్ళ వేగంతో గమిస్తే

అది భూమిచుట్టూ తిరుగుతూ చంద్రునివలె ఉపగ్రహమౌతుంది, సెకెనుకి 7 మైళ్ళ వేగంతో గమిస్తే భూమియొక్క ఆకర్షణను దాటిపోయి, సూర్యుని చుట్టూ తిరుగుతూ, భూమివలె గ్రహంకావచ్చు లేదా, దాని రోదసీయాత్రలో చంద్రుడు అడ్డువస్తే చంద్రుని ఢీకొనవచ్చు లేదా, చంద్రునిచుట్టూ తిరుగుతూ "ఉప ఉపగ్రహం" కావచ్చు ఏమైనప్పటికీ, సెకెనుకి 5 మైళ్ళ వేగం కంటె తక్కువ వేగంతో బయలుదేరిన వస్తువు భూతలాన్ని చేరుకొనక తప్పదని గణితం స్పష్టంచేసింది.

భూతలాన్ని దాటిపోయి ఆకాశవిహారం అవిచ్ఛిన్నంగా చేయాలంటె సెకెనుకి 5 మైళ్ళ వేగమూ, భూబంధాలను త్రెంచుకొని రోదసీ యానం చేయాలంటే సెకెనుకి 7 మైళ్ళ వేగం ఏ వస్తువుకైనా అవసరమన్నది నిర్వివాదం. అట్టి మహావేగాలను ఏ విధంగా కలిగించడ మని విజ్ఞానులు యోచించేరు రసాయనిక పదార్థాలనుండి అట్టి శక్తిని సంపాదింపలేమని గమనించేరు వస్తువు గాలిలో ప్రయాణం చేయాలి. విమానం ఆపని చేస్తుంది, కాని, విమానయానానికి గాలి అవసరం. నీటిలో స్టీమరు పోయినట్లే గాలిలో విమానం ఎగురుతుంది రమారమి పదిమైళ్ళ ఎత్తు చేరుకొనేసరికే గాలి పలుచనై విమానాలకు ఉపచరించదు అందుచేత రాకెట్లను ఉపయోగించాలని గ్రహించేరు. వాటిని అధికవేగాలతో నడపడానికి శక్తిమంతమైన ఇంధనాల అవసరాన్ని గుర్తించేరు; ఎట్టకేలకు వాటిని సాధించేరు. ఆ ఇంధనం పరమాణుశక్తికి సంబంధించినదని నమ్మడానికి అవకాశముంది

మొదట, ఉపగ్రహాలను విడిచిపెట్టేరు. తరువాత గ్రహాలనే సూర్యునికి సమర్పించేరు గ్రహమయేలోపున సూటిగా చంద్రుని ఢీకొనేటట్లు రెండవలూనిక్‌ని, చంద్రునికి ప్రదక్షిణం చేసి చంద్రునివెనుక భాగాల ఫొటోగ్రాపులు తీసి భూమికి పంపించకలిగిన మూడవ లూనిక్‌ని రష్యా ప్రయోగించింది వాటిలో కొన్నిటి వివరాలు, తెలిసినంతవరకు సమీక్షిద్దాము.

కృత్రిమ ఉపగ్రహాల ప్రయోగానికి వైజ్ఞానికమైన కారణముంది. ప్రపంచంలో నాలుగింట మూడుపాళ్లు సముద్రమయమే. ఒక్కపాలు నేల. నేలలో చాలాభాగం కొండలచేత, ఎడారులచేత, దుర్గమారణ్యాలచేత ఆక్రమింపబడింది. మిగిలిన నేలలో కొంతభాగాన్ని మాత్రమే వాసయోగ్యంగా కావించుకొని మానవులు ఆక్రమించేరు. విశ్వరహస్యాల మాటవిడిచి భూమిగురించి పూర్తిగా జ్ఞానాన్ని సంపాదించాలన్నా అదెంతో దుష్కరమని విజ్ఞానులు గ్రహించేరు. భూమివిషయం యోచిస్తే రోజుకొకసారి తనలోతను ఆత్మభ్రమణంచేస్తూ సంవత్సరానికొకసారి సూర్యునికి ప్రదక్షిణం చేస్తూన్న గ్రహం భూమి భూమియొక్క ఆత్మభ్రమణమూలంగా దివారాత్రులూ, పరిభ్రమణమూలంగా ఉత్తర దక్షిణాయనాలూ, ఋతువులూ కలుగుతున్నాయి. ఆత్మభ్రమణం వల్ల ఋతుపవనాలు కలుగుతున్నాయి

మానవుడు సుఖంగా జీవించాలంటే పుష్టినిచ్చే భోజనం, నివాసానికి మంచి ఇండ్లు, కట్టుకోడానికి దుస్తులుకావాలి వాటిలో భోజనాని కవసరమైన పదార్థాలను పండించుకొని భద్రపరచుకోవాలి ప్రకృతియొక్క స్వభావాన్ని గుర్తిస్తేకాని సకాలంలో పంటలు పండించుకొనలేడు ప్రకృతి చాంచల్యానికి లోబడితే జీవితమే సమస్యగా పరిణమిస్తుంది. అందుచేత, ప్రకృతి పరిశీలన అత్యంతావశ్యకమని గుర్తించేడు. ఇక, విజ్ఞాన పురోగమనానికి ప్రకృతియొక్క లక్షణాలు గమనించాలి. అందుచేత, ప్రపంచంలోనున్న 67 దేశాలు కలిసి కొన్ని కోట్లరూపాయలు ఖర్చుచేసి "అంతర్జాతీయ జియోఫిజికల్ సంవత్సరం" అను ఒక పథకాన్ని తయారుచేసి, ప్రపంచవ్యాప్తంగా 18 నెలలపాటు అనేక రంగాలలో పరిశోధనలు గావించేయి, ఆ ఫలితాలను అన్ని దేశాలకూ అందిచ్చేఏర్పాటుమీద కార్యక్రమం కొనసాగించిన విజ్ఞానులు, మాట తప్పకుండా రహస్యాలు దాచుకోకుండా, అన్ని దేశాల

వారికీ వెల్లడించేరు కృత్రిమగ్రహాల ప్రయోగం ఆ పథకంలో ఒక ముఖ్యభాగం.

భూగోళాన్ని ఆవరించి గాలిపొర ఉంది దానినే వాతావరణమంటారు. గాలిలో చాలా వాయువులున్నాయి. భూతలాన్ని దట్టంగానున్న గాలి, పైకిపోయిన కొలది పలచబడి పోతుంది. ఈ గాలిపొర మనకనేక విధాల సహకరిస్తున్నట్లు తెలిసింది ప్రాణులకు ప్రాణవాయువూ చెట్లకు బొగ్గుపులుసు వాయువు సరఫరాచేస్తూ జీవవృద్ధికి తోడ్పడుతూంది. భూతలంనుండి 25 మైళ్ళ ఎత్తున ఓడోన్ వాయువున్నట్లు, అది సూర్యరశ్మిలోనున్న అతి నీలలోహిత కిరణాలని గ్రసించి జీవులను కాపాడుతున్నట్లు విజ్ఞానులు తెలిసికొన్నారు. ఆపైనున్న వాయువులో కొంతభాగం విద్యుదావేశాన్ని పొంది, అయనులై, అయనావరణాలేర్పడి విద్యుదయస్కాంత తరంగాలను భూమివైపు మళ్ళించడానికి తోడ్పడుతున్నాయి అవి మన రేడియోస్టేషన్లు సృష్టించి ప్రసరించే తరంగాలు, అయనావరణాలే లేక పోతే రేడియో తరంగాలు సూటిగా ఆకాశంలోనికి పోయేవి, రేడియో వినే భాగ్యమే మనకు లేక పోయేది.

వాతావరణవాయువులను కల్లోలపరచే శక్తిమంతమైన తరంగాలు కాస్మిక్ కిరణాలు అవి కిరణాలుగాను కణాలుగాను కూడ వ్యవహరింపబడుతున్నాయి. వాటి జన్మస్థానం ఇదమిద్ధమని నిర్ణయం కాలేదు. భూగోళాన్ని నిర్విరామంగా ఒకేవిధంగా పర్దిస్తూన్న కాస్మిక్ కిరణాలగురించి జ్ఞానం పెంపొందింపకోవాలంటే భూమినావరించిన ఆకాశాన్ని విడిచి రోదసిలో ప్రవేశించాలి, అందుచేత, కృత్రిమమైన ఉపగ్రహాలనూ, గ్రహాలనూ ప్రయోగించవలసిన అవసరముంది. అంతేకాక, ఇతర ఖగోళాలకు అయస్కాంత క్షేత్రాలున్నాయా అన్నది అవసరవిషయం. అంతర్గ్రహాకాశంలో ఏమాత్రం దట్టంగా ద్రవ్యముందో తెలిసికొంటే విశ్వరూపాన్ని అవగాహన చేసికోడానికా జ్ఞానం ఎంతో ఉపకరిస్తుంది. భూతలాన్ని దాటి పైకి పోతూన్న కొద్దీ అయనావరణంలో కలిగేమార్పు సైతం పరిశీలించవలసిన అవసరముంది. కాబట్టి, కృత్రిమగ్రహాలకు తగిన ప్రాధాన్యమిచ్చేరు విజ్ఞానులు.

ఆ పథకాన్ని అనుసరించి అమెరికా రష్యాలు విజయవంతంగా కృత్రిమగ్రహాలను ప్రయోగించేయి రష్యా పంపిన ఉపగ్రహాలను "స్పుత్నిక్" లని, అమెరికా పంపిన వాటిని "డిస్కవరర్" అని అన్నారు. ఆయాదేశాలు ప్రయోగించిన గ్రహాలను, క్రమంగా, 'లూనిక్' అని, "పయనీయర్" అని అన్నారు ఉపగ్రహాలు భూమిచుట్టూ తిరిగి తిరిగి, కొంతకాలానికి మన గాలిపొరలో ప్రవేశించగానే రాపిడికి మండి మాయమైపోతాయి, ఆ పరిస్థితిని వారించలేరు గ్రహాలుమాత్రం భూమిని విడిచిన తరువాత రోదసిలో ప్రవేశిస్తే సూర్యునికి నిత్యప్రదక్షిణాలు చేస్తూ ఎంతకాలమైనా ఉండగలవని అనుకొంటున్నారు

మూడు లూనిక్‌లను రష్యా ప్రయోగించింది, ఒక పయనీయర్‌ని అమెరికా ప్రయోగించింది పదమూడు పౌన్ల భారంగల పయనీయర్ చంద్రుని దాటిపోయి సూర్యునిచుట్టూ ఒక కక్ష్య నేర్పరచుకొందని భావించడానికి ఆధారాలున్నాయి లూనిక్‌లుమాత్రం మూడు విధాల ప్రవర్తించేయి మొదటిది చంద్రుని దాటిపోయి సూర్యునిచుట్టూ తిరిగే గ్రహమైందనుకోవచ్చు రెండవది సూటిగా చంద్రుని ఢీకొంది. మూడవది చంద్రునికి ప్రదక్షిణం చేసి, చంద్రునివెనుక భాగపు ఫొటోగ్రాఫులు తీసి, టెలివిషన్‌ద్వారా భూమికి వాటి నంద జేసింది ఇప్పటికీ అది దీర్ఘవృత్తాకారకక్ష్యలో భూమిచుట్టూ తిరుగుతూంది. కాలక్రమాన్న అది ఉపగ్రహమై భూమికి ప్రదక్షిణాలుచేస్తూ తుదకు మండిపోవచ్చు లేదా, భూమియొక్క ఆకర్షణబలాన్ని త్రెంచుకొని, అంతర్గ్రహాంతరాళంలో ప్రవేశించి సూర్యునిచుట్టూ ప్రదక్షిణాలు చేయు గ్రహంగా పరిణమించవచ్చును.

కృత్రిమగ్రహాల ప్రయోగాన్ని రాకెట్ల ద్వారా సాధించేరు. రాకెట్లోనున్న పదార్థం మండి, వాయువుగా మహావేగంతో ఒకవైపు బహిర్గమిస్తుంది; అప్పుడు దానికి వ్యతిరేక దిశలో రాకెట్ గమిస్తుంది. బహిర్గతవాయువు హెచ్చినకొద్దీ రాకెట్టుయొక్క గమనవేగం కూడా ఎక్కువౌతుంది. ఈ సూత్రంపై పని చేసే రాకెట్టు ఒకేసారికాక, రాకెట్టులో రాకెట్టు లున్న దొంతరలు బయలుదేరితే, మొదటి రాకెట్లో పదార్థం మండిపోగానే అది జారి పోయి దానిలోనున్న రెండవ రాకెట్‌ను ముందుకు నెట్టుతుంది. ఇట్లు, ఒకదానిలో నొకటి ఏర్పరచిన మూడు నాలుగు రాకెట్లుగల పెద్ద రాకెట్‌ను విడిచిపెట్టినప్పుడు భూబంధా లను త్రెంచుకొనడానికి అవసరమైన పలా యనవేగం పొందిన తుది రాకెట్ రోదసిలో ప్రవేశిస్తుంది.

ఖగోళాన్ని ఆవరించిన ఆకాశం ఒక సుడి గుండంవలె ఉండవచ్చునని విజ్ఞానుల అభి ప్రాయం. భూమిచుట్టూ అనేక కక్ష్యలున్నట్లు భావించవచ్చును. ఒక అయస్కాంతంచుట్టూ అయస్కాంత బలరేఖలున్నాయి. ఇనపరజను సహాయంతో ఆరేఖల ఏర్పాటును ప్రత్యక్షంగా చూడగలం. ఎక్కడ అయస్కాంత ముంటే, అక్కడ దాని నావరించిన ఆకాశంలో బలరేఖలు ఏర్పడతాయి. దానిమూలంగా ఆ ఆకాశంలో మార్పు కలుగుతుంది; ఒకప్రత్యేక లక్షణం దానికి ప్రాప్తిస్తుంది. ఆ క్షేత్రంలో నున్న ఇనపవస్తువులు అయస్కాంతంచే ఆక ర్షింపబడి, బలవత్తరంగా లాగబడతాయి. ఒకే అయస్కాంతధ్రువ మున్నదనుకొంటే, అది ఆ బలరేఖల వెంబడి గమిస్తుంది- పట్టా లపై రైలుబండి ప్రయాణంచేసినట్టు.

అదేవిధంగా పెద్ద ద్రవ్యరాశిగల ఖగోళాల నావరించిన ఆకాశంలో మార్పు కలుగుతుంది. చిన్నచిన్న వస్తువుల గమనానికి అనుకూలంగా కొన్ని మార్గాలు ఏర్పడతాయేమో! అయ స్కాంత బలరేఖలట్లు అవికూడా మనకి కని పించవు. అయస్కాంతరేఖల విన్యాసాన్ని ఇనపరజను చూపుతూంటే, కృత్రిమగ్రహాల గమనాన్నిబట్టి భూమినావరించిన క్షేత్రస్వభా వాన్ని ఊహించే అవకాశం కలుగుతూంది. ఏ రెండు మూడుమైళ్ళ వేగంతోనో గమిస్తూన్న రాకెట్ సూర్యుని చుట్టుగల కక్ష్యలో ప్రవే శించగానే 18 మైళ్ళ వేగాన్ని సంపాదిస్తుంది. ఆ క్షేత్రంలో ఎంత అదృశ్యబలం లేకపోతే అంతవేగం సిద్ధిస్తుంది!

తే 2-1-59 దీని మొదటి లూనిక్‌ని రష్యా ప్రయోగించింది. చంద్రునికి నాలుగైదువేల మైళ్లు ఎడంగాపోతూ గ్రహంకావాలని విజ్ఞా నులు నిర్ణయించేరు. 2 1/2రోజులు ప్రయాణం చేసిన పిమ్మట చంద్రునికి ప్రక్కగాపోయింది. 5 రోజులలో సూర్యునిచుట్టూ తిరగడానికి కక్ష్య నేర్పరచుకొంది.దానిబరువు 3245 పౌన్లు. అది 15 నెలల కొకసారి సూర్యప్రదక్షిణం చేస్తుంది. అట్టి ప్రదక్షిణంలో ఒకప్పుడు భూమికంటె సూర్యునికి దగ్గరగావస్తూ, మరొక సారి భూమికంటె చాలాదూరంగా పోతుంది. అంటే, అది తిరుగుతూన్న కక్ష్య దీర్ఘవృత్తా కారంలో నుంది.

తే 12-9-59దీని ప్రయోగింపబడిన రెండవ లూనిక్ చంద్రతలాన్ని ఢీకొంది. అది చాలా అసామాన్యమైన విషయం. అది చంద్రుని ఢీకొనడానికి ముహూర్తం నిర్ణయించి, ఆ ముహూర్తాన చంద్రుని తాకేటట్లు, రమారమి, 34 గంటల ముందుగా దానిని విడిచిపెట్టేరు. భూమికి చంద్రునికి మధ్యనున్న ఆకాశంలో గల గాలి చాలా స్వల్పమనీ, అకాశంలో రాకెట్ ప్రయాణం చేసినప్పుడు కొంత సంఘ ర్షణ పొందుతుందనీ, దానిమూలంగా రాకెట్ వేగంలో మార్పు కలుగుతుందనీ, చంద్రుని సమీపిస్తూన్నకొద్దీ చంద్రాకర్షణ బలంచేత రాకెట్ వేగం క్షణంక్షణం ఎక్కువౌతూంటుం దనీ గమనించి, ఈ పరిమితత్వాలకు లోబడి పయనించు రాకెట్, బయలుదేరిన ఎంతకాలా నికి చంద్రుని చేరుతుందో, అది చేరేసమయా నికి చంద్రు డేస్థానంలోనుంటాడో లెక్కలు

కట్టి రష్యన్ విజ్ఞానులు రెండలూనిక్‌ని నిబ్బరంగా విడిచిపెట్టేరు

1959 సెప్టెంబర్ 12,, శనివారం నాటి మధ్యాహ్నం రెండవ లూనిక్‌ని ప్రయోగించినట్లు ప్రకటించేరు రమారమి 2 1/2 లక్షల మైళ్లు ప్రయాణంచేసి మాస్కో-టైమ్ ప్రకారంగా ఆదివారం రాత్రి 12 గంటల 1 నిమిషానికి చంద్రుని డీకొనాలని లెక్క-కట్టేరు. లూనిక్ ప్రయాణంచేసిన ఏ 34 గంటలలోను చంద్రుడు భూమిచుట్టూ తన కక్ష్యలో యథావిధిగా తిరుగుతునే ఉన్నాడు. ఆ వ్యవధిలో సుమారు 77000 మైళ్లు ఆకాశయానం చేసేడు. ఈ సందర్భాలన్నీ గమనించి ప్రయోగింపబడిన లూనిక్ అద్భుతంగా చంద్రుని డీకొంది నిర్ణీతసమయానికి 84 సెకెనులు మాత్రం ఆలస్యమైంది. మాస్కో- టైమ్‌ప్రకారంగా ఆదివారం రాత్రి 12 గంటల 2 నిమిషాల 24 సెకెనులకి లూనిక్ చంద్రతలాన్ని తాకి భిన్నమైపోయింది. మానవుడు సాధించిన ఘనవిజయాలలో ఇది అగ్రస్థానం వహిస్తుంది అనివార్యమైన మానవ ప్రగతికి ఇదొక తార్కాణం, ప్రకృతికి ఇదొక సవాలు

రెండలూనిక్ బరువు 3324 పౌన్లు. అది బయలుదేరినప్పటి నుండి దానిలోనున్న ట్రాన్స్మిటర్లు, సాంకేతిక ధ్వనులను ప్రసరిస్తూనే ఉన్నాయి. ఇంగ్లండులోని జోడ్రెక్ బాంక్ రేడియో టెలిస్కోపుతో ఆ ధ్వనులను గుర్తించిన సమయానికి భూమినుండి రాకెట్ 1,00,000 మైళ్ళ దూరాన్న ఉన్నట్టు శాస్త్రజ్ఞులు లెక్క- కట్టేరు. జోడ్రెక్‌బాంక్ డైరెక్టరైన ఆచార్య సి. ఎ. బి. లొవెక్ రష్యన్ విజ్ఞానులను అభినందించేడు చంద్రుని చేరుకొనేవరకు సాంకేతిక ధ్వనులను జోడ్రెక్ బాంక్ పరిశోధనాలయ విజ్ఞానులు వింటునే ఉన్నారు ధ్వనులు ఆగిపోగానే టైమ్ చూచి ప్రయోగం విజయవంతమైందని హర్షాన్ని వెలిబుచ్చేరు విజ్ఞానరంగంలో రాజకీయాలకు తావులేదు రాజకీయ వైషమ్యాల నతిక్రమించి కేవల సహకారభావంతో దేశదేశాల విజ్ఞానులు కలిసి ఏర్పాటు చేసిన అంతర్జాతీయ జియోఫిసికల్ సంవత్సర కార్యక్రమమే దీనికి తార్కాణం

రెండవ లూనిక్‌యొక్క- మార్గాన్ని సరిదిద్దగల యంత్రాలను భూతలంపై నెలకొల్పి, మానవప్రసక్తి లేకుండా, కేవలం శక్తి కరాలతో దానిని నిర్ణీతమార్గంలో సంచకలిగేరు, రాకెట్‌లో తుదిభాగాన్ని రేడియో సహాయంతో దారి తప్పకుండా శాసించడం రోదసీ రాకెట్ల నిర్మాణంలోనే గొప్ప విజయ మనడానికి సందేహంలేదు

ఇంకొక విశేషమేమంటే కొంతదూరం పోయిన తరువాత లూనిక్‌నుండి సోడియం వాయువు వెలువడి అది తోకచుక్క-వలె కనిపించడం. అనుకొన్నసమయానికి, అనుకొన్న ప్రదేశంలో ఆ వాయువు వెలువడి కృత్రిమ తోకచుక్క-వలె కనిపించింది. శనివారం రాత్రి మాస్కో- టైమ్‌ప్రకారం 1 గం. 30 ని.లకు ఆకాంతి గోచరించింది. అల్మాఆటాలో దాని ఫొటో తీసేరు సరియైనమార్గాన రాకెట్ పోతూందని తెలిసికోడానికి దీనినొక ఉపాయంగా వినియోగించుకొన్నారు,

చంద్రతలాన్ని లూనిక్ తాకిన సమయానికి చంద్రునిలో నల్లటిమచ్చ కనిపించినట్లు బుడాపెస్ట్ అబ్జర్వేటరీ ప్రకటించింది నల్లగా కనిపించిన మచ్చ ఏకకేంద్రవృత్తాలవలె, రింగులు రింగులుగా, పెరిగి కొంతసేపటికి అదృశ్యమైనదని ప్రకటన. చంద్రాకర్షణ బలానికి లోనై గమిస్తూండిన లూనిక్ మహావేగంతో చంద్రతలాన్ని డీకొని ఛిన్నాభిన్నమైయుండాలి ఆ విపరీతవేగాన్ని ప్రతిఘటించి మెల్లగా దిగడానికి లూనిక్‌లో ఏర్పాట్లు చేయలేదు. చంద్రునిలో గాలిలేదు అందుచేత పేరాచూట్లు నిరుపయోగం. చంద్రాకర్షణ బలాన్ని ఎదుర్కో-వాలంటే వెనుకకు మరల్చే రాకెట్ల నుపయోగించాలి అవే రెట్రో రాకెట్లు వాటిని లూనిక్‌లో అమర్చకపోవడం చేత చంద్రతలాన్ని డీకొని రాకెట్ ముక్క-లైపోతుందని విజ్ఞానులు ముందే ఎరుగుదురు.

1959 అక్టోబరు 4న "మూడవ లూనిక్"ని రష్యా ప్రయోగించింది చంద్రుని వెనుక భాగపు ఫొటోగ్రాఫులు తీయడానికై యంత్రాలను దానిలో అమర్చేరు. 613 పౌన్లు బరువుగల అంతర్గ్రహస్థావరంలో రెండు శక్తిమంతమైన ట్రాన్స్మిటర్లనూ, వాటిని పనిచేయించడానికి సౌరశక్తిని రసాయనిక పదార్థాలను విద్యుత్‌గా మార్చే బేటరీలనూ పొందుపరిచేరు. చంద్రునికి 6250 మైళ్ళ దూరంలో ప్రయాణంచేసి, చంద్రునిచుట్టూ తిరిగి భూమివైపు మరలివచ్చేటట్లు దాని కక్ష్యని నిర్ణయించేరు. ఆ స్థావర గమనాన్ని భూతలంనుండి శాసించగలఏర్పాట్లు చేసినట్లు ప్రకటించేరు. దినానికీ రెండునుండి నాలుగు గంటలసేపు ట్రాన్స్మిటర్లు సాంకేతికంగా వివరాలను ప్రసారం చేస్తాయన్నారు, వాటిని భూమినుండే కంట్రోల్ చేస్తున్నారు.

లూనిక్‌ని ప్రయోగించిన రెండురోజులలో చంద్రునికి 4375 మైళ్ళ దూరంనుండి ప్రయాణం చేస్తూ, వెనుదిరిగేసరికి భూమినుండి అది 2,91,400 మైళ్ళదూరాన్న ఉంది. అప్పటి దానివేగం సెకెనుకి 2/5 మైళ్ళు. క్రమంగా వేగం పెరిగింది, 18వ తేదీ రాత్రి మన కాలమానం ప్రకారం 11 గంటలకు భూమిచుట్టూ ఒక ప్రదక్షిణం చేసినట్లు ప్రకటించేరు. చంద్రునిచుట్టు తిరుగుతూన్న సమయంలో మనకు ఎన్నడూ కనిపించని చంద్రుని వెనుక భాగపు ఫొటోగ్రాఫులను తీసింది భూసమీపానికి వచ్చినప్పుడు వాటిని ప్రసారంచేసింది సాంకేతికంగా లభ్యమైన ఫొటోలను విజ్ఞానులు పునర్నిర్మించి ప్రకటించేరు.

భూమిచుట్టూ నిత్యప్రదక్షిణాలు చేస్తూన్న చంద్రుడు తనలోతాను తిరుగుతున్నాడు అమావాస్య నుండి అమావాస్యకు గల కాలవ్యవధి 29 1/2 రోజులు తనలోతను ఒకసారి తిరగడానికి పట్టేకాలం, సూర్యపరంగా, కూడా అంతే. ఆకారణంచేత చంద్రగోళంలో ఒకే ఒక సగం భూమివైపు తిరిగి ఎల్లప్పుడూ ఉంటుంది ఎంత జాగ్రత్తగా పరిశీలించినప్పటికీ చంద్రగోళంలో 3/5 భాగంకంటె భూవాసులకు కనిపించదు. అందుచేత, లూనిక్ తీసిన చంద్రుని ఫొటోలు, తొలిసారిగా, మానవునికి చంద్రుని వెనుకభాగాన్ని దర్శించే అవకాశమిచ్చేయి. అట్టిలూనిక్‌లోని ప్రసారయంత్రాలు ఉల్కాపాతానికి గురియై ధ్వంసమైనట్లుందని రష్యావిజ్ఞానులు ప్రకటించేరు

చంద్రుని డీకొని రెండవలూనిక్ తునియలైపోయేలోపున దానినుండి వెలువడిన సాంకేతిక ధ్వనులు ముఖ్యమైన ప్రకృతి రహస్యాలను వెల్లడిస్తాయని ఆశిస్తున్నారు వాటిలో ముఖ్యమైనది చంద్రుని ఆవరించి అయస్కాంత క్షేత్రముందా లేదా అను ప్రశ్నకు సమాధానం మనభూమి పెద్ద అయస్కాంతమట్లు ప్రవర్తిస్తుందని చిన్నపిల్లకు సైతం బడులలో నేర్పుతారు. స్వేచ్ఛగా వ్రేలాడే అయస్కాంతం ఎల్లప్పుడూ, ఉత్తరదక్షిణ ముఖంగానే ఆగుతుంది ఆ లక్షణాన్నే దిక్సూచి ప్రదర్శించగా దానిని నావికులు సముద్రయానంలో ఉపయోగించు కొంటున్నారు. భూమియొక్క అయస్కాంత బలంవల్ల ఉత్తర దక్షిణ ధ్రువాల వద్ద విద్యుదావేశంగల అణువులు - వాటినే అయనులంటారు- కేంద్రీకరించి 'అరోరాలు' అనే రంగు రంగుల దృశ్యాలను కలిగిస్తాయి. భూగోళానికీ అయస్కాంత క్షేత్రమెట్లు ప్రాప్తించిందో నికరంగా తెలియదు. కాని, భూగర్భంలో చాలాభాగం ద్రవంగాఉందనీ, ఆ ద్రవం భూమితోపాటు ఆత్మప్రదక్షిణం చేస్తూండడంవల్ల భూమికి అయస్కాంతత్వం అలవడిందనీ ఒక వాదముంది. చంద్రగోళం యావత్తూ ఘనమైనదనే అనుకొంటున్నారు. అదే నిజమైతే పైవాదాన్ని అనుసరించి, ఆత్మభ్రమణంవల్ల చంద్రుడు అయస్కాంతత్వాన్ని పొందలేడు. లూనిక్ పంపిన వార్తలవల్ల చంద్రుని ఆవరించి అయస్కాంత క్షేత్రం లేనట్లు తెలియవచ్చింది ఈ విధంగా కొంత నూతన జ్ఞానసేకరణకు కృత్రిమగ్రహాలు సహకరిస్తున్నాయి.

అట్లే, కాస్మిక్ కిరణాలగురించి క్రొత్త విషయాలను సేకరించినట్లు ప్రకటించేరు

కాస్మిక్ కిరణ లక్షణజ్ఞానాన్ని భూమికి తెచ్చిన సంకేతాలను విడమర్చి వాటి యథార్థజ్ఞానాన్ని ప్రకటించడానికి కొంతకాలం పట్టవచ్చును. అంతర్గ్రహయానం వల్ల మాత్రమే లభించవలసిన విజ్ఞానభాగం ఎంత శ్రమించినప్పటికీ పరిశోధనాగారాలలో లభ్యంకాదు. ఖగోళాలనుండి వచ్చేకాంతీ, ఇతర శక్తిమంతమైన తరంగాలూ, మన వాతావరణ వాయువులో జొరబడగానే మార్పు చెందుతూన్న సందర్భంలో అంతరాళంలోనికి పోతేకాని అట్టి తరంగాల యథార్థస్వభావం తెలిసికోలేము. నేల విడిచిన సాము చేస్తేకాని ప్రయోజనంలేదు. అట్టి పరిస్థితిని కల్పించడానికి సహాయపడేవి కృత్రిమ గ్రహాలు.

పు రా ణ ము ల ం దు వ ర్ణిం ప బ డి న

వి ష్ణు వు ఎ వ రు ?

పండిత, శ్రీ గోపదేవ్

ఓం యోదేవేష్వధిదేవ ఏక ఆసీత్
కస్మై దేవాయ హవిషావిధేమ ఋక్.
'దేవతల కధిదేవుడును, సుఖస్వరూపుడునగు
పరమేశ్వరుని భక్తితో భజింతుము'

భారతదేశమున వేదముల యధ్యయ నాధ్యాపనములు వర్గభేదములేక జరిగినంతకాలము జనులకు పరబ్రహ్మ పరమేశ్వరుడే యుపాస్యుడై యుండెను ఆ పరమేశ్వరుడే వేదములందు ఇంద్ర మిత్రాద్య నేకనామములతో పేర్కొనబడెను.

"ఇంద్రం మిత్రం వరుణ మగ్నిమాహురథో
దివ్యః
స సుపర్ణో గరుత్మాన్ ఏకంసద్విప్రాబహుధా
వదం త్యగ్నిం యమంమాతరిశ్వానమాహుః
ఋక్.

"విద్వాంసులొకే సద్రూప పరమేశ్వరుని 'ఇంద్రుడు, మిత్రుడు, వరుణుడు అగ్ని, దివ్యుడు, సుపర్ణుడు, గరుత్మంతుడు, అగ్ని, యముడు, మాతరిశ్వుడు'నని యనేక నామములతో పేర్కొందురు.అని ఋగ్వేదము.ఇట్లే మనుస్మృతియందును వర్ణింపబడుట జూతుము.

"ప్రశాసితారం సర్వేషామణీయాం
సమ'ణోరపి
రుక్మాభం స్వప్నధీగమ్యం విద్యాత్తం
పురుసంపరం"
"ఏతమేకంవద న్త్యగ్నిం మనుమన్యే
ప్రజాపతిమ్
ఇంద్రమేకేఒపరే ప్రాణమపరే బ్రహ్మ
శాశ్వతమ్ మ

బహుకాల మిట్లు పరబ్రహ్మమే భారతీయులకు నుపాస్యముగా నుండెను. కాని. తరువాత వేదముల ప్రచారము సన్నగిల్లినది. ప్రజలు మందమతులైరి. నిరాకారుడైన సచ్చిదానందేశ్వరు నుపాసించుట మాని ప్రాకృతిక పదార్థముల నుపాసింపదొడగిరి. ప్రాకృతికములు జడములునగు వస్తువులలో వింతమైనవానిని పరమేశ్వర స్థానమున నుపాసించుట క్రమముగా పరిపాటి యయ్యెను. విగ్రహములను కల్పించి పలు విధముల వానిం బూజింపనారంభించిరి.

కాలాంతరమున కొందరు సంప్రదాయ విదులీ బహువిధ పదార్థముల నారాధించు ప్రజలను మూడు వర్గములకు జెందునట్లుజేసి మువ్విధములగు మూర్తులను బూజించునట్లు జేయుట కుపక్రమించిరి. అందులకై మూడు మూర్తులను కల్పించుట యావశ్యకమని యెంచిరి. వారి ప్రయత్న ఫలమే బ్రహ్మ, విష్ణు, మహేశ్వర కల్పన. అందు విష్ణువు సూర్యుని స్థానమున కల్పింపబడినమూర్తి. ఇట్లె వాయుస్థానమున బ్రహ్మను, అగ్నిస్థానమున నీశ్వరుని కల్పించి వారి పూజలు దేశమున వ్యాపింపజేసియుండిరి. ఆకాశమున వెలుంగు సూర్యుడెట్లు విష్ణురూపమున పురాణములందు వర్ణితుడై విగ్రహారాధకుల మనస్సు నాకర్షించెనో పాఠకులీ లేఖయందు జదువగలరు.

వి ష్ణు నా మ ము

పూర్వకాలమున సూర్యుడు విష్ణువని పేర్కొనబడెను. విష్ణుపురాణమున వర్ణింపబడిన సూర్యనామములలో విష్ణుపదము వాడబడుట జూడనగును.

"తత్రవిష్ణుశ్చ శక్రశ్చజ జ్ఞాతేపునరేవచ
అర్యమాచైవధాతాచ త్వష్టాపూషా
తథైవచ"
"వివస్వాన్ సవితాచైవ మిత్రోవరుణఏవచ
అంశో భగశ్చాదితిజా ఆదిత్యా ద్వాదశ
స్మృతాః"
వి పు: 15 1-121-122

సూర్యునకుగల ద్వాదశ నా మ ము ల లో నొకటి 'విష్ణువు' అని పైశ్లోకములవలన తెలియుచున్నది. ఇట్లే మహాభారతమునను విష్ణుశబ్దము సూర్యునకై ప్రయోగింపబడుట జూడవచ్చును.

" పర్జన్యశ్చైవ విష్ణుశ్చ ఆదిత్యాద్వాదశ
స్మృతాః"
మ.భా. ఆ.ప 123.66

ఇట్లు పూర్వకాలమున సూర్యుడు విష్ణుపదముచే వ్యవహరింపబడినట్లు స్పష్టమగుచున్నది.

అందువలననే యాకాశము విష్ణుపదమనియు వర్ణింపబడుచున్నది విష్ణుపదమన సూర్యునకు స్థానమని యర్థము, ఆకాశగత సూర్యునకు బదులు విష్ణువును కల్పించి యతనిని బూజించుటలో జనులకు ప్రవృత్తి గల్గించుట యంత సులభము కాదయ్యె దేశమున వేదప్రచార మెంత సన్నగిల్లినను వేదవిహితముకాని కర్తవ్యమును గ్రహించుటకు జనులు సుముఖులు కారైరి అందువలన విష్ణుపూజ వేదచోదితమని చెప్పుట యవసరమయ్యెను. కాగా సూర్యుడే వేదములందును వైదికగ్రంథములందును విష్ణు వనబడినట్లు చెప్పవలసివచ్చెను. వైదిక సాహిత్యమున విష్ణుశబ్దము సూర్యవాచకములలో నొకటిగా జూడనగును. వైదికశబ్దకోశమగు నిరుక్తమునందుగల సూర్యనామములలో విష్ణుశబ్దము గ్రహింపబడియున్నది

"త్వష్టా, సవితా, భాగః, సూర్యః, పూషా విష్ణుః, వైశ్వానరః, వరుణః'. ని. 5 అ 6 ఖం.

ఈ శబ్దములను నిర్వచించుచు యాస్కాచార్యుడు విష్ణువన సూర్యుడనియే చెప్పియున్నాడు. వేదమంత్రములందు ననేక స్థలములలో విష్ణుశబ్దము సూర్యార్థమున బ్రయోగింపబడియున్నది

"ఇరావతీ ధేనుమతీ హి భూతం సూయవసినీ
మనుష్యేదశస్యా
వ్యస్కభ్నారోదసీ విష్ణవేతే దాధర్థ పృథివీ
మభితో మయూఖైః"

"విష్ణో! హేసూర్య!, ఏతేరోదసీ - ఈ భూస్వర్గ లోకములను. వ్యస్కభ్నాః - ధరించియున్నావు మయూఖైః - కిరణములతో, పృథివీం - భూమిని, అభితః - అన్ని వైపులనుండి, దాధర్థ - ఆకర్షించి ధరించుచున్నావు"

ఈమంత్రమునందలి మయూఖశబ్దము విష్ణువు సూర్యుడనుటనుమిక్కిలి స్పష్టముచేయుచున్నది. పై ప్రమాణములనుబట్టి విష్ణుశబ్దము సూర్యవాచకమయినట్లు పాఠకులు గ్రహింపగలరు అందువలననే నాటి విద్వాంసులు సూర్యుని స్థానమున విష్ణువు నొక వ్యక్తిగా కల్పించి జనులతనిని బూజించునట్లు ప్రోత్సహించిరి.

కేవల నామసామ్యముతోనే కాక సూర్యుని గుణములే కల్పిత విష్ణువునందు నున్నట్లు నిరూపించియున్నారు వారి యీ కల్పనానైపుణ్యము కొనియాడదగినదియే. చూడుడు

విష్ణువు వాహనము గరుత్మంతుడు.

సూర్యుని కిరణముల కనేక నామములున్నవి వేదకోశమా నామముల నిట్లు సంగ్రహించినది.

'ఖేదయః కిరణాః, గావః, రశ్మయః, అభీషవః, దీధితయః, గభస్తయః, వనమ్, ఉస్రాః, వసవః, మరీచయః, మయూఖాః, సపర్షయః, సాధ్యాః. సుపర్ణాః,' ఇతి పంచదశ, రశ్మినామాని. 1. 5

ఇందు సుపర్ణశబ్దము సూర్యకిరణములకు వాచకమైనట్లు స్పష్టమగుచున్నది, సుపర్ణుడు లౌకిక భాషలో గరుత్మంతుడుగా వ్యవహరించుట పాఠకులకు తెలియని విషయముకాదు.

వేదమంత్రములలోను నటనట సుపర్ణపదము సూర్యకిరణములకు వాడబడినట్లు చూడవచ్చును.

'వయః సుపర్ణా ఉపసేదురింద్రం
ప్రియమేధా ఋషయోనాథమానాః
అపధ్వాంత మూర్ణుహి, పూర్ధిచక్షుర్
ముముగ్ధ్యస్మాన్ నిధయేవ బద్ధాన్'
ని - 4 2.

'వయః-శీఘ్రగమన శీలములయిన, సుపర్ణాః-కిరణముల ఇంద్రం - సూర్యుని, నాథమానాః - యాచించుచు, ఉపసేదుః - సమీపించెను ఆకిరణములు, ప్రియమేధాః - యజ్ఞప్రియములు, ఋషయః - పదార్థప్రకాశకములు కిరణము సూర్యుని చేరుటలో ప్రయోజనమేమన ధ్వాంతమ్ - చీకటిని, అపఊర్ణుహి-దూరముచేయుడు, చక్షుః - నేత్రమును, పూర్ధి - జ్యోతితోనింపుడు, నిధయఇవబద్ధాన్-పాశమున పక్షులు చిక్కినట్లు మీ మండలమున చిక్కియున్న, అస్మాన్-మమ్ములను, ముముగ్ధి-వదలిపెట్టుము.,

ఈ మంత్రమున సూర్యకిరణముల యునికి, వానిగతి, ప్రయోజనము మున్నగు విషయములు నాలంకారిక భాషలో చక్కగ వర్ణింపబడియున్నది.

ఇట్లు వైదికభాషయందనేక స్థలములలో సుపర్ణ శబ్దము సూర్యకిరణ వాచకముగ ప్రయోగింపబడియున్నది. కాని నేటి లౌకిక సంస్కృత భాషయందు సుపర్ణుడన గరుడుడని యెంచబడుచున్నాడు

'గరుత్మాన్ గరుడస్తార్క్ష్యో వైనతేయః ఖగేశ్వరః నాగాంతకో విష్ణురథఃసుపర్ణః పన్నగాశనః, అమరలోక భాషలో ప్రయుక్తమగు నీ సుపర్ణుడు గరుత్మంతుడు మున్నగు పక్షి వాచకశబ్దములు వేదమున సూర్యకిరణములుగా నున్నవి. అందువలన కల్పకులు గరుత్మంతుడు,-సుపర్ణుడు విష్ణువునకు వాహనమనిరి. సూర్యుడు కిరణముల మూలముననేగదా! లోకమునందు వ్యాపించు

చున్నాడు! అందువలననే వేదములందనేక స్థలములలో సుపర్ణములే - కిరణములే - సూర్యుని వహించుచున్నట్లు - మోయుచున్నట్లు - వర్ణించుట జూడనగును. కాబట్టి, గరుత్మంతుని నామసామ్యము కిరణముల కుండుటచేతను సూర్యస్థానమున విష్ణువును కల్పించిరనుట గట్టిపడుచున్నది.

గరుత్మంతుడు లోకదృష్టిలో పక్షికదా! అయ్యది విష్ణుదేవునకు వాహనమనుట లోకవిరుద్ధముకాదా? కాబట్టి సుపర్ణుని వాహనముగ కల్పింపక మరియొక పదార్థము నేల కల్పింపరైరి? ఈ కల్పనలోగల వైశిష్ట్యమేమి? అను ప్రశ్నలు పాఠకులకు గలుగకపోవు కాని యీ కల్పనలో సౌందర్యము లేకపోలేదు గరుత్మంతుడు లోకమున 'అహి' భక్షకుడు అహి యన లౌకికభాషయందు సర్పమని యర్థము కాని వైదికభాషయందు 'అహి' యనగా మేఘము చూడుడు.

'అద్రిః, గ్రావా, గోత్రః, బలః, అశ్నః, పురభోజాః,అహి, అభ్రమ్,బలాహకః' ఇది.ని.1.10

'అద్రి గ్రావము అహి, అభ్రము ' మున్నగు ముప్పది నామములు మేఘవాచకములని నిరుక్తమున నుల్లేఖింపబడినవి. వేదభాషయందు సుపర్ణుడు సూర్యకిరణముగాను, అహి మేఘముగాను వర్ణింపబడినట్లు తెలిసిన తదుపరి పాఠకులకు కల్పనాసౌందర్యము కొంతవరకు బోధపడియుండవచ్చునని యెంచెద- లోకమున గరుత్మంతుడు అహి (సర్ప) భక్షకుడైనట్లు, వేదమున సుపర్ణుడు అహి (మేఘ) భక్షకుడగుచున్నాడు సూర్యకిరణములు వ్యాపించినకొలది మేఘములు ఛిన్నములై పోవుట లోకవిదితము. అందువలననే సూర్యస్థానమున విష్ణువును గల్పించినవారు విష్ణువాహనముగ సుపర్ణునే కల్పించియుండిరి. ఈ కల్పనలో వైశిష్ట్యము లేదా?

సుపర్ణుడు - అమృత హరణము

ఇంతేకాక సుపర్ణునే విష్ణువాహనముగ కల్పించుటలో మరియొక విశేషముకూడ నున్నది, మహాభారతమున సుపర్ణు డమృతమును హరించి తెచ్చినట్లు వర్ణింపబడుట జూడనగును

"ఇత్యుక్తో గరుడః సర్పైస్తతో మాతర
మబ్రవీత్
గచ్ఛామ్య మృతమాహర్తుం భక్ష్య మిచ్ఛామి
వేదితుమ్.
మ. భా ఆదిప

సుపర్ణుని మాతయగు వినత కారణవశమున సర్పమాతయైన కద్రువకు దాసి యయ్యెను. తరువాత కొంతకాలమునకు అమృతమును దెచ్చి కద్రుపతనయులగు నాగుల కియ్యనంతవరకు తనతల్లి దాస్యమునుండి విముక్తి నొందజాలదని సుపర్ణుడు తెలిసికొనెను అందువలన నతడనేక కష్టములకోర్చి యమృతము నాహరింపవలసి వచ్చెను. ఈ కథ యంతయు సౌవర్ణాఖ్యామను పేర మహాభారతమున నాది పర్వమునందు పది పండ్రెండు (20-32) అధ్యాయములలో వర్ణింపబడియున్నది. ఈకథకు మూలము సూర్యకిరణములే (సుపర్ణములే) యని పాఠకు లూహింపగలరని యెంచెద

'పయః కీలాలమమృతమ్ జీవనం భువనం వనమ్'అని యమరకోశమున జలమునకు అమృతమను పేరును గలదు సుపర్ణుడన సూర్యకిరణము అమృతమనజలము సుపర్ణుడు అమృతమును హరించెనన సూర్యకిరణములు జలముల హరించెనని యర్థము కిరణములలో జలము నావిరిగా మార్చి యాకసమున నాకర్షించు శక్తి కలదని యెల్ల రెరిగినదియేకదా! మేఘమును 'అహి' యందురనియు నిదివరకే చెప్పియున్నాను కాబట్టి సుపర్ణుడు (కిరణము)అమృతమును (జలమును) హరించి మేఘమునకు (అహికి) ఇచ్చెను. ఈ ప్రాకృతిక సంఘటనమే సుపర్ణామృత హరణ గాథకు మూలమని యిప్పుడు వేరుగజెప్పనక్కరలేదు వేదములందు ఆలంకారికా భాషలో వర్ణింపబడిన యనేక వైజ్ఞానిక సంఘటనములే నేటి పురాణములలో పెద్ద గాథలుగా మనకు కనిపించుచున్నవి ఉపర్యుక్త సుపర్ణాఖ్యానమున కనుగుణమగు వేదమంత్రము నిట పొందుపరుచుచున్నాడ, చూడుడు.

"యత్రా సుపర్ణా అమృతస్య భాగమనిమేషం
విదథాభి స్వరన్తి
ఇనోవిశ్వస్య భువనస్యగోపాః. సమాధీరః
పాక మత్రావివేశ ఋక్

యాస్కాచార్యుడీ ఋగ్వేదమంత్రమును నిరుక్తమున నిట్లు నిర్వచించియున్నాడు

యత్ర - ఏసూర్య మండలమునయున్న,
సుపర్ణాః

ఏకిరణములు, అనిమేషం - ఎల్లప్పుడును, విదథా-తమ కర్తవ్యముతో కూడియున్నవో,అవి అమృతస్యభాగం - జలాంశమును గ్రహించుచు. అభిస్వరంతి - పదార్థములను తపింపజేయు

చున్నవి. సూర్యకిరణముల మూలమున భూమి యందుండు జలము శోషింపజేయబడినపుడు జడచే తనపదార్థము లన్నియు తపింపబడుట యుక్తమని భావము.

ఇనః- ఐశ్వర్యయుక్తుడును, విశ్వస్యభువనస్య గోపాః - సమస్త ప్రపంచ రక్షకుడును, ధీరః- బుద్ధినిచ్చువాడును, పాకః-వస్తువులు పక్వమగుటకు హేతుభూతుడును, నగు, సః-ఆసూర్యుడు అత్ర - ఇట, మా - నన్ను, ఆవివేశ-అంతటను నావరించియున్నాడు. అనగా సూర్యునివలన నెల్లరకు ప్రకాశము లభించుచున్నదని భావము

ఈ మంత్రమునందలి యర్థమును తెలిసికొనిన మీదట వేదములో ప్రాకృతిక విజ్ఞానమెట్లు వర్ణింపబడినదియు స్పష్టము కాగలదు. ఇట్టి వైజ్ఞానిక విషయములను గొని వానిని వివరించి లోకమున విజ్ఞానవ్యాప్తికై పాటుబడుట మాని విద్వాంసులు కొందఱు వానిని మనసుననుంచుకొని పాత్రలను గల్పించి చిత్రవిచిత్రములైన గాథల నల్లియున్నారు. మన సుపర్ణాఖ్యానముకూడ నట్టిదియే అయ్యది మహాభారతమునజేరి నేడు తెలియనివారిచే చరిత్రాంశముగా నెంచబడుచున్నది ఇట్లే విష్ణువునకు సంబంధించిన కల్పన లింకను నెన్నియో యున్నవి. రాబోవు సంచికలో విష్ణువు సముద్రశయనమును గూర్చి పాఠకులు చదువ గలరు.

మనవి

రచయితలు, చిత్రకారులు, తమతమ రచనలను చిత్రములను ప్రతినెల 10 వ తేదీ లోపుగా కార్యాలయమునకు చేరునట్లు పంపవలెను. ప్రచురించని రచనలు, చిత్రాలు త్రిప్పిపంపగోరువారు, వారిరచనలతో, చిత్రాలతో కావలసిన తపాలా బిళ్ళలు పంపవలెను.

సంపాదకులు : *నవభారతి*

కవి - బడిపంతులు

శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి, బి ఎ. బి ఇడి.

కవి:

చాలీచాలని జీతబత్తెములతో సంసార భారమ్ము నే
దోలాగీడ్చుచు తీరికైన క్షణమెందుం గానగాలేని వి
ద్యాలక్ష్యమ్ముల క్రొత్త పోకడలకున్ దాసుండవై దీనతన్
కాలక్షేపము చేయు పంతులవు; నీకై జాలినిండన్ మదిన్.

బడిపంతులు:

నాకయి జాలియేల మన నాయకులెల్ల రుపన్యసించు వా
రేకద! ఉత్తమంబయిన దీ బడిపంతులు వృత్తియంచు, పెం
జీకటివంటి అజ్ఞత నశింపగజేయు వెలుంగటంచు, లో
కైక పవిత్రమంచు, ధనగర్వము సుంతయు లేనిదంచునున్.

ఒకనాడు నావద్ద ఓనమాల్ దిద్దుచు
నాటపాటలు నేర్చె నేటిమంత్రి
ఒకనాడు నావద్ద ప్రకృతి చిత్రమ్ముల
చవిజూచె నీనాటి శాస్త్రవేత్త
ఒకనాడు నావద్ద ఒక్కొక్క కథ చెప్పి
మాటతీరను నేర్చె నేటి వక్త
ఒకనాడు నావద్ద ఉత్సాహియై అభ్య
సించె లెక్కలు నేటి "యింజినీరు"

వివిధ రంగాల చేరి జీవించుచున్న
నేటి పౌరుడు నావద్ద నేర్చె మున్ను
దేశసౌభాగ్యమును తీర్చి దిద్దు వంతు
నాది కద, యేమికోర్కె మానవునికింక?

అత్యున్నతంబైన అటకమీదికి పోవ
చేయూత నొసగు నిశ్రేణి పోలె
పనికిరానట్టి మట్టిని దెచ్చి వివిధ పా
త్రలను సృష్టించు కులాలు భంగి
ఒక ఒడ్డునుండి వేరొక యొడ్డునకు ప్రయా
ణస్థుల గొనిపోవు నావ భంగి
ఉచిత సంరక్షణ మొనరించి సొగసౌ సు
మమ్ములిచ్చెడు తోటమాలి కరణి

బాల బాలికలను లేత వయసునందు
చేరదీసి లాలించి కష్టించి దేశ
గౌరవము నిల్పు పౌరులుగాగ దిద్ది
త్యాగధన్యత గను జీవితంబు నాది.

క వి :

నీ వాక్యమ్ములు సత్యమే యగును కా
నీ నేటి సంఘంబు నీ
సేవా మూల్యము త్యాగశీలమును కిం
చిత్తైన గుర్తించెనా?
జీవింపన్ సరిపోవు జీతమయినన్
చేకూర్చెనా? నీ పయిన్
భావంబందొక యింత జాలి పడెనా?
స్వార్థ ప్రపంచమ్మునన్,

*

నాన్యః పంథా...

శ్రీ "లసూనా"

ఒకవంక గగనాగ్ర మొగిదాకు సౌధమ్ము
      లొకవంక తరుమూల మొక నివాస
మొకవంక మృష్టాన్న మొలికించు పులిత్రేపు
      లొకవంక తనియార వొకనిప్రేపు
లొకవంకనను మారణోద్యోగ విన్నాణ
      మొకవంక నాంగుళ్య మొనరముద్ర
ఒకవంక రణభేరు లొనరించు నినదమ్ము
      లొకవంక శాంతి గీతోదయమ్ము

లొకటి కెదురుగా నొకటియు వికటమౌట నకట! బెదరక నొకటియె యొకటి మాట
తెలుపదలచిన తలపుల వలపుటలత నలువ పలుకులచెవి కలఁగెలికె తులువ!

చనిపోయె నెన్నడో సామ్రాజ్య తత్త్వమ్ము
      లినబింబమును గాంచ నిరులమాడ్కి
జనియించె ధరపైని జన సామ్యవాదమ్ము
      లెనలేని పడిగింజ లెదుగుపోల్కి
కరుడుగట్టినచోట గాంధేయ సిద్ధాంత
      మరయంగ నంధున కద్దమట్లు
కరత లామలకంబు "కమ్యూనిజం" బెందు
      కసిదీర మసిబూయు కథనమట్లు

వెతుకలేకను, వాదమ్ము లతుకరాక నెదన కుదురుగ నరయంగ నెదియొతోచె;
మనసు మనసును ప్రేమించు మానవత్వ మనఘ! వాదము నాదమ్మునగునుగాత?

అణు మర్మములవేట నర్ధాంశ ముడిగిన
      నన్నార్తు లెటనంచు నరయవలయు
హంసతూలికలంద నత్యాస లడగిన
      నర్ధనిగ్న శరీరు నరయవలయు
విజ్ఞానవారాశి పీసమందిన జాలు
      నజ్ఞాన మెటనంచు నరయవలయు
ఈసుదోసమటంచు నిసుమంత విడనాడఁ
      అరులెవ్వరని నేల నరయవలయు

వదలకున్నను, వదలించ కదలకున్న, నదనుదప్పిన, నెదనుంచి ముదములన్ని
చెదరి బెదరగ నదలించు నెదియొగోల, యెదర పదరక విదలించు టదియె మేలు!

విశ్వకళ

శ్రీ కల్లూరి చంద్రమౌళి

భగవంతుడు సృష్టికర్త. సర్వలోకములను తననుండియే సృష్టించెను. మనము గాంచు యీ స్థూల జగత్తునకును- విశ్వమునకును కర్త భగవంతుడే గదా! కాబట్టి, సృష్టియన 'సత్తు'నుండి వ్యక్తమైనదే గాని, 'అసత్తు' నుండి అగష్మాత్తుగ- సత్తుగ- పుట్టి వచ్చుట మాత్రముగాదు భగవంతుడు స్వయంభువు తననుండి సర్వసృష్టిని గావించి అందు తాను గుప్తముగ లీనమై, తనసృష్టియగు విశ్వమును కళావంతముగ, నావిష్కరించెను చిత్రముగ రచనమొనర్చెను తన సృష్టి నీవిధముగ ప్రకటన మొనర్చెను మనము గాంచు యీ విశ్వమొక మహాకళ. ఈ మహాకళనుండియే సర్వకళలును యుద్భవిల్లుచున్నవి. కావున నిది సర్వకళలకును మాతృకగ- మూలముగ- వెలుగొందును, ఇందుండియే సర్వకళలును తమ యనుభూతిని బడసి ప్రకాశించును. కాబట్టి విశ్వకళ సర్వకళలకు మాతగ, తదతీతముగ, సర్వలక్షణ సంపన్నముగ, శోభాయమానముగ, సుందరముగ వెలుగొందుచున్నది

కళకు ప్రధానలక్షణము సృజనశక్తి అది యనుకరణముగాదు. కృత్రిమ కృతమును గాదు అది అనుకరణమునకు మూలముగ నుండి తన సహజ, సరళ కాంతితో సదా విరాజిల్లుచుండును దానికదియే మూలము, బీజము ఇది సృష్టికర్తయగు కళాకారుని సత్సంకల్ప- ప్రతిభాజనిత- మధుర ఫలము. నకలుగనున్న కళ, కృత్రిమము గు కళ విద్వజ్ఞుల నాకర్షింపజాలదు. విశ్వమను మహాకళ, సృష్టికర్తయగు భగవంతుని సంకల్పఫలితము గావున దానికి తుల్యమగు మరియొకదానిని గాంచజాలము దానికదియే సాటి. అన్యములు దాని ననుకరింపవలసినదే! దానికి నిమ్నస్థితి యందుండవలసినదే! సత్తునకే- అసలు తత్త్వమునకే పూర్ణవికాసముండును. దీని మూసయందే తదితరములు తమ యునికిని గలిగియుండును

చైతన్యవంతముగ- సజీవముగ- వెలుగొందుటయే కళయందలి ద్వితీయ విలక్షణము కళాకారుడు పరిపూర్ణముగ ప్రాణప్రతిష్ఠను గావించును శవాకారనుగ- మాంద్యముగ- తామసికముగ నుండునది కళ గాజాలదు ప్రాణములేని శరీరమునెంత శోభాయమానముగ నలంకరించినను, నది, కళాప్రియుల నాకర్షింపజాలదు ప్రజలమన్ననలకు పాత్రము గాజాలదు. ఒక చిత్రమును రచించుటకు కాగితమును, కుంచెను, రంగులను వినియోగించుచో, నది కళగనుండి తన ప్రయోజనమును ప్రసాదింపజాలదు వాస్తవమగు కళ కేవలము చిత్రములను గీయుటలోగాని, పాత్రలను ప్రదర్శించుటలోగాని, రంగులను బూయుటలోగాని లేదు. కళయందు చైతన్యముట్టిపడవలెను, అప్పుడది యథార్థమగు కళగ విరాజిల్లును. ఇందు కళాకారుని యుజ్జ్వలమూర్తిత్వము స్ఫటికమువలె నిర్మలముగ ప్రకటనమై దేదీప్యమానముగ ప్రదీపించును.

మహర్షి వాల్మీకి విరచిత రామాయణమునందలి పాత్రలు, మన పవిత్రదేవాలయములందలి శిల్పములు, కేవలము యూహానిర్మిత పాత్రలుగను, చిత్రవిచిత్రములగు బొమ్మలుగనుగాక చైతన్యవంతములుగ, సజీవములుగ తమ ప్రతిభా ప్రభావములను మనయందు ప్రసరింపజేసి తన్మయులను గావించును కావున కళ ప్రాణప్రతిష్ఠితమై చైతన్యవంతమగు తన యుజ్జ్వలశక్తివంకకు మనల నాకర్షించుచు ముగ్ధులనొనర్చును. కాబట్టి విశ్వము పరిపూర్ణమగు చైతన్యముతో ప్రాణశక్తితో- తన ప్రతిభా ప్రదర్శనమును ప్రకటనమును గావించును ఈ చైతన్యశక్తియే ప్రకృతిని నియమబద్ధమొనర్చి అందు

గల భిన్నశక్తులను తమతమ ధర్మములను క్రమవిధానమున సదాసమాచరింపజేయును ఇదియే ప్రకృతియందలి ఋతము ఈ కారణముచేతనే 'సృష్టి భగవంతుని సంకల్పము' అను భావమును మఱపించి మనవలెనే వాస్తవము, యథార్థము అను విషయముగ వెలుగొందజేయును. కళాకారుని ప్రతిభావిజయము యందే నిత్యనూతనముగ నాట్యమాడుచుండును.

కళయందలి తృతీయ విలక్షణము సౌందర్యము. సౌందర్యములేనిచో కళ, కళగానేరదు కళ సర్వాంగ సుందరముగ తళుకు బెళుకులతో, దివ్యమగు నిత్యనూతన శోభతో వెలుగొందుచు మనోహ్లాదముగ, హృదయాకర్షముగ మనలను తద్వశులను గావించుకొనుచుండును. కళ సుందర, సుకుమార, లావణ్యవతియగు కన్యవలె మన ప్రేమమునకు పాత్రమై, మనలను తన సౌందర్య ప్రతిభచే వశులను గావించుకొని తదధీన మొనర్చుకొనును. వాస్తవమగు కళ హృజ్జన్యము అది హృదయముతో పెనవైచుకొని పవిత్రవంతముగ, దివ్యముగ ప్రకాశించు సౌందర్యమును నుట్టిపడజేయును కళకు స్పర్శ- సన్నికర్షణము నిర్మల రక్త ప్రవాహము వంటిది

దివ్యానుభూతిని దీపింపని కళాకారుని సృష్టి, వికారవంతముగ, అపహ్యాముగ నుండి చీదరించుకొనబడును. కళకు సౌందర్యమును జేకూర్చునది దివ్యానుభూతియే! కళ యందలి అంతఃకరణ దృక్పథమిదియే. బాహ్యమున కెంత సాధనసంపత్తి నందించినను, అంతఃశుద్ధి, అంతః సౌందర్యములేనిచో కళ వెలతెలలాడుచుండును సృష్టి వైచిత్ర్యము భిన్నత్వము. చిత్రమునకు సౌందర్యమును జేకూర్చునవి భిన్నవర్ణములు, సంగీతమునకు భిన్నరాగములు మాధుర్యము నందించును ఆకర్షణ, వికర్షణ, సంఘర్షణములందు చిక్కులను, కష్టములను ధీరోదాత్తముగ నెదుర్కొని వాని కతీతముగ జీవితములను బ్రదర్శించుట యందే నాటకము నందలి పాత్రలు రక్తికట్టును, సౌందర్యమును బ్రదర్శింపజేయును ఇట్లే భగవంతుని సృష్టియగు విశ్వకళ యందునను దివ్యానుభూతి, ఆకర్షణము, సౌందర్యము, చైతన్యము తొణికిసలాడుచుండును. జనన మరణములు, చీకటివెలుగులు, కలిమిలేములు, హాసవిషాదములు మున్నగునవన్నియును కలసి మెలసి సంభావ్యములగుచుండును సామరస్యమును సమకూర్చుచుండును రస స్విన్నములుగ రాజిల్లుచుండును.

కళయందలి చతుర్థ విలక్షణము వ్యఞ్జత, ధ్వని కళయందలి సర్వవిలక్షణములును వ్యంగ్యముగ స్ఫురించును గాని, విస్పష్టముగ, ప్రత్యక్షములుగ ప్రకటనములుగావు. అవి సూచించునుగాని వివరింపవు. నగ్నప్రకటనమునందు ఉత్సాహముగాని, ఆనందముగాని యుండవు వ్యంగ్యత తళుకు బెళుకులతో 'అట్టె మెరిసి యిట్టె అంతరించి' ఆశ్చర్యముగ మనలను తనవంకకు మరల్చుకొనుచు సమ్మోహపరచునదిగ నుండును అది మనల నగాధమగు యూహాలలోనికి గొంపోవును విపులముగ ప్రకటనముగాక, స్వల్పముగ వ్యక్తమగుచు మనలను తనపంక కాకర్షించుచూ, ఊహాగానములలో, ఆలోచనా పరంపరలలో ముంచివైచును, సర్వమును వ్యక్తమై ప్రత్యక్షముగ గాంచు వస్తువునందు ఆకర్షణము, ఆశ్చర్యము, ఆవిష్కరింపబడక సమసిపోవును. 'అజ్ఞేయమునుండి జ్ఞేయము మాత్రమే కళకు శోభనందించును విశ్వమునందుగల సర్వమును మన యెఱుకకురాదు. ఎరుకను విశాలమొనర్చి మనల నానందింపజేయునది ఊహాప్రాబల్యము ఉన్నతోత్తమును, ఉత్తమోత్తమమునగు ఊహయే ప్రతిభను ప్రభావంత మొనర్చును.

సౌందర్యమునకు మూర్తియగు శిల్పముగాని, చిత్రముగాని సామాన్యుల కెఱుకబడదు సామాన్యప్రజలకు, విశ్వము వికార

ముగనో, కష్టముల కాలవాలముగనో తఱచు దోచుచుండును. ఇక ఋషులకో! సర్వమును స్పష్టముగ గన్పించుచు అనుభూతిని, ఆనందమును అందించుచుండును. ఆధ్యాత్మిక తేజోమూర్తులగు ఋషులకే, సంస్కృతి సంపన్నులగు మహాత్ములకే విశ్వము సుఖదాయకము, శాంతిదాయకము. సామాన్యులకు సదా సంకటమయముగ నుండును.

విశ్వకళయందు మఱియొక ప్రత్యేక విలక్షణముగలదు అది సర్వలౌకిక కళలను సమీకరించి, సమన్వయ మొనర్చి యొక ప్రత్యేక విలక్షణముతో నుద్దీపించుచుండును. సప్తవర్ణములు సమ్మిళితములై శ్వేతవర్ణముగ వెలుగొందు రీతిని, సర్వకళల సమన్వయమును, నూతనశోభతో దివ్యకాంతులను విడంబించుచుండును. ఆకసమునగల మేఘసంతతులు, భూతలమునగల నదీ పర్వతాదులు, చిత్ర విచిత్రములుగా, రచియింపబడుటను మనము గాంతుముగదా! పక్షిసంతతుల-అందునను కోయిల మధురగానాలాపములను విని ఆనందామృతము ననుభవింతుము. జీవిత నాటకరంగమున బ్రకటితములగు సుఖదుఃఖతరంగములలో మునిగి తేలుదుము. ప్రేమములో కవితాలాలనము, జీవిత తరంగములు వెలువరించు నృత్యనాట్యములు, తత్త్వశాస్త్రమునందలి యూహా ప్రతిభలు - వీనిని సదా ప్రతీక్షించుచుందుము ప్రతికళయు విశ్వకళయందు తనమూర్తి ప్రతినిధిని - తన మూలమును గాంచి తన్ను తీర్చి దిద్దుకొనును తన నిజస్వరూపమును దీప్తివంతమగు ప్రత్యేక విలక్షణముతో ప్రకటించుకొనును. ఏలనన, విశ్వమే యొక విశ్వకళ. అది సమష్టికళ

విశ్వకళయందలి యింకొక విలక్షణము ఆనందము. అది యొక భౌతిక వస్తులాభమునో, తాత్కాలిక సుఖానుభవమునో జేకూర్చునదిగగాక నిత్యానందము ననుభవింపజేయును సౌందర్యమే యానందము గదా! కళసుందరము, ఆనందమయము; అలౌకికము, కళ ప్రదర్శించు దుఃఖములు, కష్ట పరంపరలు ఆనందతరంగములే. కష్టసుఖములయందు, ఆకర్షణ వికర్షణముల యందు ప్రేమద్వేషములయందు, సర్వద్వంద్వములయందునను, సమత్వమును సముపాదించి వాని కతీతముగ వెలుగొందు దివ్యకాంతిని, సౌందర్యమును, ఆనందమును, విశ్వకళ యుద్దీపింపజేయును ఇది యిట్లు సర్వకళలకును మాతగ వెలుగొందుచుండును

సాహిత్యము. సంగీతము, శిల్పము మున్నగు లలితకళలు ఆధ్యాత్మికమువంకకు అనగా భగవదనుభూతిని బ్రసాదించుటకు సహకరించు పరమసాధనములుగ నుండనగును అవి భగవంతున కభిముఖములుగ నున్నంతదనుకనే సార్థకములై నిత్య శోభాయమానములుగ వెలుగొందును తాత్కాలిక ఆవేశమును, హాసమును జనింపజేయునవి యథార్థములగు కళలు గాజాలవు బాహ్యమునుండి అంతఃకరణమునకు, అంతఃప్రకృతినుండి తదతీతమగు యుద్దీపనకు గొంపోవుననియే నిజమగు లలితకళలు,అవి దివ్యతేజోమయములు. మానవుని మానసిక ఏకాగ్రతను, హృదయ పావిత్ర్యమును జేకూర్చి సత్యమును సదా అనుభవింపజేయును.

వాల్మీకి రామాయణమునందుగల పాత్రపోషణమును గాంచుడు. అది ఆయా పాత్రలతో పాఠకులను లీన మొనర్చును, అందుముగులను గావించును అవి బ్రకటించు భావములతో, వెలువరించు ఆవేశములతో, అది యిది యననేల - అవి గావించు సర్వచర్యలయందునను మనలను తాదాత్మ్యల గావించును అందునను, త్యాగమూర్తులు, ధర్మనిరతులు, సహనముతో సకలబాధలను భరించు నిండు హృదయులునగు సీతారాములనడవడి, ఆ దంపతుల సంయోగ వియోగములయందు, సుఖదుఃఖానుభవముల యందు మనలను విలీనమొనర్చి, వారి యనుభవములను మనచే ననుభవింపజేయును వారు

దుఃఖించిన మనమును దుఃఖింతుము, నవ్విన నవ్వుదుము. కాబట్టి ప్రతికళయును కళాకారుని ఊహా ప్రతిఫలనుండి యుత్పన్నమగు ఫలము, విశ్వకళయును,భగవంతుని సంకల్ప ఫలతమగు మధురఫలమే గదా?

సర్వ విశ్వమును, భగవంతుని లలితకళగ సంకల్పముగ గాంచినదే తడవుగ కళయందలి సత్యము యథాతథముగ దృగ్గోచరమగును. కొబట్టి యీ విశ్వమునకు - అది ప్రకటన మొనర్చు ద్వంద్వములకు మనము వశులముగాక సర్వమును సమదృష్టితో గాంచుచు, తదతీతముగ మన జీవితములను నిర్వహించుచు,దివ్యతేజమునందు తాదాత్మ్యము నొందినపుడే, విశ్వముయొక్క నిజతత్త్వమును, మన జీవితతరంగముల వాస్తవికతను నెరుకకు దెచ్చుకొని యమందానంద సాగరమున నోలలాడుదుము. కాబట్టి భగవంతుడు 'సత్యము శివము, సుందరము' నిత్యానందానుభూతి యందించు సత్యమును నిదియే దీనినే 'సచ్చిదానందము' అని మన మహర్షులు గీర్తించిరి.

*

ఉపనిషద్వాక్యములు

శ్రీ ధూళిపాళ రామచంద్రశాస్త్రి

మూ॥ సహనౌయశః। సహనౌబ్రహ్మవర్చసమ్.

సాంహిత్యుపనిషత్తుయందు ఇదివరకు రెండవ అనువాకమునందు దృష్ట్యాఽదృష్టోపకారియగు గ్రంథ పాఠనియమము చెప్పబడినది. ఇక మూడవ అనువాకము ప్రారంభింపబడుచున్నది. ఈ యనువాకమున ఐహికాముష్మిక ఫలసిద్ధికి యుపయుక్తమగు ఒకానొక ఉపాసనాప్రకారము విధింపబడుచున్నది. ఇందు విధీయమానమగుఉపాసనకుసాఫల్యసిద్ధికొరకు, ముందు మంగళాచరణార్థమగు నీ మంత్రము ప్రవర్తించినది. పూర్వము శాంతిమంత్రముచే విఘ్నోపశాంతి ప్రార్థింపబడినది కావున ఈ మంత్రముచే విద్యా, తత్ఫలములకు అతిశయము ప్రార్థింపబడుచున్నది.

ప్రతిపదార్థము- యశః - విద్యానిమిత్తమగు కీర్తి,నౌ-శిష్యాచార్యులమగు మా కిద్దరికిని-సహ సహితమైనదై విశిష్టమైనదై అస్తు-ఉండుగాక ఇచట ఉపాసనము బాగుగా ఆచరింపబడుచున్నదను కీర్తి శిష్యునికిని, బాగుగ ఉపదేశింపబడినదను కీర్తి ఆచార్యునికిని అభిప్రేతమైనది. ఇందువలన విద్యయందు వైకల్యారాహిత్యమగు అతిశయము అభిహితమైనది.

పైన వేర్కొనబడిన రెండవవాక్యమున కర్థము - బ్రహ్మవర్చసమ్ - బ్రాహ్మణునికి ఉచితమగు శృతాధ్యయన లక్షణమగు తేజస్సు నౌ - శిష్యాచార్యులమగు మా కిద్దరికిని. సహ - సహితమైనదై (విశిష్టమైనదై) అస్తు - ఉండుగాక.

ఈవాక్యము."సంధీయతే ప్రజయాపశుభిః। బ్రహ్మవర్చసేనాన్నాద్యేన సువర్గ్యేణులోకేన।" అను రీతిని చెప్పబోవు ఫలముల కన్నిటికిని ఉపలక్షకమగు చున్నది.

ఇచట విచారణీయమగు విషయము ఏమనగా - కీర్తి. బ్రహ్మవర్చసము. మున్నగు ఫలముల శిష్యునికే కామనావిషయములు గాని, ఆచార్యుని మనోరథ విషయములు గానందున ఈ ఫలములు శిష్యాచార్యుల కిద్దరికిని సంబంధించినట్లు ప్రతిపాదించుచున్న శృతి తాత్పర్య మేమనగా శిష్యునికి సంబందించిన ఫలసంపద ఆచార్యునికి పరితోషకారణ మగుటంబట్టి ఆచార్యునికిగూడ ఈ ఫలసంబంధము ఉపచరించబడుచున్నదని భావము.

గనుక, ప్రార్థనారూపము, మంగళాచరణార్థమునగు నీ మంత్రము శిష్యునికే జప్యమైయున్నది.

ఆచార్యుడు కృతకృత్యుడగుటచే అతనికి గూడ జప్యమనుటలో ఉపపత్తి కానరాదు.

మూ॥ అథాతస్సగ్ంహితాయా ఉపనిషదం వ్యాఖ్యాస్యామిః"

పూర్వోక్తమగు మంగళాచరణము ఏ విద్య నుద్దేశించి ప్రవర్తించినదో ఆ విద్యను, ముందు చెప్పగలమని, ఈ వాక్యముచే ప్రతిజ్ఞాతమగుచున్నది.

అథ - పూర్వానువాకమందు విహితమైన వర్ణస్వరాద్యుచ్చారణాభ్యాసమున కనంతరమున.

అతః - ఉచ్చారణ సంస్కారయుక్తుడగుటవలన సంహితాయా ఉపనిషదమ్ - సంహితా సంబంధమగు ఉపాసనను. వ్యాఖ్యాస్యామః - స్పష్టముగ సంపూర్ణమగు రీతిని చెప్పగలము.

ఇచట సంహితయనగా వర్ణముల కన్యోన్యము, పరమగు సామీప్యము- ఈ విషయము "పరస్సన్నికర్షః సంహితా" అని పాణిన్యాచార్యులవారిచే సూచింపబడినది.

ఉపసామీప్యే నిషణ్ణం ప్రజా పశుబ్రహ్మవర్చసాదిఫలం అస్యామిత్యుపనిషత్. అను వ్యుత్పత్తిచే ఉపనిషచ్ఛబ్దము ఉపాసనాపరము.

గనుక సంహితాసంబంధమగు ఉపాసనను చెప్పగలమని, ఈవాక్యమునకు తాత్పర్యార్థము.

సామాన్యములను గూర్చిన జ్ఞానము

బెర్ట్రండ్ రసెల్

అనువాదం : జి. ఎస్. ఎన్.

౧౦

ఒక నిర్దిష్టకాలములో మనుష్యునకు గలుగు జ్ఞానమునకు సంబంధించినంతవఱకు, సామాన్యములను (Universals) విశేషములను (Particulars) వలెనే మూడు తెగలుగ విభజింపవచ్చును అందు ప్రత్యక్షానుభవముచే తెలియనగు సామాన్యములు మొదటి తెగకు సంబంధించినవి రెండవతెగకు జెందిన సామాన్యములు పరోక్షానుభవముచే జ్ఞాతమగునవి. ఇవిగాక, ప్రత్యక్షానుభవముచేగాని పరోక్షానుభవముచేగాని జ్ఞాతమగుటకువీలులేని సామాన్యములు వేఱొకతెగకు జెందును

అందు ప్రత్యక్షానుభవముచే జ్ఞాతములగు సామాన్యములకు సంబంధించినజ్ఞానమునుగూర్చి విచారణ సల్పుదము సామాన్యములనగనే. మనకు, తెల్లని, ఎఱ్ఱని, నల్లని, తీయని, బిగ్గఱ, గట్టి, అను సామాన్యములు - అనగా నింద్రియములవలన మనకు గలుగు ననుభవముద్వారా దృష్టాంతీకృతములైన కొన్ని గుణములు స్ఫురించును మనమొక తెల్లని వస్తువును జూచునపుడు, మొట్టమొదట నా వస్తురూపమునకు సంబంధించిన జ్ఞానము మనకు గలుగును. కాని యట్టి తెల్లని వస్తువు లనేకములను జూచినమీదట వానికన్నింటికిని సర్వసాధారణమై యొప్పు తెల్లదనమును సులభముగా వేఱుచేసి తెలిసికొనుట నేర్చుకొందుము. దీనినిబట్టి తెల్లదన మననేమో మనము గ్రహింపగల్గుచున్నాము ఇట్టి సామాన్యముల నింద్రియ గ్రాహ్యగుణములని వ్యవహరింపనగుమ ఇతర సామాన్యములకంటె వీనిని సులభముగా వేఱుచేసి గ్రహించుటకు వీలుగలదు తదితర సామాన్యములకంటె నివియే విశేషములనుండి తక్కువ వేఱుసేయబడినట్లు కన్పట్టును.

తరువాత సంబంధములనుగూర్చి విచారింతము. వానిలో, ఒకానొక సంకీర్ణమగు నింద్రియార్థమునకు సంబంధించిన వేర్వేరు భాగముల నడుమగల సంబంధములను గ్రహింపగల్గుట చాల సులభము ఉదాహరణమునకు, నేను వ్రాయుచున్న పుస్తకములోని పేజీ నొక్క చూపులో గోచరింప జేసికొనగలను అనగా పేజీయంతయు నొక్క యింద్రియార్థములో నంతర్భూతమగును. కాని పేజీలో కొన్ని భాగములు తదితర భాగములకు నెడమగా నుండుటయు, కొన్ని తదితర భాగములకు పైగా నుండుటయును తెలిసికొనగల్గుచున్నాము ఈ సందర్భమున వేఱుచేయువిధాన మీక్రింది విధముగా నున్నట్లు కన్పట్టును. ఒక భాగము వేఱొకభాగమునకు నెడమగా నుండు నింద్రియార్థముల నెన్నింటినో నేననుభవమునకు తెచ్చుకొనుచున్నాను తెల్లని వస్తువుల విషయములోవలెనే, యీ యింద్రియార్థముల కన్నింటికిని సర్వసాధారణమై యొప్పు లక్షణ మొకానొకటి గలదనియును, అది యేపేజీవలన మనకు ననుభూతమగు నింద్రియార్థముల వేర్వేరు భాగముల నడుమ, ఎడమవైపుకు ఉండుట యనుసంబంధమనియును నేను గ్రహింపగల్గుదును. ఈ విధముగా సామాన్య సంబంధమును గూర్చిన జ్ఞానము నాకు గల్గుచున్నది

అదేవిధముగా, కాలగతమగు పూర్వాపర సంబంధములను గూర్చిన జ్ఞానముగూడా నాకు గలుగుచున్నది. ఘంటలసవ్వడి యవిచ్ఛిన్నముగా కొంతసేపు నాకు వినవచ్చెననుకొందము చివరిసవ్వడి మ్రోగునపుడు, అది నా మనస్సున శబ్దించుచునే యుండును. అంతకుపూర్వము వినవచ్చిన సవ్వడులు శ్రవణగోచర మగును నేనిప్పుడు జ్ఞాపక ముంచుకొనుచున్న సవ్వడులు ప్రస్తుతకాలమునకు పూర్వము వినవచ్చిన సవ్వడులని స్మృతి ప్రమాణముచే నేను తెలిసికొనగల్గుచున్నాను ఎడమగా నుండుట యను సామాన్య సంబంధమును వేఱుపరచి గ్రహింపగలిగినట్లే, పూర్వాపరములకు సంబంధించిన సామాన్య సంబంధమును వేఱుచేసి తెలిసికొననగును కాన దేశగతములగు సంబంధములవలెనే, కాలగతములగు సంబంధములను గూడ మనము జ్ఞాత మొనరించుకొనగలము.

సరిగా నదేవిధముగ మనకు గోచరమగుటకు వీలైన సంబంధము వేఱొకటి గలదు. అది పోలికకు సంబంధించినది స్వల్పభేదముగల రెండు ఆకుపచ్చని చీరలను చూచినపుడు, రెండింటికిని ఒక పోలికగలదని గ్రహింపగల్గుదుము అదే

సమయమున మనమొక యెఱ్ఱని చీరను చూచి నచో, మొదటి రెండు చీరలకు ఒకదాని నొకటి యెట్లు పోలియున్నవో, అవి మూడవ చీరనుండి యెట్లు వేఱైయున్నవో. మొదలగు విషయములు తేటపడగలవు. ఈవిధముగా సామ్యము(పోలిక) నకుజెందిన సంబంధముమనకు నెఱుకపడగలదు.

విశేషములకువలెనే, సామాన్యముల నడుమ మనకు వెనువెంటనే జ్ఞాతమగుటకు వీలైన సంబంధములు గలవు. కొలది ఛాయాభేదము గలిగిన రెండు పచ్చచీరల నడుమనున్న పోలిక, వానికిని ఒక ఎఱ్ఱని చీరెకునునడుమగల పోలిక కంటె నెన్ని విధముల ఎక్కువ పోలికగలదో యిప్పుడే తెలిసికొంటిమి ఇచ్చట రెండు సంబంధముల నడుమగల తారతమ్య సంబంధమును ప్రతిపాదించుచున్నాము వీనినిగూర్చిన జ్ఞానము గల్గుటకు, ఇంద్రియార్థ రూపముననున్న గుణములను అనుభవసిద్ధము చేసికొనుటకు వలసిన పృథక్కరణ సామర్థ్యము (వేఱుపరచుశక్తి) కన్న నధికమగు సామర్థ్య మావశ్యకమైనను, ఆసంబంధముల విషయమై మనకుగల్గు జ్ఞానము వెనువెంటనే లభించునట్టిదై కొన్ని సందర్భములలోనైనను సందేహమునకు తావులేనిదై యున్నది. కావున సామాన్యములకును, నింద్రియార్థములకును సంబంధించియున్న నానంతరికమగు జ్ఞానమొకటి గలదు.

మనము సామాన్యములను గూర్చిన పరామర్శమును ప్రారంభించినపు డపరిష్కృతముగ వదలివైచిన పూర్వసిద్ధజ్ఞానము(Apriori Knowledge) నకు సంబంధించిన సమస్యను మరియొక్కమారు విచారణ చేయుదము. ప్రస్తుతము వెనుకటికంటె నీ సమస్యనుగూర్చి తృప్తికరముగా చర్చింపగల్గు స్థితిలోనున్నాము రెండును, రెండును కలసి నాలుగగునన్న వాక్యమునే పరామర్శింతము,ఇంతకుపూర్వము చెప్పిన దానిని బట్టి, రెండు అను సామాన్యమునకును, నాల్గు అను సామాన్యమునకును నడుమగల సంబంధమునే పైవాక్యము నిర్దేశించు చున్నదని వేఱుచెప్పనక్కరలేదు. దీనినొక సిద్ధాంతముగ ప్రతిపాదింపదలచినచో నిట్లు చెప్పవలెను పూర్వసిద్ధజ్ఞానమంతయును కేవలము సామాన్యముల సంబంధమునే ప్రతిపాదించును. ఇది చాల ముఖ్యమైనది ఇది పూర్వసిద్ధ జ్ఞానమునకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుట కెంతయో తోడ్పడును. అందుచే దీనిని నిరూపించుటకు ప్రస్తుతము యత్నింతము

ఇది యసంగతమని కొందరిట్లు చెప్పవచ్చును. ఒకజాతికి చెందిన విశేషములన్నియు నాజాతికే చెందునను నమ్మకములేదు మరి యింకొక జాతికిగూడ జెందునవకాశము గలదు. దీనినే యింకొకవిధముగ నిట్లు చెప్పవచ్చును. ఒకానొక లక్షణముగల విశేషముల కింకొక లక్షణ ముండుటగూడ సంభవము. ఈ సందర్భమున, మన మొకానొక లక్షణముగల వస్తువులనుగాక యా లక్షణమును గూర్చియే చర్చించుచున్న ట్లనిపించును. రెండును, రెండును నాలుగుఅన్న వాక్యము ప్రస్తుత సమస్యను చర్చించుట కనువగు నుదాహరణము. ఈ వాక్యమునే ఏ రెండు వస్తువులు మరి యేరెండు వస్తువులతో గలసినను నాలుగే యగును అనిగాని రెండు రెళ్ళతో గూడిన యే రాశియైనను నాలుగే యగునని గాని చెప్పుకొనవచ్చును. ఇట్టి వాక్యములు కేవలము సామాన్యములనే ప్రతిపాదించునని మనము నిరూపింపగల్గినచో, మనవాక్యగతమగు సిద్ధాంతము నిరూపితమైనట్లే భావింపనగును

ఒక వాక్యమేమి ప్రతిపాదించునో గ్రహించుటకు ఒక మార్గము - ఆ వాక్యముయొక్క యుద్దేశ్యమేమో అవగతము చేసికొనుటకై మనకే విజ్ఞాతము కావలయునో - ఏయే మాటలను అవగాహనము చేసికొనవలయునో మనము తొలుత పరామర్శించుకొనవలయును. వాక్యార్థమును మనము గ్రహింపగనే- ఆ వాక్యోద్దేశము నందలి భాగాము లెట్లున్నను, వాక్యము ప్రతిపాదించు విషయమును గూర్చిన యొక ప్రతీతి (జ్ఞానము) మనకు కలుగుననుటకు ప్రబలమగు నిదర్శనము కలదు. దీనినిబట్టి చూచినచో,విశేషములను సూచించు ననేక వాక్యములలో సామాన్యముల ప్రశంసగూడ నున్నట్లే కన్పించును రెండును, రెండును నాలుగగునన్న సందర్భములో రెండు రెళ్ళతో నేర్పడిన యొకానొక రాశి నాలుగుగా నొకరాశి రూపముననుండునని వ్యాఖ్యానించుకొన్నను, మనకా వాక్యము యొక్క ప్రధానోద్దేశ్యమేమో మనకవగతమగు ననుటలో నెట్టి సందియమును లేదు అనగా, రాశి, రెండు, నాలుగు, అను నీ మూడుమాటలకు నర్థమును గ్రహింపగల్గినచో, నా వాక్యము నర్థము చెప్పదలచుకొన్న విషయము మన కవగతముకాగలదు. అందుకు ప్రపంచముననుగల జంటలనన్నిటిని విడివిడిగా నెరుగుట నవసరము. అదియే నిజమైనచో ప్రపంచమున నెన్ని జంటల నెఱుగుట మనకు సాధ్యమగును? అట్టి వాక్య

మును అవగతము చేసికొనుట మన తలకు మించిన పని యయ్యెడిది కాబట్టి మనము జంటలను గూర్చి చెప్పిన సామాన్య వాక్యములో ప్రత్యేకములగు జంటలనుగూర్చిన ప్రశంస గర్భితమైయున్నను, 'ఫలానా'ప్రత్యేకములైన జంటలున్నవని మనకు తెలిసినంతనే, అంతమాత్రముచేతనే అది కేవల మా ప్రత్యేకమగు జంటనుగురించి మాత్రమే చెప్పుచున్నదనుటకు వీలులేదు.కావున జంటలనుగూర్చి చెప్పినవాక్యము సామాన్యమునకు సంబంధించినది మరియొక్క ప్రత్యేకమగు జంటలను గూర్చి చెప్పిన వాక్యముగాదు.

కావున రెండును రెండును నాలుగగునన్న వాక్యము కేవలము సామాన్యములను ప్రతిపాదించును. కావున నందలి సామాన్యములను గూర్చిన ప్రతీతిగలిగి వాక్యార్థబోధకములగు శబ్దముల సంబంధము నెరిగిన యెవ్వనికైనను నావాక్యోద్దేశ మవగతమగును. మనకుగల జ్ఞానమును పునః పరిశీలనము చేసికొనినమీదట, మనకు సామాన్యముల నడుమ సంబంధమును, ఒక్కొక్కప్పుడు గణితశాస్త్రమునకు తర్కశాస్త్రమునను ప్రతిపాదితములగు సామాన్యపూర్వసిద్ధ (General Apriori) వాక్యములను అవగతము చేసికొను శక్తి మనకు లభించినదనుటలో సందేహములేదు వెనుకి మనమట్టి జ్ఞానమును పరామర్శించినపు డందులో నగ్రాహ్యమైనట్లు కన్పించిన విషయమొకటి గలదు. అది యేమనగా నట్టి జ్ఞానము మన భవిష్య దనుభవమునకు బాటలు తీర్చి, వెనుకటి యనుభవమునంతను నియమించినట్లు కన్పట్టుటయే ఏమైననేమి, మనమీ విషయమున పొరబడితిమనియే చెప్పవలయును. అనుభూతము కాగల దేనినైనను అనుభవము నావలకు త్రోసి గ్రహించుట యనునది సాధ్యమగు సంగతికాదు రెండు వస్తువులును, మరిరెండు వస్తువులను కలసి నాలుగు వస్తువులగునని ముందుగనే మనము గ్రహింపగలము. కాని బ్రౌను, జోన్సు, కలసి యిఋవురు వ్యక్తులైనచో, రాబిన్సన్, స్మిత్ కలసి మరి యిఋవురు వ్యక్తులైనచో, బ్రౌను, జోన్స్, రాబిన్సన్, స్మిత్ కలసి నలువురౌదురన్న విషయమును ముందే మనము గ్రహింపజాలము ఇందుకు ప్రధానహేతువేమనగా, బ్రౌను, జోన్సు, రాబిన్సన్, స్మిత్ అను వ్యక్తులను గూర్చి యనుభవముచే పరిచితులైనగాని, యీ వాక్యము మనకవగతమగుటకు వీలులేదు కావున మన సామాన్యసిద్ధాంతబోధక వాక్యము పూర్వసిద్ధమైనను, లోకమున దానిని కొన్ని ప్రత్యేకోదాహరణముపట్ల ననుభవ మావశ్యకమై యున్నది. కావున నట్టి వాక్యమున ననుభవాంశము కొంత లేకపోలేదు కావున మన పూర్వసిద్ధజ్ఞానమున మనకు నగ్రాహ్యమై కన్పించిన దంతయును భ్రాంతి మూలకమని తెల్లమైనది.

పూర్వసిద్ధ విషయమును ప్రతిపాదించు మన యిప్పటి నిర్ణయమును, మనుష్యు లందరును మర్త్యులే అన్న అనుభవ సిద్ధమగు సార్వజనీన సిద్ధాంతముతో పోల్చిచూచిన, నీ విషయము మనకింతకంటెను విశదమగును ఇచ్చటగూడ వెనుకటి వాక్యమునవలెనే, మనుష్యుడు, మర్త్యుడు అన్న మాటలు మన కవగతమైనచో, నా వాక్యార్థము మన కవగతము కాగలదు. మన వాక్యార్థమేమో తెలిసికొనుటకు మానవజాతిలోని సర్వమానవులలో వ్యక్తిగతముగా పరిచయము గడించుట యన్నది 'శుద్ధఅనవసరము' కాబట్టి పూర్వసిద్ధమై, సర్వసాధారణమై యొప్పు వాక్యమునకును, అనుభవసిద్ధమగు సిద్ధాంతీకరణమునకు గల భేదము వాక్యగతమగు వివక్ష (ఉద్దేశ్యము)ను బట్టికాదు మరి యా రెండింటికిని నిదర్శన స్వభావమునుబట్టి భేదమేర్పడును అనుభవసిద్ధమగు నిర్ణయము విషయమున, నాయా ప్రత్యేకోదాహరణములలో నా నిర్ణయమునకు తగిన నిదర్శనము కన్పించును మనుష్యులందరు మర్త్యులేయని మనమువిశ్వసింతుము. ఏలన మానవులు మృతినొందుచున్నట్లును, కొంతవయః పరిమితినిమించి బ్రతుకనట్లును, లోకానుభవము వలన మనకు దెలియుచున్నది. మానవత్వమునకును, మర్త్యత్వమునకును గల సంబంధము మనకు స్పష్టముగా బోధపడినదని మనము దానిని విశ్వసించుటలేదు. సజీవ శరీరములను నియమించు సామాన్య ధర్మములను అంగీకరించి,యే ప్రాణియును చిరంజీవియగుటకు వీలులేదని శరీరతత్వశాస్త్రము నిరూపింపగల్గినచో, దానినిబట్టి, మనుష్యుల మరణమునకు సంబంధించిన ప్రత్యేక నిదర్శనముల నాధారముగా నైకొనకయే మన వాక్యమునందలి యుద్దేశ్యము నుద్ఘాటింపగల్గునట్లు చేయు మనుష్య మర్త్యత్వమధ్య గతమగు సంబంధము ఏర్పడును. కాని మనకు లభించిన యీ సామాన్యసిద్ధాంతము అంతకంటె నధిక విస్తృతిగల సిద్ధాంతములో నిమిడిపోయినదనియే దాని యర్థము విజ్ఞానశాస్త్ర మభివృద్ధి గాంచు కొలది విజ్ఞానశాస్త్ర సిద్ధములగు సామాన్యసిద్ధాం

తములకు నధికవిస్తృతమగు వ్యాప్తి సాధక ప్రాతిపదిక యేర్పడుచున్నది. కాని ఇది యింతకంటె నధికమగు నిశ్చితత్వమును సమకూర్చుచున్నను, నిది వెనుకటిదానికి విభిన్నమై యుండదు మనము విమర్శించుచు బోగా చివఱకు మిగిలిన కారణ ముదాహరణాత్మకమై యొప్పును మఱి అది మనకు గణితశాస్త్రమున గాని, తర్కశాస్త్రమున గాని ఉపలబ్ధములైన సామాన్యముల నడుమగల సంబంధముకాదు.

పూర్వసిద్ధములగు సాధారణ ప్రమేయవాక్యములలో రెండువిరుద్ధములగువిషయములుండుట గమనింపనగుమ అనేక ప్రత్యేకోదాహరణములు జ్ఞాతమైనచో, వ్యాప్తిసాధక విధానముచే ప్రథమోదాహరణమును బట్టియే, మన సామాన్య సిద్ధాంతములోని యాదార్థ్యమును గ్రహింపవచ్చును సామాన్యముల నడుమగలసంబంధము తఱువాత తెలిసికొనుట జరుగును ఉదాహరణమునకు, ఎదుఱు బొదుఱుగానున్న కోణముల నుండి ఒక త్రిభుజములోని భుజములకు లంబములను గీసినచో, మూడులంబములు నొక్కచో గఱియును అనేకోదాహరణములలోనట్లు మూడు లంబములును కలియుటను బట్టి మనము సామాన్య సిద్ధాంతమును గ్రహింపగల్గుదుము ప్రతి గణిత శాస్త్రజ్ఞునకును గలుగు నీ యనుభవమే యీ సామాన్యసిద్ధాంతమునకు ప్రాతిపదికలు వేయును

ఇదిగాక తాత్త్విక ప్రాముఖ్యముగల విషయమింకొకటి గలదు మనకొక్క యుదాహరణము గూడ లభింపని పరిస్థితులలో నట్టి సిద్ధాంతమొకటి గలదని మనకు ప్రతీతి గల్గుటకు వీలున్నది ఈ క్రింది యుదాహరణమును గమనింపుడు. ఏ రెండు సంఖ్యలైనను హెచ్చవేయుటకు వీలగుననియును, వానికి లబ్ధమనునది యుండుననియును మనకు తెలియును. నూటికి తక్కువయగు లబ్ధము గలిగినయన్ని రెండంకెలును యథార్థముగ గుణింపబడి, హెచ్చవేత పట్టీలో, నాయా యంకెల లబ్ధములు పొందుపఱుపబడినవని మనకు తెలియును. కాని యిట్టి యంకెల సంఖ్య పరిమితము కాదనియును, కొన్ని పరిమితములైన యంకెలజంటలే మానవుల యూహకందుననియును మనకు తెలియును కావున మానవుల యూహకందని యంకెల జంటలు కలవనియును, అవి యన్నియును నూరుకంటె నెక్కువయగు లబ్ధముగల యంకెలను వ్యవహరించుననియును స్పష్టమగుచున్నది. దీనినిబట్టి మనమొక విషయమును సిద్ధాంతీకరింపవచ్చును. మనుష్యుల యూహ కింతవఱకును అందని, అందుటకు వీలులేని రెండంకెల లబ్ధములు నూటికిపైగా నుండును. ఈ సామాన్య సిద్ధాంతమునందలి యథార్థ్యమును శంకించుటకు బొత్తుగా వీలులేదు. కాని దానికొక యుదాహరణమును మాత్రము సమకూర్పలేము ఏలన మన యాలోచనకు నందు నేరెండు అంకెలైనను, ఆ సిద్ధాంతమును సూచించు శబ్దములచే నపాకృతము లగును

ఎట్టి యుదాహరణమును ఇచ్చుటకు వీలులేని సామాన్య సిద్ధాంతముల యునికిని గూర్చిన జ్ఞానము మనకు గలుగుటకు గల యవకాశమును చాలమంది తత్త్వవేత్త లంగీకరింపరైరి ఏలన అట్టి సిద్ధాంత ప్రతిపాదకములగు వాక్యములు మన కవగతముకావనెన్న, అందలి సామాన్యముల నడుమగల సంబంధములను గూర్చిన జ్ఞానమావశ్యకమనియును, ఆ సామాన్యముల యుదాహరణములకు సంబంధించిన జ్ఞానము నావశ్యకమనియు నన్న సంగతులు ప్రత్యక్షగోచరము లగుటలేదనివారిప్రతివాదము కాని జ్ఞాతమగునని సామాన్యముగ నంగీకృతమైన దానిలో చాలవఱకు, నట్టి సామాన్యసిద్ధాంతముల యావశ్యత కన్పట్టును ఉదాహరణకు, నింద్రియార్థములకు విరుద్ధముగా, భౌతికవస్తువులు అనుమాన ప్రమాణగమ్యములనియును, నవి మనకు ప్రత్యక్షగోచరములు గావనియును మనమీవఱకే గ్రహించితిమి ఇది అనుపదము వెనువెంటనే జ్ఞాతమగు నొకానొక వస్తువు అనునర్థములో నిదియొక భౌతికవస్తువు అనురూపము గల యే సిద్ధాంత ప్రతిపాదక వాక్యమును మనము యెఱుంగజాలము. ఆ భౌతికవస్తువుల వలన మనకు ననుభూతములగు కొన్ని యింద్రియార్థములకు సంబంధించిన నిదర్శనములను సమకూర్పగలము కాని అసలు భౌతికవస్తువులకు సంబంధించిన యుదాహరణములను మనము సమకూర్పలేము. కావున భౌతికవస్తువులను గూర్చిన మన జ్ఞానము ఉదాహరణమిచ్చుటకు వీలులేని సామాన్య సిద్ధాంతముపై నాధారపడి యుండును. అదే ఇతరుల మనస్సుల యునికి విషయమై మనకు గల్గు జ్ఞానమునకును, ప్రత్యక్షానుభవముచే జ్ఞాతమగునట్లు తెలియుటకు వీలులేని తదితర విషయములకును అన్వయించును

మనము వివేచన చేసినవఱకు బయల్పడిన జ్ఞానాధారములను కొంత పరీక్షించితిమి. తొలుత వస్తుజ్ఞానమునకును, సత్యజ్ఞానమునకునుగల భేద

ములను వివేచనము చేయవలసియున్నది. ఈ రెండింటిని తిరిగియానంతరికము(Immediate) వైకారికము (Derivative) అను రెండు తెగలుగ విభజింపనగును.వస్తువులనుగూర్చి వెను వెంటనే కలుగు జ్ఞానము సామాన్యములచేతను విశేషములచేతను జ్ఞేయములగు విషయములతో గూడుకొనియుండును మనకట్లు జ్ఞాతములగు విశేషములలో మన యింద్రియార్థములును, మన మునుగూడ నంతర్భూతులమై యున్నాము సామాన్యములలో, ప్రత్యక్షానుభవముచే జ్ఞాత మగునట్లుగా మనము నిర్ణయింపగలిగిన సిద్ధాంత మేదియు నున్నట్లు కన్పింపదు. కాని అట్లు తెలి యుటకు వీలైనవానిలో నింద్రియగ్రాహ్యములగు గుణములు, దేశకాల సంబంధములు, సామ్యము.

కొన్ని తార్కిక సామాన్యములు (Logical Universals)ను గలవనుట స్పష్టము. పరోక్షా నుభవ జన్యజ్ఞానమని వ్యవహరించెడి వైకారిక మగు వస్తుజ్ఞానములోఒకానొక వస్తువునుగూర్చిన ప్రత్యక్షానుభవము, కొన్ని సత్యములనుగూర్చిన జ్ఞానమును ఇమిడియుండును సత్యములనుగూర్చి మనకు వెనువెంటనే గల జ్ఞానము ప్రతిభా (Intutive) జన్యమైనది అట్లు జ్ఞాతములగు సత్యములనే స్వతః సిద్ధించిన సత్యములు ఆ సత్యవిషయములలో, కొన్ని గణితశాస్త్ర సిద్ధాం తములును, తర్కశాస్త్ర సిద్ధాంతములును, కొన్ని నైతికసూత్రములును ఇమిడియున్నవి. సత్యము లకు సంబంధించిన జ్ఞానమున, స్వతసిద్ధములగు నిగమన సిద్ధాంతముల వినియోగముచే గ్రహిం చుటకు వీలైన సత్వము ఉండును.

పై చెప్పిన విషయమంతయును యథార్థమై నచో,మనకుగల సత్యవిషయక జ్ఞానమంతయును మనకుగల ప్రతిభానముత్పన్నమగు జ్ఞానముపై నాధారపడియుండును. కావున మన మింతకు ముందు ప్రత్యక్షానుభవ జన్యజ్ఞానము స్వరూప స్వభావాదులను పరిశీలించినట్లే, యీప్రతిభాన ముత్పన్నమగు జ్ఞానమునుగూడ జాగ్రత్తగా విచారింపవలసిన యావశ్యకత గలదు కాని

సత్యములనుగూర్చిన జ్ఞానము - భ్రాంతియనెడి సమస్యను క్రొత్తగా తెచ్చిపెట్టును కాని వస్తు జ్ఞానము విషయమున నిట్టిభ్రాంతి కవకాశమే లేదు మనకుగల విశ్వాసములలో కొన్ని భ్రమ మూలకమైపోవును కావున భ్రాంతి, యథార్థ జ్ఞానముల భేదమును పరామర్శించు నవసరము కలదు. ప్రత్యక్షానుభవజన్య జ్ఞానము విషయమై యీ సమస్య యుదయింపదు. ఏలన కలలోనై నను, కామెలయందైనను, మనకప్పుడు గోచర మగు వస్తువు పరిధిదాటి భ్రాంతికి నవకాశము లేదు మనకప్పుడు మిగిలిన యింద్రియార్థ సం బంధియగు ననుభవమును భౌతికవస్తువుకు చిహ్న ముగా భావించునపుడే భ్రాంతికి స్థానమేర్ప డును కావున సత్యవిషయక జ్ఞానమునకు సంబం ధించిన సమస్యలు వస్తుజ్ఞానమునకు సంబంధిం చిన సమస్యలకంటె చాల క్లిష్టమైనవి సత్యవిష యక జ్ఞానమునకు సంబంధించిన సమస్యలలో మొదటిదైన ప్రతిభాజన్య జ్ఞానమును తరువాతి యధ్యాయమున విచారింతము.

విశ్వనాథ మధ్యాక్కఱలు

నందమూరు శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౩

ఓయి! నాస్వామి! మున్ను జనకాదుల కొప్పెనుగాని
మాయీ దృశులకును రెంటిదగు పొత్తు మసలింపనగునె
నీ యొక్కనిపయి నాధారపడియుంటి నిజము నీ కృపద
పీ యసి నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

శ్రీశాతమైన నీ వేణుగావంబు రేకగా జ్ఞాన
కోశంబులోపల వచ్చి చొరనీవె గోపాలబాల
ప్రాశీర్ణమైన నాగుండె సందులకెక్కి ప్రజ్ఞా ని
వేశన నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

ఎలుక తానెంత సేపటికి తనదెసకే త్రవ్వుకొనును
తలఁచి దానిని దీని నీ కృపయని యర్థము చెప్పికొందు
నిలుపవే యర్థమ్ము దీనజనుల మన్నించుపని కిది
వెలికాదు నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

తిరిపమ్మునకు నా ప్రభూ! మూడుదివ్విటీలేల
భరముగా జరిగించుచుంటి నాదైన బ్రదుకు నీలాంబు
ధరచిక్కణాపఘనా! దృశాంశుసౌదామనీ శాంతి
బెరయక నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

గోపాల యెప్పుడో ప్రాణతతి చెప్పకుండగా లేచి
వేపోవునెందుకో యెచటికో లేచి వెళ్లుటెచ్చటికొ
చాపుదేరి శతవిధాల వెళ్ళెడిస్థలము కావలయు
ప్రేపల్లె నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల.

నిను వేయిమార్గాల మనసులోపల నిలుపయత్నింతు
ననువు కాకుండెదు నిన్ను బలవంతమని చేయరాదొ
దానవోలె నెప్పుడో దిగు హఠాత్తుగా దూఁకి వచ్చెనన
వినువాక నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల.

చిత్తంబు కలలోనఁ గ్రొత్తగా నూహచేయును గలదొ
వృత్తంబు పూర్వంబు నూరక ప్రతిబింబించు చుండెడినొ
క్రొత్తగా భావిసూచనయుఁ జేసినఁ గొంత విజ్ఞాన
విత్తగు నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల.

తరి బావిలోఁతుగాఁ ద్రవ్వి జలపడ్డ తరువాత నొడ్డు
విరిగిపడ్డట్లుగా నున్నదయ్యా నా విధము గోపాల
మరల నంతటిలోఁతు త్రవ్వగాఁ గనబడు జలయింత
వెరవేది నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

నీ పేరెయది స్వతస్సిద్ధముగఁ దియ్యని పదార్థమగున
వాపోవు బిడ్డల యేడ్పుడుపు జోలపాటగదయ్యా
నీ పాలివాడను బాలముంతువో నీటముంతువో గ
వీపాల నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల.

అనుభవింపను గల శక్తియుండి తాననుభవింపనగు
దినుసు లేకుండిన నున్నఁగోరిక తీరైనమాట
అనుభవించెడి శక్తిలేదు కోరికయన్న దెందులకు
పెనగొను నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల.

తెలిసిన మూర్ఖులంచున్న యెడల ధాత్రిని నన్నుమీఱఁ
గలుగరు మనసు నీ పైనను నిలుపగా క్షణంబేని
గలుగను మూర్ఖత దీనికంటెను గలుగునా వేణు
విలసన నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల.

వెలఁదిపై బిడ్డపై కోర్కివలను జీవికినంచు నాకు
దెలిపితి వొకభార్యఁ జంపి యెడబిడ్డఁ దీసుకపోయి
తెలిసికోలేక పోయినను నీవెట్లు తెలిపెదు వట్టి
వెలుఁగవై నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

తెలియనినాళ్ళలోఁ గొన్నిటినిఁ జేసితిని వానిబాధ
తెలిసిననాళ్ళలో ననుభవానికిఁ దెచ్చెదు నన్నుఁ
దెలివి తక్కువవానిఁ జేసి యాడించితివి యంతగాఁగ
వెలిపెట్టి నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల.

కవులకు పుట్టినిల్లు...

'ఏ ఆంధ్రుణ్ణి అయినా కదిలించిచూడండి, మీకు ఒక కవి కనుపిస్తాడు!-' అంటారు సర్వ సాధారణంగా

కాని 'ఆంధ్రప్రదేశ్' లో చాలామందికి కవిత్వం వృత్తికాదు. వ్యవసాయం వారివృత్తి ప్రణాళిక క్రింద ఏర్పడిన అనేక అభివృద్ధి పథకాల ఫలితంగా ఎంతో విస్తీర్ణం కల కొత్త ప్రదేశాలు సాగులోనికి వస్తున్నాయి ఆంధ్రప్రదేశ్‌లోని వ్యవసాయోత్పత్తిదారులు ఇంకా ఇంకా ఎక్కువగా ఆహారాన్ని జాతికి అందిస్తున్నారు రాష్ట్రంలో ద్వితీయ పంచవర్ష ప్రణాళిక పూర్తిఅయ్యే సరికి, అదనంగా 4,04,000 ఎకరాల విస్తీర్ణంకల భూమి సాగులోనికి వస్తోంది.

ఈ ఆర్థిక పురోగమనంతో పాటు అటు సాంస్కృతిక రంగంలోకూడా సహజంగానే అభివృద్ధి కానవస్తోంది. కవులు దినదినం కొత్తనమూనాలలో కావ్యసృష్టి కావిస్తున్నారు. నాటకకర్తలు, కథారచయితలు నవీనశిల్పంతో తమతమ రచనలందు నూతనవిధానాలు తెస్తున్నారు.

ఈ పై రెండు రంగాలలోనూ సాధిస్తున్న అభివృద్ధినిగూర్చి గమనార్హమైన దర్శనంతో నెలనెలా ప్రచురించబడుతున్న పత్రిక 'ఆంధ్రప్రదేశ్' ఇది ఆంధ్రప్రదేశ్, సమాచార, ప్రజాసంబంధశాఖ డైరెక్టర్ గారిచే ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ భాషలలో ప్రచురించబడుతోంది. ఈ పత్రిక ఒక్కొక్క భాషా ముద్రణకు సంవత్సర చందా రు. 2-16 నయాపైలు మాత్రమే, ఇదీ నామకార్థంగా వసూలు చేయబడుతోంది. పత్రికలో ప్రచురించడానికి ఆమోదించబడిన రచనలన్నింటికీ పారితోషికంకూడా ఇవ్వబడుతోంది

—సమాచార, ప్రజాసంబంధ శాఖ,

ఆంధ్రప్రదేశ్

మాస ఫలములు

15-1-1960 — 14-1-1960

శ్రీ 'బుధ'

గ్రహస్థితి- రవి (మకరం) బుధుడు (ధనుర్మకరకుంభ) గురు, శుక్రులు (వృశ్చిక ధనుస్సు) కుజ, శనులు (ధనుస్సు) రాహు (కన్య) కేతువు (మీన) రాసులలో.

మేషము

(అశ్వ, భర, కృత్తి 1 పా,)

దశమరవిస్థితి మంచిది మీ ప్రయత్నములకు కాలం అనుకూలంగా వుంటుంది. ఆలోచనలు ఆచరణలో పెట్టగలుగుతారు గవర్నమెంటు ఉద్యోగస్థులకు అధికారము, హోదా, బాధ్యతలు పెరుగుతాయి సంఘంలో పలుకుబడి పరపతి హెచ్చుతుంది సైనికోద్యోగులకు ఇంజనీర్లకు మైనింగు వ్యాపారస్తులకు మిక్కిలి శుభఫలితాలు చేకూరుతాయి **19** నుండి బుధుడును అనుకూలుడగుటచే మీ ప్రయత్నాలు ఫలించుటకు, మరింత అవకాశము ఏర్పడుతుంది సాహితీ మార్గములలో పరిశ్రమ చేయువారి కృషి ఫలించి ఆదాయము సమకూరుతుంది **22** నుండి మీ జన్మరాశికి గురు దృష్టికలదు. సత్కార్యాభిలాష శుభకార్యములుచేయు తలంపులలో అనుకూలత అనారోగ్యములు తొలగి, కుటుంబసౌఖ్యము చేకూ: వ్యాపారస్తులు ఎక్కువ పెట్టుబడులతో ఋంచ లాభముల గడించే అవకాశము కలదు విద్యార్థులకు విజయం, నూతనోద్యోగ ప్రయత్నములు ఫలిస్తాయి శత్రువులు మిత్రులవుతారు. **21** నుండి ఆర్థికలాభం - స్థిరవసతుల నుండి ఆదాయం మాతాపితురులు లేక సోదరులతో వైరం-ప్రయాణముల మూలంగా ఖర్చు

వృషభము

(కృత్తి 2 3, 4 రోహిణి, మృగ 1, 2 పా)

ఎంతో ఓర్పు వహిస్తూవున్నారు నిజమే. గ్రహస్థితి బాగా లేనపుడు మీరుమాత్రం ఏం చేస్తారు? అష్టమరాశిలో శని అంగారక చలనం మంచిదికాదు పరిస్థితులు భయంకరంగా పరిణమిస్తాయి ఒక ఆర్థిక, అనారోగ్య ఇబ్బందులే కాదు. ఇంకా అనేక విధాలుగా మీమనస్సు బాధపడుతుంది కాని ఈ నెలలోనే, **19** నుండి బుధుడు **21** నుండి శుక్రుడు **22** నుండి గురుడు శుభస్థానగతులగుచున్నారు ఇట్టి చలనం శుభదాయకమైనది. క్రమక్రమంగా మీ సమస్యలకొక పరిష్కారమార్గం అగుపిస్తుంది జీవిత పురోగమనమునకు తగిన అవకాశాలు ఏర్పడుతాయి ప్రయత్నములు ఫలిస్తాయి - ఉద్యోగవ్యాపారములలో స్థిరత్వం చిక్కుతుంది, నూతన ఉద్యోగములు లభిస్తాయి రావలసిన డబ్బు చేతికి వస్తుంది. ఇబ్బందులు కొంతవరకు తీరుతాయి నమ్మకంగా **20** నుండి మీ వ్యాపారముల కొనసాగించవచ్చు గురు, శుక్రుల అష్టమస్థితివలన సాంఘిక పరిస్థితులు మిగుల ప్రోత్సాహకరంగా వుంటాయి, మీ విజ్ఞానాత్మకమగు కృషి, గౌరవము సమకూరుస్తుంది సత్పురుషుల సాంగత్యం సద్గోష్ఠి, అనారోగ్యములు తొలగి కుటుంబ పరిస్థితులు సుఖప్రదంగా వుంటాయి శుభవార్తలు వింటారు, ప్రయాణములలో జాగ్రత అవుసరం స్పెక్యులేషన్ భ్రాంతివద్దు

మిథునము

(మృగ 3, 4, ఆర్ద్ర, పున 1, 2, 3 పా)

జనవరి **19** వరకు గ్రహస్థితి అనుకూలంగా వుండదు మీ ప్రయత్నములకు అవరోధములు కలుగుచునే వుంటాయి. ముఖ్యంగా, కుటుంబ, సాంఘిక పరిస్థితులందు అశాంతి. కారణంలేని కలహాలు, అపోహలు, అభిప్రాయభేదాలు తమ సాటి ఉద్యోగస్తులవలనను - భాగస్తులవలనను, కొన్ని ఇబ్బందులు కలుగుతాయి. పై అధికారుల ఆగ్రహావేశములకు గురి అవుతారు **20** నుండి, బుధ, శుక్ర, గురు, గ్రహచలనం, మీకు మేలు చేస్తుంది. పై ఇబ్బందులన్నీ క్రమంగా తీరిపోతూ వుంటాయి-ఉద్యోగ వ్యాపారాదికృషులు నిరాటంకంగా జరిగిపోతూ వుంటాయి. మీ విజ్ఞానాత్మక కృషి ఫలిస్తుంది. మీ విద్యావ్యాసంగములు, రచనలు ప్రజానుమోదము బడసి గౌరవము చేకూరుస్తాయి పబ్లిక్‌స్పీకర్సుకు, ప్రొఫెసర్సుకు, మిగుల అనుకూలం. ఉద్యోగ, వ్యాపారాదికృషుల నిమిత్తం, కొంతకాలం ఇతరప్రదేశములందు వుండిపోవలసి వస్తుంది. కమీషన్, వాయిదా, లౌకిక, వ్యాపారములందు లాభం. తలవనితలంపుగా ద్రవ్యం చేతికివస్తూ ఆలాగుననే ఖర్చు అవుతూ

వుంటుంది. ప్రియ బంధుమిత్రుల రాకపోకలతో గృహస్థజీవితం ఆనందంగా వుంటుంది. కాని ఈ రాశిలో జన్మించిన కొందరికి. శని, అంగారక సప్తమస్థితిచే - కళత్రమునకు మిక్కిలి జబ్బు చేయుట, లేక ఆంతరంగిక కలహములవల్ల కొంతకాలం ఎడబాటు సంభవమవుతుంది. ప్రయాణములలో ప్రమాదములు జరుగుతాయి

కర్కాటకము

(పున 4, పుష్య, ఆశ్రే)

గ్రహస్థితి మిగుల అనుకూలం మీ భాగ్యాన్ని భోగానుభవంగా చేసికొనుటకై తాపత్రయ మెక్కువ అవుతుంది - నూతన గృహనిర్మాణాది ప్రయత్నములు, నెరవేరుతాయి - స్థిరవస్తుల నుండి ఆదాయం చేతికివస్తుంది - వైవాహిక సంబంధములు అనుకూలించి ఎక్కువ కట్నకానుకలు లభించేయోగము వుంది ఉద్యోగస్థులకు అధికారం, హోదా, పెరుగుతుంది ముద్రాధికారయోగం వ్యాపారస్తులకు విదేశీవస్తులాభం వ్యాపారం నిమిత్తం ఇతర పట్టణములలో నివాసం, నూతన బంధుమిత్రాదులతో, మృష్టాన్నభోజనములతో కుటుంబజీవితం సుఖప్రదంగా గడచిపోతూవుంటుంది నూతన వస్త్రాభరణప్రాప్తి రాజకీయములలో తిరుగువారికి, కార్యభారము ఎక్కువవుతుంది-అనేక క్లిష్టసమస్యలు ఏర్పడుతాయి చివరిక్షణంలో విజయం చేకూరుతుంది-వ్యాపారస్తులకు భారీ పరిశ్రమలలో పెట్టుబడులు లాభదాయకంగా వుంటాయి, సంతతికి కొలది అనారోగ్యం-మేనమామలతో వైరం-ప్రయాణములందు గాయం. సంభవమగు సూచనలున్నవి

సింహము

(మఖ, పుబ్బ, ఉత్త 1 పా)

గ్రహస్థితి మిగుల అనుకూలం ప్రయత్నములందు శ్రమ అధికమైనా, ఫలితం జయప్రదంగా వుంటుంది పదవియం దాధిక్యత, గౌరవము, ఉద్యోగస్తులకు వేతనాభివృద్ధితోపాటు, బదిలీ సినిమారంగంలో, కృషిచేయువారికి, నృత్య, నాట్య, శిల్ప, కళల్లో పనిచేయువారికి మంచి కాలం వారి ప్రయత్నము ఫలించి, మంచి ఆదాయము వస్తుంది భారీ పరిశ్రమలకై పెట్టుబడుల అవసరాలు అధికం అవుతాయి ఇందులకై కొంత ఋణముకూడా చేయుదురు వ్యాపారస్తులు తమ వ్యాపారములను నిర్భయంగా కొనసాగించుకొనవచ్చు మీ పెట్టుబడులు లాభదాయకం వుంటాయి. స్పెక్యులేషన్ అనుకూలిస్తుంది. ఏదో విధంగా ద్రవ్యము చేతికందుచూ ఆర్థిక అవసరములు తీరుచుండును వ్యవహారిక జయం. అధికారుల సహకారం. రాజకీయములందునూ జయమే ఇన్ని విధముల బాగావున్నా గృహస్థజీవితమందు కొంత అశాంతిని పొందుచుందురు. ఆరోగ్యము తిన్నగా ఉండదు. బంధువైరం పరస్పర వాగ్వివాదములు అకాలభోజనం ఉద్యోగ వ్యాపారముల ననుసరించి దీర్ఘప్రయాణములు ప్రయాణములందు జాగ్రత అవసరం. ఆడంబరప్రదర్శన తగదు.

కన్య

(ఉఫ 2. 3,4, హస్త, చిత్త 1, 2 పా)

జనవరి 20 వ తేదీనుండి గ్రహస్థితి మిగుల అనుకూలం బహుకాలంనుంచీ, పలువిధముల బాధ పడుచున్న మీకు ఇప్పటినుండీ, కష్టములు క్రమముగా తీరుచు జీవిత పురోగమనమునకు తగిన అవకాశములు ఏర్పడుతాయి - అనుకూల వాతావరణం ఏర్పడుతుంది పరిస్థితులు స్థిమితపడుతాయి మీవిజ్ఞానాత్మక పరిశోధన విమర్శనా శక్తి, న్యాయదృష్టి, కళారూపంలో స్ఫురింపడుటయేగాక, వ్యాపారరూపంలో ద్రవ్యమును సహితం సమకూరుస్తుంది ఆలోచనలు మీవైపున్నా వ్యాపారంనడిపే సామర్థ్యతమురొక్కశైవుంటె మంచిది ఆలోచనలు ఆచరణలో గల సమర్థత చేకూరుతుంది-మిత్రుల సహకారంతో పనులు సమకూరుతాయి వ్యాపారము నిరాటంకంగా సుస్థిరంగా సాగిపోవుటకుతగిన ఏర్పాట్లు జరుగుతాయి-ఉద్యోగ వ్యాపారములలో స్థిరత్వము చిక్కుతుంది. ఈ నెలలో ఆర్థికపరిస్థితులు, తృప్తికరంగా వుంటాయి బుద్ధికుశలతతో కాగల కార్యములన్నీ నెరవేరుతాయి, బంధుమిత్రుల రాకపోకలతో వినోదవిలాసములతో గృహస్థజీవితం సుఖప్రదంగా జరిగిపోతూవుంటుంది కాని చతుర్థమందు శని, కుజ అశుభస్థితివలన గృహమార్పు స్థానచలనం-ఆప్తబంధు మరణంవలన, కొంత అశాంతిని పొందవలసి వస్తుంది.

తుల

(చిత్త 3, 4 స్వాతి, విశా 1, 2 3 పా)

గ్రహస్థితి శుభాశుభమిశ్రమ ఫలితాన్ని సూచిస్తుంది-వృత్తి ఉద్యమములలో మార్పుకనుపించదు వృధాగా గడిపిన కాలాన్నిగూర్చి ధనాన్నిగూర్చి పశ్చాత్తాపపడుతారు మీ వ్యాపా

రాది కృషిని క్రమపద్ధతిలో నడుపుటకు చేయు ప్రయత్నములు అనుకూలించును మీ విజ్ఞానాత్మకమైన కృషివలన పేరుప్రతిష్టలు సంపాదించుకొనవలయుననెడి తలంపుతో కొన్ని ప్రయత్నములు చేయుదురు. మిత్రుల సహకారంతో అట్టి సంకల్పము నెరవేరి సమాజమందు గౌరవము చేకూరును వేదాంత శాస్త్రపరిశోధనలు చేయుట. పాండిత్యగోష్టులలో పాల్గొనుట, సంభవమగును ఉద్యోగ, వ్యాపారములు హెచ్చుతగ్గులు లేక సౌమ్యంగా జరుగుచూ తగు ఆదాయము నిచ్చుచుండును భూమి, గృహము, వసతులనుండి కొంత ఆదాయం రాగలదు ఆధ్యాత్మిక చింతతో కొన్ని పుణ్యకార్యములు చేయుదురు సాహితీమార్గములలో కృషి చేయువారికి మంచికాలం-వారి కృషి శుభఫలితాన్ని ఇవ్వగలదు. బంధుమిత్రులతో, మృష్టాన్నభోజనములతో గృహస్థజీవితం సుఖప్రదంగా వుంటుంది. సంతతియొక్క పురోభివృద్ధి సంతోషంగా వుంటుంది-సాంఘిక వ్యవహారములందు ఆంతరంగిక అభిప్రాయభేదాలు కలుగుతాయి.

వృశ్చికము

(విశాఖ 4 అనూ, జ్యేష్ట)

గ్రహస్థితి మంచి, చెడు, ఫలితము లిచ్చుటలో మిక్కిలి తీవ్రత జెందివున్నది భౌతికఫలాపేక్ష అన్నివిధములా తానే అగ్రగామిగా వుండవలెననియెడి తలంపు, కక్ష తీర్చుకొనదలచుట విప్లవాత్మకంగా కార్యసాధన గావించుకొనుకోరిక ఈలాగున కొందరిలో, నిర్మాణయుక్తంగా ఒక చక్కని వ్యూహము పన్ని తాను అట్టి ఉద్యమ నాయకుడుగా వుండవలెననియెడి కోరిక మరి కొందరిలో స్వాభావిక మార్పుకలిగి అట్టి ప్రయత్నములు చేయుదురు ఉభయమార్గములందునూ వారు గావించు ప్రయత్నములు జయప్రదములే అగును మంచి జాతకులకు గౌరవప్రతిష్ఠలు ధనము సమకూరుస్తుంది చెడ్డజాతకులకు ప్రమాదములను, గాయములను, మరణమును కలుగజేస్తుంది గ్రహతీవ్రతను గమనించి మీ ఆలోచనలు సక్రమమార్గములలో నడిపించుదురుగాక. రవి, బుధులు తృతీయస్థితివలన యత్నకార్యానుకూలత, పదవియందాధిక్యత గౌరవం కలుగుతుంది మీ వ్యాపారాదికృషులు నిరాటంకంగా కొనసాగుతాయి సాంఘిక, రాజకీయ వ్యవహారములలో జయం. జనవరి 22 నుండి ఆర్థికపరిస్థితులు అనుకూలించి ఇబ్బందులు తీరుతాయి. భూ' గృహపశుపులనుండి ఆదాయం. అనారోగ్యములు తొలగి కుటుంబసౌఖ్యం సమకూరుతుంది. శాస్త్రజ్ఞులు తమ పరిశోధనలలో నూతన విషయములు కనుగొంటారు

ధనుస్సు

(మూల, పూషా, ఉషా 1 పా)

మీ జన్మరాశియందు శని, అంగారక, గురు, చలనం ఇందులో ఏఒక గ్రహమున్నా కొన్ని చిక్కులు కలుగుతూవుంటాయి, జనవరి 2 నుండి ఫిబ్రవరి 14 వరకు ఈ మూడు గ్రహములు జన్మరాశియందే సంచరించడం జరుగుతుంది. కావున ఇది రకున్న చిక్కులేగాక, ఈ నెలలో మరికొన్ని చిక్కులను అదనంగా అనుభవించవలసియుంటుంది. నిర్లక్ష్యం పనికిరాదు. బరువాసాశించ పనులు జరుగవు అవుతాయను కొన్న పనులలో ఆశాభంగం, అయినవనుకొన్న పనులకు ఆటంకాలు, ఉద్యోగస్థులకు కార్యభారము అధికమవుతుంది. పై అధికారుల ఆగ్రహావేశములకు గురి అవుతారు భారీ పెట్టుబడులతో వ్యాపారము చేయుట తగదు. స్పెక్యులేషన్ కొంతవరకు లాభిస్తుంది భాగ్యరాజ్యాధిపతులు కలసి ధనస్థానంలో నుండుటచే ఇట్టి పరిస్థితులలో కూడా ఆర్థిక ఇబ్బందులు ఉండవు. ఏదోవిధంగా ధనరాబడి వుంటుంది చిక్కులు సనుర్థించుకొనుచూ గౌరవం కాపాడుకొనగలుగుదురు. సాంఘికవ్యవహారములు తృప్తికరంగా వుండవు పార్టీలు-కక్షలు. అభిప్రాయభేదములతో, బహుకల్మషంగా వుంటుంది ఆరోగ్యం చెడకుండా చూచుకోటం ముఖ్యం ప్రయాణములు ప్రయోజనము కలిగించవు

మకరము

(ఉషా 2 3 4 శ్రవణ, ధని 1, 2 పా)

గ్రహస్థితి సామాన్యంగా వుంది. మంచి, చెడులు సమంగా నడుస్తూవుంటాయి. జన్మరాశియందు రవి, వ్యయమందు శని, కుజస్థితివలన, మీ సమస్యలన్నీ ఎటూతేలకుండా చీకాకుపరుస్తూ వుంటాయి కొంతకాలం ఏకాంతంగా వుండాలనిపిస్తుంది మీ ఆలోచనలన్నియు ఒకానొక పనియందు కేంద్రీకరింపబడి వుంటాయి కార్యసాధనలో, గోప్యం ఆవశ్యకం ఉద్యోగవ్యాపారములు తృప్తికరంగా వుండవు మధ్యవర్తులద్వారా వ్యవహార అనుకూలత ఉద్యోగస్తులకు ఇతరప్రదేశములకు బదిలీయగు సూచనలున్నవి-శ్రమకు తగిన ఆదాయమురాదు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువవు

తాయి. కుటుంబంలో సంతతి మొదలైనవారికి అనారోగ్యములచే అశాంతి అయినప్పటికి గురు, శుక్రుల వ్యయస్థితిచే కొన్ని సత్కార్యములు కూడా చేయకలుగుతారు స్థిరవసతుల నేర్పరచు కొనుటలో, శుభకార్య నిర్వహణలో అనుకూలత ఏర్పడుతుంది. మీశరీర ఆరోగ్యం కాపాడుకో వలసిన అవుసరం వుంది

కుంభము

(ధని 3, 4 శత, పూభా 1, 2, 3 పా)

గ్రహస్థితి మిగుల అనుకూలం యత్నకార్య ములు శ్రమలేకుండగనే సఫలమవుతూంటాయి- నూతన ఉద్యోగ, వ్యాపారప్రయత్నములం దను కూలత ఆలోచనలన్నీ ఆచరణలో పెట్టగలుగు తారు ఎక్కువ పెట్టుబడులతో వ్యాపారం నడుపు టకు యత్నిస్తారు-పబ్లిక్ సంస్థలకు సంబంధించిన కంట్రాక్టుపనులు అనుకూలిస్తాయి ఉద్యోగము లలో, వేతనాభివృద్ధి - వ్యాపారములో పెట్టు బడులు లాభదాయకంగా వుంటాయి- శుక్రుడు ఏకాదశ స్థితివలన, రాబడి ఎక్కువ. నూతన వస్తు వాహనములు ఏర్పడుతాయి శుభకార్యప్రయత్న ములు కలసివస్తాయి సత్పురుషుల సాంగత్యము, వేదాంతవిషయ విచారణ, యాత్రాఫలసిద్ధి సాం ఘికవిషయములు ప్రోత్సాహకరంగా వుంటాయి బంధుమిత్రులతో, మృష్టాన్నభోజనములతో గృహస్థజీవితం సుఖంగా గడచిపోతుంది - రవి, బుధవ్యయస్థితివలన స్వల్ప అనారోగ్యము. ఉష్ణా ధిక్యత, ధర్మకార్యములకు ధనవ్యయం.

మీనము

(పూభా 4. ఉభా, రేవ)

గ్రహస్థితి మిగుల అనుకూలం,నూటికి నూరు పాళ్ళు యత్నకార్యములు అనుకూలిస్తాయి అధి కారం,హోదా పెరుగుతుంది-పలుకుబడి పరపతి హెచ్చుతుంది. లలితకళలో పరిశ్రమచేయువారికి రచయితలకు ఉపన్యాసకులకు - అధ్యాపకులకు మంచికాలం వారికృషి ఫలించి, ఆధాయాన్ని గౌరవాన్ని చేకూరుస్తుంది. మధ్యవర్తుల పరిష్కా రంవలన, వ్యవహార విజయం ఉద్యోగవ్యాపార ములలో రాబడి అధికం వ్యాపారములలో ఉద్రే కపూరితంగా శక్తికిమించి స్పెక్యులేట్ చేస్తారు. జాగ్రత అవుసరం. సాంఘిక వ్యవహారములు ప్రోత్సాహకరంగా వుండుటయేగాక, అగ్రస్థా నంకూడా ప్రాప్తిస్తుంది. వృత్తి ఉద్యమముల ననుసరించి దీర్ఘప్రయాణములు జరుగుతాయి. లాభసాటిగా వుంటాయి. బంధుమిత్రులతో వినోదవిలాసములతో గృహస్థజీవితం సుఖప్రదం గా వుంటుంది. నూతన వస్తువాహనప్రాప్తి.

Edited, Printed & Published by Sri J Radhakrishna Reddy, Vijayawada-2
Printed at Nava Bharathi Press, Vijayawada-2.